www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 26-10-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 207 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి తె.6.05 తదుపరి షష్ఠి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ.10.47 తదుపరి మూల; వర్జ్యం: రా.7.40-రా.9.27; దుర్ముహూర్తం: సా.4.11-4.57; అమృతఘడియలు: ఉ.6.20-8.07; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తలంటిన రేవంత్.. మంత్రులు షాక్!

నన్ను ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా చిత్రీకరించడానికి జరుగుతున్న కుట్రను ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. త్వరలోనే అన్నింటికీ ముగింపు పలికిస్తా

పీసీసీ అధ్యక్షుడు కూడా ముఖ్యమంత్రితో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడం ఏమిటి? ఎవరికి వారు సొంతంగా ప్రకటనలు చేసుకుంటూ పోతే ముఖ్యమంత్రిగా నా పరిస్థితి ఏమిటి? వివిధ స్థాయిలలో సమన్వయం లేకపోతే ఎలా?

ఇప్పుడు నాలో సహనం నశించింది. ఏదైతే అదవుతుంది. ఇకపై నేను తెగింపుతో వ్యవహరిస్తాను. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యం. హద్దు మీరి పోతున్న మంత్రులపై చర్య తీసుకోవడానికి కూడా వెనుకాడను

గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ తనలోని ఆవేదనను, ఆక్రోశాన్ని ఇలా వెళ్లగక్కారు. సీఎం ఈ స్థాయిలో తలంటుతారని ఊహించని మంత్రులు ఒకింత షాక్‌కు గురయ్యారు.



కొత్త పలుకు!

మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలను ఉద్దేశించి... ' 'సీనియర్లుగా మిమ్మల్ని ఎంతో గౌరవించాను. నాతో సమానంగా గుర్తించి ప్రభుత్వంలో పెద్దపీట వేశాను. ఇంకేం చేయాలి?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

ఆయనలో ఆవేదన, ఆవేశం కట్టలు తెంచుకోవడానికి కారణం లేకపోలేదు. పార్టీ పైన, ప్రభుత్వం పైన సీఎం రేవంత్ రెడ్డికి పట్టులేదని ప్రజలు అభిప్రాయపడేలా ఇటీవలి కాలంలో కొన్ని సంఘటనలు చోటు చేసుకున్నాయి.

కొండా సురేఖ కుమార్తె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దారుణంగా దూషించారు. ముఖ్యమంత్రి అన్న గౌరవం కూడా లేకుండా ఆ అమ్మాయి అలా మాట్లాడటంతో రేవంత్ రెడ్డికి సహజంగానే బాధ కలిగింది. ఆమె కుమార్తె అన్న మాటలకు సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి ఉండాలి.

ఏక వ్యక్తి పాలనకు, ప్రాంతీయ పార్టీల కల్చర్‌కు అలవాటు పడిన తెలుగు ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు రుచించడం లేదు. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోంది. ప్రభుత్వంలోనే కాదు, పార్టీలోనూ రేవంత్ రెడ్డికి పట్టులేదన్న అభిప్రాయం వ్యాప్తిచెందుతోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అన్న వాస్తవాన్ని విస్మరించి ఎవరు పడితే వారు ఏది పడితే అది మాట్లాడుతుండటంతో జనంలో ఆయన పలుచన అవుతున్నారు.

రాష్ట్రానికి ఒక్కరే సీఎంగా ఉంటారన్న వాస్తవాన్ని విస్మరించి ఎవరికి వారు ముఖ్యమంత్రులుగా భావించుకోవడాన్ని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. కనీస ప్రజాదరణ లేని వాళ్లు సైతం తాము కాంగ్రెస్‌లో సీనియర్లం అని డాంబికాలు పోతూ రేవంత్‌ని జూనియర్ అని కించపరుస్తున్నారు.

ప్రభుత్వపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు కూడా కలసి రావడం లేదు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలన్న నిర్ణయం ఈ కోవలోకే వస్తుంది. ముందూ వెనుకా ఆలోచించకుండా, చట్టపరమైన చిక్కులను లోతుగా అధ్యయనం చేయకుండా ఈ నిర్ణయం తీసుకోవడంతో ఉభయ భ్రష్టత్వం ప్రాప్తించింది.

కాంగ్రెస్ ప్రభుత్వానికి దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో బలపడింది. ఈ దశలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది. ఈ స్థానాన్ని గెలుచుకోగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వం కొంతలో కొంత కుదుటపడుతుంది. ఫలితం అందుకు విరుద్ధంగా ఉంటే మాత్రం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం మరింత బలపడుతుంది.

కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితికి ఆ పార్టీ అధిష్ఠానం కూడా బాధ్యత వహించాలి. రాజశేఖర రెడ్డి హయాంలో వలె సీఎం రేవంత్‌కు స్వేచ్ఛ ఇవ్వడంలేదు. కాంగ్రెస్‌లో అందరినీ కలుపుకొనిపోవడం అంటే ఆషామాషీ కాదు. నాయకుడికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే అది సాధ్యం.

అధికారంలో ఉన్నంత కాలం పదవికి ఎన్నో తేవాలన్న లక్ష్యంతో మాత్రమే రేవంత్ రెడ్డి వ్యవహరిస్తే పరిస్థితుల్లో మార్పు రావొచ్చు. నిజానికి కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం రేవంత్ రెడ్డికి ప్రత్యామ్నాయం లేదు. రేవంత్ రెడ్డి కాని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కూలిపోవచ్చు. పార్టీ అధిష్ఠానం కూడా ఈ వాస్తవాన్ని గుర్తించాలి.

పార్టీలో, ప్రభుత్వంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను తన నాయకత్వ ప్రతిభను ప్రదర్శించడానికి లభించిన అవకాశాలుగా రేవంత్ రెడ్డి పరిగణించాలి. అలా చెయ్యలేని పక్షంలో విఫల ముఖ్యమంత్రిగానే మిగిలి పోవలసి వస్తుందని తెలుసుకోవాలి.

ఆర్కే విశ్లేషణ ...4లో

మీరు మారరా?

శాఖల మధ్య సమన్వయమే ఉండదా?.. మీరెలా పని చేస్తున్నారో అర్థమవుతోందా?

హైదరాబాద్‌లో ఏ రోడ్డుపై చూసినా చెత్తే.. ఆ పరిస్థితి ఎందుకొచ్చింది?.. ఇదీ నేనే చెప్పాలా?

శాఖాధిపతులే అలసత్వంగా వ్యవహరిస్తే ఎలా?.. మెరుగైన వ్యవస్థను తీసుకురావాలి

టిమ్స్ పనులపై గతంలో చెప్పిన వివరాలే మళ్లీ చెప్తారా?.. క్షేత్రస్థాయిలో ఒక్కసారైనా తిరిగారా?

పలు శాఖలపై సమీక్షల్లో అధికారుల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం



ఢిల్లీలో ఇందిరాభవన్‌లో కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్‌గౌడ్, మీనాక్షి, వంశీచంద్‌రెడ్డి

డీసీసీ అధ్యక్షుల భర్తీలో సామాజిక న్యాయం!

అన్ని వర్గాలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయం

ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌తో రేవంత్, భట్టి, మహేశ్‌గౌడ్ సుదీర్ఘ మంతనాలు

వారి నుంచి వేర్వేరుగా అభిప్రాయాలు సేకరించిన వేణుగోపాల్

రెండు, మూడు వారాల్లో డీసీసీల భర్తీ!

ఈలోగా మరోసారి ఢిల్లీకి రాష్ట్ర నేతలు

13

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): "హైదరాబాద్‌లో చెత్త సేకరణ, శుభ్రత విషయం కూడా నేనే చెప్పాలా. ఎటు చూసినా రోడ్లపై చెత్త కనబడుతోంది. మీకు కనబడడం లేదా.. అసలు తనిఖీలకు వెళ్తున్నారా.. క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేస్తున్నారా. మీ తీరు ఇకనైనా మార్చుకోండి.. చెత్త నిర్వహణపై తక్షణమే చర్యలు చేపట్టండి. మెరుగైన వ్యవస్థను రూపొందించండి. రోడ్లపై చెత్త కనబడితే చర్యలు తప్పవు"

"రెండు శాఖల మధ్య సమన్వయం చేసుకోవాలని, కలిసి పనిచేయాలని కూడా నేను చెప్పాలా. అది మీకు తెలియదా. సమీక్షకు వచ్చేటప్పుడు గతంలో ఇచ్చిన నివేదికలనే మళ్లీ తీసుకొస్తారా. ఇదా మీ పనితనం. కీలక అధికారులు వ్యవహరించేది ఇలాగేనా. ఇకనైనా సమన్వయంతో వ్యవహరించి.. పనులు త్వరితగతిన పూర్తి చేయండి" ఇటీవల పలు శాఖలపై సమీక్షల సందర్భంగా పలువురు ఐఏఎస్

మిగతా 13వ పేజీలో...



ఉద్యమకారులకు అన్యాయం

వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేకపోయాం

అమరుల ఆశయాలకు కొట్లాడలేకపోయా

అమరులు, ఉద్యమకారులకు ఇప్పుడు క్షమాపణలు చెబుతున్నా

20 ఏళ్లు కేసీఆర్, బీఆర్ఎస్ కోసం పనిచేశా

కుట్ర చేసి బయటకు పంపారు

నా దారి నేను వెతుక్కుంటున్నా: కవిత

నిజామాబాద్‌లో జాగృతి-జనం బాట షురూ

నిజామాబాద్/నవీపేట/గన్‌పార్క్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): "అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ వచ్చింది. కానీ.. వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేకపోయాం. ఉద్యమకారుల్లో కొంతమందికి మాత్రమే ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు వంటి అవకాశాలు వచ్చాయి. ఇంకా వేలాది మందికి న్యాయం జరగలేదు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అమరుల ఆశయసాధన కోసం నేను గట్టిగా

మిగతా 13వ పేజీలో...

జీవిత బీమా.. అదానీకి ధీమా!

సంక్షోభంలో చిక్కుకున్న అదానీ సంస్థలకు 33 వేల కోట్ల ఎల్ఐసీ సొమ్ము

అప్పులు తీర్చేందుకు ఆర్థిక శాఖ, నీతి ఆయోగ్ కలిసి ఇప్పించాయి

రూ.28 వేల కోట్ల బాండ్లు, 5 వేల కోట్ల షేర్లు.. ప్రజల సొమ్ముతో రిస్కీ కంపెనీకి నిధులు

ఇది క్రోనీ క్యాపిటలిజం కిందకే వస్తుంది.. వాషింగ్టన్ పోస్ట్ పత్రిక సంచలన కథనం

ప్రజల కష్టార్జితాన్ని అదానీకి ఎలా అప్పగిస్తారు?.. పీఏసీ దర్యాప్తు జరపాలి: కాంగ్రెస్

అది స్వతంత్ర నిర్ణయమే: ఎల్ఐసీ.. పెట్టుబడితో ఎల్ఐసీ లాభపడింది: అదానీ గ్రూప్





న్యూఢిల్లీ, అక్టోబరు 25: అదానీ గ్రూప్ సంస్థలు మరో వివాదంలో చిక్కుకున్నాయి. చెల్లింపుల సంక్షోభంలో ఇరుక్కున్న అదానీ సంస్థలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ కలిసి ఎల్ఐసీని 33 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టించేందుకు ఒప్పించాయని వాషింగ్టన్ పోస్ట్ సంచలన కథనం రాసింది. తమనెవరూ ప్రభావితం చేయలేదని, స్వతంత్రంగానే పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నామని ఎల్ఐసీ ఖండించినప్పటికీ వాషింగ్టన్ పోస్ట్ కథనం తీవ్ర దుమారం సృష్టించింది. అదానీ షేర్ల ధరలను కృత్రిమంగా పెంచారంటూ 2023లో హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణ ఆ కంపెనీని తీవ్ర ఇబ్బందుల్లో నెట్టింది. అమెరికా కంపెనీల తరఫున భారతదేశంలో రాజకీయ నాయకులకు లంచాలు ఇచ్చారని స్వయంగా అమెరికా న్యాయశాఖ ధ్రువీకరించిన ఘటనతో 2024లో అదానీ గ్రూప్ మరోసారి ఒడిదొడుకులకు లోనైంది. ఇలాంటి తరుణంలో తాజాగా మోదీ ప్రభుత్వం కష్టాల్లో ఉన్న అదానీకి అండగా నిలిచి క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహిస్తున్నదంటూ వాషింగ్టన్ పోస్టు శనివారం కథనం వెలువరించింది. అదానీ కంపెనీలు ఎదుర్కొంటున్న చెల్లింపుల సంక్షోభాన్ని పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం గత మే నెలలో ఎల్ఐసీతో 3.9 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టించే ప్రతిపాదన చేసిందని కథనం తెలిపింది. అందులో 3.4 బిలియన్ డాలర్లు(రూ.28,000 కోట్లు) అదానీ బాండ్లు కాగా, 507 మిలియన్ డాలర్లు(రూ.5,000 కోట్లు) అదానీ కంపెనీల్లో

మిగతా 12వ పేజీలో...

నిర్లక్ష్యపు నిప్పు!

కర్నూలు దుర్ఘటనలో కీలక మలుపు.. బస్సు రాకముందే డివైడర్‌ను ఢీకొన్న బైక్

మద్యం మత్తులో బైక్ నడిపిన శివశంకర్ మృతి.. రోడ్డు మధ్యలో పడిపోయిన బైక్

ఇదే మార్గంలో బెంగళూరు వెళ్లిన 3 బస్సులు.. బైక్‌ను గమనించి పక్కనుంచి వెళ్లిన డ్రైవర్లు

వేమూరి కావేరి బస్సు డ్రైవర్ మాత్రం బైక్‌ను తోసుకుంటూ ముందుకెళ్లడంతో ప్రమాదం

19 మంది ప్రయాణికులు సజీవదహనం.. అధికారికంగా నిర్ధారించిన పోలీసులు

కర్నూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కర్నూలు జిల్లాలో 19 మంది ప్రయాణికులను బలిగొన్న ఘోర బస్సు ప్రమాద ఘటనకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తేలింది. ఈ బస్సు రావడానికి ముందే బైక్ డివైడర్‌ను ఢీకొని, రోడ్డు మధ్యలో పడిపోయిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకుల్లో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరొకరు గాయపడ్డారని వెల్లడైంది. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ.. రోడ్డుపై ఉన్న బైకును తోసుకుంటూ వెళ్లడంతో ప్రమాదం జరిగిందని తేలింది. కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. బస్సు దుర్ఘటనపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు విచారణ బృందం శుక్రవారం రాత్రే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టింది. కర్నూలు నగరం నుంచి

మిగతా 3వ పేజీలో...



శుక్రవారం తెల్లవారుజామున 2:20 గంటల సమయంలో పెట్రోల్ బంకులో శివశంకర్, అతని స్నేహితుడు ఎర్రిస్వామి

మృతదేహాల కోసం నిరీక్షణ!

మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాలు

డీఎన్ఏ పరీక్షలకు విజయవాడ ల్యాబ్‌కు నమూనాలు

సోమవారం ఉదయం ఫలితాలు

ఆ తర్వాతే అప్పగిస్తామంటున్న అధికారులు

3



కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద పూర్తిగా కాలిన బస్సు వద్ద పోలీసు బృందం పరిశీలన

నాలుగు బస్సుల సీజ్

- 1.7 లక్షల రూపాయల జరిమానా
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్టీఏ విస్తృత తనిఖీలు
- ఏపీలో ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై కేసులు
- నిబంధనలు ఉల్లంఘించిన 289 బస్సులపై చర్యలు

3

అతివేగం.. ప్రాణ సంకటం!

గత 11 ఏళ్లలో తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో 86 వేల మంది మృతి

అతి వేగం వల్లే 85 శాతం ప్రమాదాలు

అనుమతులు, ప్రమాణాలు లేకున్నా రోడ్లపై యథేచ్ఛగా ట్రావెల్స్ బస్సుల చక్కర్లు

మామూళ్ల మత్తులో రవాణా అధికారులు

టార్గెట్ల కోసం మొక్కుబడిగా తనిఖీలు..

లొంగు'బాట'లో మావోయిస్టు హిడ్మా!

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోతారని కొన్నాళ్లుగా ప్రచారం

తెలంగాణలోనని నిఘా వర్గాల అంచనా

ఈ ఏడాది ఫిబ్రవరిలో వరంగల్‌లో లొంగిపోయిన హిడ్మా కుమార్తె కేషా

12

జంక్‌తో.. ఏఐ బుర్రలోనూ మట్టే!

ఇంటర్నెట్‌లోని చెత్త కంటెంట్‌తో ఏఐల్లో 'బ్రెయిన్ రాట్'

తగ్గుతున్న విశ్లేషణ, అధ్యయన సామర్థ్యం

ఏఐల ప్రవర్తనలోనూ విపరీత ధోరణి

టెక్సాస్, పర్డ్యూ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

12

యథాతథంగా మద్యం షాపుల లాటరీ

- దరఖాస్తుల గడువు పెంపు సమస్యపై మాత్రం తీర్పు వాయిదా
- తుది తీర్పునకు లోబడే కొత్త దరఖాస్తుల భవిష్యత్తు :హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల లైసెన్స్ దరఖాస్తు గడువును పొడిగించడం సరికాదంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. గడువు పెంచిన తర్వాత అంటే ఈనెల 19 నుంచి 23 వరకు వచ్చిన దరఖాస్తుల భవిష్యత్తు తాము ఇవ్వబోయే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. మద్యం దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తుల లాటరీ తీయడం, కేటాయింపు ప్రక్రియపై మాత్రం ఎలాంటి స్టే ఇవ్వలేదు. మద్యం దుకాణాల దరఖాస్తు చివరిరోజు గడువును ఈనెల 18 నుంచి ఈనెల 23కు పెంచుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఒక మెమో జారీచేశారు. ఈ మెమోను సవాల్ చేస్తూ దరఖాస్తుదారులు డీ వెంకటేశ్వరరావు, శ్రవణ్‌కుమార్‌గౌడ్, మాంజీత్ సింగ్ బగ్గా, హరీందర్‌పాల్ సింగ్ బంగా, సుక్మన్‌సింగ్ ఓషాన్ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శనివారం రెండో రోజు కూడా జస్టిస్ ఎన్ తుకారాంజీ ధర్మాసనం విచారణ కొనసాగించింది. శుక్రవారం జరిగిన విచారణ సందర్భంగా దరఖాస్తు గడువు పెంపునకు చట్టబద్ధత ఉందా? చివరి గడువు లోపు వచ్చిన దరఖాస్తులను మాత్రమే అంగీకరించాలని నిబంధనల్లో ఉంది కదా? అని ధర్మాసనం ప్రశ్నించింది. శనివారం జరిగిన వాదనల్లో అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వీటికి సమాధానాలు ఇచ్చారు. 'మద్యం తయారు చేయడం, విక్రయించడంపై ప్రభుత్వానికి ఏకస్వామ్యం ఉంది. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 18 చివరి రోజు కాగా, ఆ రోజున బీసీ సంఘాలు బంద్ నిర్వహించడంతో ఎవరికీ ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో గడువును 23 వరకు పొడిగించింది. ఇది ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగమే. 5వ పిటిషనర్ సుక్మాన్ సింగ్ ఓషాన్, 3వ పిటిషనర్ మాంజీత్ సింగ్ బగ్గాలు 23వ తేదీన దరఖాస్తులు చేశారు. అంటే టెండర్ల ప్రక్రియను అడ్డుకోవడానికే తప్ప వారు మంచి ఉద్దేశంతో పిటిషన్లు వేయలేదన్న విషయం స్పష్టమవుతోంది. అందువల్ల ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకూడదు' అని కోరారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదిస్తూ.. గడువు పెంచడం ద్వారా తెలంగాణ ఎక్సైజ్ మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీ - లైసెన్స్ షరతుల నిబంధనలు- 2012ను ప్రభుత్వం ఉల్లంఘించిందని తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు ఫీజు రూ. 3 లక్షలు చెల్లించాల్సి ఉందని, లైసెన్సు వచ్చినా, రాకపోయినా దాన్ని తిరిగి చెల్లించరని అన్నారు. గడువు పెంచుకుంటూ పోతే దరఖాస్తు దారుల సంఖ్య పెరిగి లాటరీ వచ్చే అవకాశాలు భారీగా తగ్గుతాయని చెప్పారు. ఈనెల 19 నుంచి 23 తర్వాత అతి తక్కువగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు అంటున్నారని, కానీ దుకాణాల వారీగా పోటీ ఉంటుందనే విషయాన్ని మరిచిపోతున్నారని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 18 తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలా? వద్దా? అనేది ఇక్కడ ప్రధాన సమస్య అని వ్యాఖ్యానించింది. దానిపై మాత్రమే ఆదేశాలు ఇస్తామని తెలిపింది.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కే బీసీల సంపూర్ణ మద్దతు

- నవీన్ సామాజిక కార్యకర్త.. బీఆర్ఎస్ నేతలే అసలైన రౌడీలు
- కేసీఆర్ తన ఆరోపణలు విరమించుకోవాలి: జాజుల

బర్కత్‌పుర/ హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో ఉన్నత విద్యావంతుడు - బహుజన బిడ్డ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు బీసీ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. నవీన్ యాదవ్ సామాజిక కార్యకర్త అని.. కానీ ఆయనపై రౌడీ షీటర్ అని ముద్ర వేసి అసత్య ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆ వ్యాఖ్యలను భేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. నవీన్ యాదవ్ ఏం నేరాలు చేశారో, ఏ పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందో కేసీఆర్ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. హైదరాబాద్‌లో యాదవులకు మంచి పేరుందన్న జాజుల.. బీసీలను మోసగించడంతో బీఆర్ఎస్ పార్టీకి సాటి లేదన్నారు. బీసీలంటే కేసీఆర్‌కు లెక్కలేదని చెప్పారు. పలువురు బీసీ సంఘాల నేతలతో కలిసి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జాజుల మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ పెంచి పోషించిన బీఆర్ఎస్ పార్టీ నేతలే అసలైన రౌడీలు, దోపిడీ దారులు, భూ కబ్జాదారులని ఆరోపించారు. ఓటు అనే ఆయుధంతో ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీలను ఓడించి రాజకీయంగా బొంద పెట్టడానికి బీసీ సమాజమంతా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆ 2 పార్టీలను బీసీలంతా ఏకమైన చిత్తుగా ఓడించాలని జాజుల పిలుపునిచ్చారు. కాగా, రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ సాకారం కావాలని కోరుతూ నవంబర్ ఒకటో తేదీన లంగర్ హౌజ్‌లోని బాపూఘాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కోరారు.

ఇంటర్ ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్

అన్ని గ్రూపులకు 20 శాతం ఇంటర్నల్ మార్కులు.. కొత్తగా ఏసీఈ (అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్) గ్రూప్

- ఎంపీసీ, బైపీసీ పాఠ్యాంశాల్లో మార్పు
- వచ్చే ఏడాది నుంచి అమలు
- ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు
- 494 అతిథి అధ్యాపకుల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- వారంలో నియామకాలు
- ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్ వచ్చే ఏడాది నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకూ నిర్వహించనున్నామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. విద్యార్థులకు ప్రయోగాత్మక (ప్రాక్టికల్) విద్య పరిజ్ఞానం ఎక్కువగా ఉండాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న అంశాలపై ఆయన శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. ఇక నుంచి ఇంటర్ అన్ని గ్రూపుల్లో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ప్రవేశపెడుతున్నామని, 20 శాతం మార్కులకు ఇంటర్నల్స్, 80 శాతం మార్కులకు వార్షిక పరీక్షలు ఉంటాయన్నారు. మొదటిసారి అరబిక్, ఉర్దూ, సంస్కృతం భాషల్లో కూడా ప్రయోగాత్మక పాఠాలు (ల్యాబ్ ప్రాక్టికల్స్) ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇవి ఇంగ్లిష్ భాషా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంపీసీ, బైపీసీ అన్ని సబ్జెక్టుల్లో కొత్త పాఠ్యాంశాలు అందుబాటులోకి వస్తాయని, దీని కోసం సబ్జెక్టు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇంతకుముందు చివరిసారిగా 11 ఏళ్ల క్రితం పాఠ్యాంశాల మార్పు జరిగిందని కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. కొత్తగా ముద్రించే పుస్తకాలపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దీంతో విద్యార్థులు ఆన్‌లైన్లోనూ చదువుకునే వీలుంటుందన్నారు. అలాగే భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఏసీఈ (అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్) గ్రూప్‌ను ప్రారంభిస్తున్నామని, ఇది ప్రభుత్వ కాలేజీల్లోనూ అందుబాటులో ఉంటుందన్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు నిర్వహిస్తామని, పరీక్ష ఫీజు నోటిఫికేషన్ నవంబరు1న విడుదల చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు స్థానిక ప్రైవేటు కాలేజీల్లోని ప్రయోగశాలల్లో ప్రయోగాలు చేసుకునేందుకు ఉద్దేశించిన టీ-స్టెమ్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందని, దీని కోసం అత్యాధునిక వసతులున్న 1,400 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలను గుర్తించామన్నారు. 494 అతిథి అధ్యాపకులను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని, వారం రోజుల్లో నియామకం చేస్తామన్నారు. గురుకులాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసే అధికారం జిల్లాస్థాయిలో కలెక్టర్లకే ఇచ్చామని గురుకులాల సంస్థకు కార్యదర్శిగా కూడా ఉన్న కృష్ణ ఆదిత్య తెలిపారు.



ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య

కార్పొరేట్ల కోసమే ఇంటర్నల్స్: ఇంటర్ విద్య జేఏసీ

విద్యావేత్తలు, తల్లిదండ్రులు, నిపుణులతో కనీసం చర్చించకుండా ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ప్రకటించడం పట్ల ఇంటర్ విద్య జేఏసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై రెండేళ్ల క్రితం చర్చించిన అధికారులు.. విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా తమ నిర్ణయాన్ని విరమించుకున్నారని, ఇప్పుడు ఎలాంటి చర్చలే కుండా ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని జేఏసీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ సైతం ఇంటర్నల్ మార్కుల విధానాన్ని వ్యతిరేకించిందని గుర్తుచేశారు. ఇంటర్నల్ మార్కులతో ఇంటర్ విద్య పతనమవుతుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. పదో తరగతి ఇంటర్నల్ మార్కులను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అలాంటప్పుడు ఇంటర్‌లో ప్రారంభించడం వెనక ఉద్దేశమేమిటని శనివారం జేఏసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. కొఠారీ కమిషన్ సిఫారసుల నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో నాడు విద్యాశాఖ మంత్రి పీవీ నరసింహారావు ఉన్నప్పటినుంచే ఇంటర్‌లో 100మార్కుల పరీక్షల విధానం కొనసాగుతోందన్నారు. ఇంటర్నల్ విధానంతో రాష్ట్రంలోని కార్పొరేట్ కాలేజీలు మరింత రెచ్చిపోతాయని, ఈ నిర్ణయంతో ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య మరింత తగ్గుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ శివార్లలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు జిల్లాల్లో వర్షాలు
- తుపాను ప్రభావంతో రేపటి నుంచి 3 రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం కురిసిన భారీవర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుండపోత వర్షంతో చందానగర్, ఆర్సీపురం, గచ్చిబౌలి, షేక్‌పేట ప్రాంతాల్లో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. శేరిలింగంపల్లి సుదర్శన్‌కాలనీలో ప్రధాన రహదారులపై వరద నీరు పోటెత్తడంతో రెండు ద్విచక్రవాహనాలు వరదలో కొట్టుకుపోతుండగా స్థానికులు పట్టుకున్నారు. చందానగర్‌లో అత్యధికంగా 5.3 సెం.మీ వర్షం కురిసింది. లింగంపల్లి అండర్ బ్రిడ్జిని వరద నీరు ముంచెత్తడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయిఇ. గచ్చిబౌలి, అమీర్‌పేట, చందానగర్, హఫీజ్‌పేట ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జాం సమస్యలు తలెత్తాయి. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఆమనగల్లు మార్కెట్ యార్డులో ఆరబెట్టిన మొక్కజొన్న వర్షానికి తడిసి రైతులు ఇబ్బంది పడ్డారు. నందిగామ మండలంలో శనివారం కురిసిన వర్షానికి పత్తి పంట తడిసి ముద్దయింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు భారీవర్షం కురిసింది. పత్తి పంటకు మరింత నష్టం వాటిల్లింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలో అత్యధికంగా 81 మి.మీ. వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లా కొత్తకోటలో 59.4, నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో 56.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రాంతం వాయుగుండంగా మారింది. ఆదివారానికి ఇది తీవ్ర వాయుగుండంగా మారి సోమవారం నాటికి తుపానుగా మారి, 28వ తేదీ సాయంత్రానికి కాకినాడ వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఆ సమయంలో భారీ వర్షాలతో పాటు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ఈ తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో 27 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణకు డిక్లరేషన్

తొలివిడతలో 396.27 ఎకరాల నిర్ధారణ

(ఆంధ్రజ్యోతి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి), అక్టోబరు 25: ఔటర్ రింగురోడ్డు రావిర్యాల జంక్షన్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా రీజినల్ రింగురోడ్డు వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం గతంలో భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం తాజాగా డిక్లరేషన్ ప్రకటించింది. తొలివిడత నిర్మించే 110మీటర్ల వెడల్పు, 18.5కి.మీ పొడవైన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు 396.27 ఎకరాలను సేకరిస్తున్నట్లు డిక్లరేషన్‌లో వెల్లడించింది. ఇక్కడ 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంటే మెట్రో రైలు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. మహేశ్వరం మండలంలోని కొంగర ఖుర్ద్ గ్రామంతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, కందుకూరు మండలంలోని లేమూరు, రాచలూరు, తిమ్మాపూర్, గుమ్మడివెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టింది. భూసేకరణ చట్టం ప్రకారం హేతుబద్ధమైన పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొంది. వంద శాతం నష్టపోతున్న కొంగరకుర్దు గ్రామానికి చెందిన 2కుటుంబాలకు పునరావాసం కింద రూ.5,60,000 చొప్పున పరిహారం ఇవ్వనున్నారు.

లోకం తీరు



2026లో 19వేల మెగావాట్ల డిమాండ్!

- దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి
- డీటీఆర్, ఫీడర్ల ఆటోమేషన్‌చేయాలి
- ఈవీ హబ్‌గా హైదరాబాద్:నవీన్ మిత్తల్

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రానున్న రబీ సీజన్‌తో పాటు వేసవిలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో ఉండే అవకాశం ఉందని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ అన్నారు. 2026లో విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరనుందని అంచనా వేశారు. దక్షిణ డిస్కమ్ ప్రధాన కార్యాలయంలో జెన్‌కో ట్రాన్స్‌కో, దక్షిణ డిస్కమ్, ఉత్తర డిస్కమ్, రెడ్‌కో, సింగరేణి ఉన్నతాధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినా విద్యుత్‌ను అందించగలిగామని చెప్పారు. వచ్చే ఏడాది గరిష్ఠ డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రబీ ప్రారంభానికి ముందే లైన్ల మరమ్మతులు, కొత్త ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుతో పాటు, ఇతర అభివృద్ధి పనులన్నీ డిసెంబరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ అందించడానికి వీలుగా కొత్త లైన్లతో పాటు 33/132/220/400 కేవీ సబ్ స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలన్నారు. తెలంగాణ జెన్‌కో పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లలో ఓవర్ హాలింగ్ దాదాపుగా అన్ని యూనిట్లలో పూర్తయిందని, మరికొద్ది నెలల్లో 4వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్‌లో విద్యుత్ ఉత్పాదన పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఎల్‌టీ 11కేవీ నెట్‌వర్క్ స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ల నిర్వహణలో ఆటోమేషన్ విధానం అమలులోకి తీసుకురావాలని డిస్కమ్‌ల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన స్కాడా తరహా సాంకేతికతను గ్రామాలకు సైతం విస్తరింపజేయాలన్నారు.పీఎం-ఈ డ్రైవ్‌లో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ కేంద్రాలకు ఇస్తున్న రాయితీలను ప్రభుత్వ రంగ సంస్థలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చార్జీలు తగ్గించినా సగం సీట్లు ఖాళీ!

- ప్రైవేటు ట్రావెల్స్‌పై ప్రయాణికుల్లో జంకు
- గతంలో బుక్ చేసుకున్న టికెట్ల రద్దు
- బోసిపోయిన టికెట్ కౌంటర్లు

హైదరాబాద్, ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కర్నూలు జిల్లాలో వేమూరి కావేరి ట్రావెల్స్ ఘోర అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలతో పాటు బెంగళూరు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలు శనివారం తగ్గాయి. వేమూరి కావేరి ట్రావెల్స్ తమ బస్సు సర్వీసుల టికెట్ల ధరలను బాగా తగ్గించింది. ఏపీలోని కావలికి గురువారం టికెట్ బుక్ చేసుకున్నప్పుడు రూ.1800 వసూలు చేశారు. ప్రమాదం నేపథ్యంలో అదే కావలికి టికెట్ ధరను రూ.1100గా నిర్ణయించారు. ఇతర ప్రైవేటు బస్సుల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. హైదరాబాద్ నుంచి వెల్లూర్ (తమిళనాడు) వెళ్లే బస్సులో టిక్కెట్ ధర సాధారణంగా రూ.2 వేలు ఉండేది. ఇప్పుడు రూ. 1500కే ఇచ్చారు. ప్రమాదం నేపథ్యంలో వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రయాణికులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇప్పటికే వివిధ మార్గాలకు సంబంధించి టిక్కెట్లు బుక్ చేసుకున్న వారిలో కొందరు వాటిని రద్దు చేసుకున్నారు. ప్రమాదం తర్వాత వేమూరి కావేరి ట్రావెల్స్‌కు కొత్తగా టిక్కెట్ బుక్ చేసుకున్నవారు కూడా లేనట్లు తెలిసింది. ప్రమాదం నేపథ్యంలో హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ట్రావెల్ సర్వీసులు సైతం టిక్కెట్ ధరల్ని తగ్గించినట్లు తెలిసింది. పలు ప్రైవేటు ట్రావెల్స్ బుకింగ్ కౌంటర్లు శనివారం బోసిపోయాయి. ఆ బస్సుల్లో బుకింగ్స్ లేక సగం మంది ప్రయాణికులతోనే సర్వీసులు నడిపించారు. మరోవైపు.. ప్రయాణికుల్లో కొందరు ట్రావెల్స్ బస్సుల వద్ద ఆరా తీస్తూ కనిపించారు. డ్రైవర్ మంచోడేనా? లోపల బ్యాటరీల తరహాలో మండే గుణం ఉన్న పార్శిళ్లు గానీ పెట్టారా? అని నిర్వాహకులను అడిగారు. బస్సెక్కిన తర్వాత.. బాబ్బాబూ కాస్త జాగ్రత్తగా తోలు అని డ్రైవర్‌ను బతిమాలుకోవడం కనిపించింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల నిర్వాహకులూ జాగ్రత్త పడ్డారు. ఫిట్‌నెస్ సరిగా లేని బస్సు సర్వీసులను ఎప్పటిలాగే రోడ్డెక్కిస్తే అధికారులు సీజ్ చేస్తారనే భయంతో వాటిని రద్దు చేశారు. ప్రయాణికులు తమ వెంట ఏమేం తెస్తున్నారు? అనే విషయాన్ని పరిశీలించారు. పార్శిళ్లనూ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న వస్తువులను తీసుకోబోమని స్పష్టం చేశారు.

ఆర్టీసీ వైపు మొగ్గు

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో శనివారం ప్రయాణికుల్లో ఎక్కువమంది ఆర్టీసీ సర్వీసులవైపు మొగ్గుచూపారు. బెంగళూరు, విజయవాడ మార్గాల్లో శనివారం ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో గతంతో పోలిస్తే కొంత ఎక్కువ టిక్కెట్లు బుక్ కావడమే అందుకు నిదర్శనం. తెలంగాణ, ఏపీ ఆర్టీసీ సర్వీసుల వైపు ప్రయాణికులు మొగ్గు చూపుతున్నారు. ప్రయాణికులను తమ స్లీపర్ బస్సులవైపు ఆకర్షించేందుకు సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను ఎంచుకోవాలని స్లీపర్ బస్సు ఫొటోలతో ఎక్స్‌లో తెలంగాణ ఆర్టీసీ ప్రకటనలు ఇస్తోంది.

నకిలీ సర్టిఫికెట్‌తో హెవీ డ్రైవింగ్ లైసెన్స్!

- చదివింది ఐదో తరగతి.. 10 తప్పినట్టు పత్రాలు
- ఆర్టీయేను మాయ చేసిన.. కావేరి డ్రైవర్ లక్ష్మయ్య
- గతంలోనూ ప్రమాదం.. క్లీనర్ మృతికి కారణం


డ్రైవర్ లక్ష్మయ్య(ఫైల్)

కారంపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలోని చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన వేమూరి కావేరి బస్సును నడిపిన డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్య ఆర్టీయే అధికారులను మాయ చేసినట్టు పోలీసులు గుర్తించారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య.. పదో తరగతి చదివినట్లు నకిలీ సర్టిఫికెట్ సృష్టించి దాని ఆధారంగా హెవీ లైసెన్సు పొందాడు. వాస్తవానికి హెవీ డ్రైవింగ్ లైసెన్సు పొందడానికి కనీసం 8వ తరగతి వరకు చదివి ఉండాలి. కానీ, లక్ష్మయ్య 5వ తరగతి వరకు మాత్రమే చదివాడు. ఈ క్రమంలో నకిలీ సర్టిఫికెట్ సృష్టించి హెవీ లైసెన్సు పొందినట్టు పోలీసులు తాజాగా గుర్తించారు. ఇక, లక్ష్మయ్య డ్రైవింగ్ కెరీర్ కూడా ఏమీ బాగోలేదని తెలుస్తోంది. 2004లో లారీ నడుపుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టాడు. నాటి ఘటనలో లారీ క్లీనర్ మృత్యువాత పడగా లక్ష్మయ్య తృటిలో తప్పించుకున్నాడు. తర్వాత హైదరాబాద్‌లో కావేరీ ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా చేరాడు. ఈ క్రమంలో ఆయన హైదరాబాద్-బెంగళూరు మధ్య నడిచే బస్సులకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తాజాగా కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదానికి.. డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్య నిర్లక్ష్యమే కారణమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పోలీసులు లక్ష్మయ్యను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.


బోల్తా పడిన న్యూగో ట్రావెల్స్ బస్

ఔటర్‌పై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

9 మందికి గాయాలు.. పెద్ద అంబర్‌పేట్ వద్ద ఘటన

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓఆర్‌ఆర్‌పై ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి ఇనుప రేలింగ్‌ను ఢీకొట్టి.. 20 అడుగుల లోతులో బోల్తా కొట్టిం ది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ ఔట ర్ రింగురోడ్డులో శనివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో బస్సులో ఆరుగురు ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, ఒక చెకింగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. అందరికీ గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. 40సీట్ల సామర్థ్యం గల న్యూగో ఎలక్ట్రిక్ ట్రావెల్స్ బస్సు శనివారం ఉదయం మియాపూర్ నుంచి ఏపీలోని గుంటూరుకు బయలుదేరింది. మియాపూర్‌లో గుంటూరుకు చెందిన మౌనిక, కేపీహెచ్‌బీవద్ద షేక్ జహీర్, బంగిడాల ప్రత్యూష, కార్తీక్, మూసాపేట వై జంక్షన్ వద్ద అంబటి ప్రభాకర్, ఆకుల గాయత్రి బసెక్కారు. ఆరుగురు ప్రయాణికులతో ఉదయం 11 గంటలకు బస్సు మియాపూర్ నుంచి గచ్చిబౌలి ఔటర్ రింగురోడ్డు మీదుగా గుంటూరుకు బయలుదేరింది. శనివారం మధ్యాహ్నం పెద్ద అంబర్‌పేట్ ఓఆర్‌ఆర్ ప్రధాన రోడ్డు నుంచి టోల్‌ప్లాజా వద్దకు వస్తుండగా బస్సుకు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో పాటు డ్రైవర్ వీరాంజనేయ రెడ్డి, అదనపు డ్రైవర్ శ్రీనివాస్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ గోపీకృష్ణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బస్ పర్మిట్ వ్యాలిడిటీ 2028 వరకు ఉన్నప్పటికీ, ఆథరైజేషన్ వ్యాలిడిటీ, ఫిట్‌నెస్, పొల్యూషన్ వ్యాలిడిటీ 5వ నెల 2025కే ముగిసింది. ఇన్సూరెన్స్ కూడా 2024లోనే అయిపోయినట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నిర్లక్ష్యపు నిప్పు!

(మొదటి పేజీ తరువాయి)



చిన్నటేకూరు సమీపంలో ప్రమాదం జరిగిన ప్రదే శం వరకు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బస్సు తగలబడిపోవడానికి కారణమైన పల్సర్ బైక్‌పై మృతుడు శివశంకర్‌తోపాటు స్నేహితుడు సి.ఎర్రిస్వామి కూడా ఉన్నట్టు గుర్తించి విచారించారు.

ముందు ఏం జరిగిందంటే..?

కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు గ్రామం ప్రజానగర్‌లో నివాసం ఉంటున్న బి.శివశంకర్, తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన సి.ఎర్రిస్వామి స్నేహితులు. గురువారం రాత్రి ఇద్దరూ కర్నూలులో భోజనం చేశారు. ఎర్రిస్వామిని అతడి స్వగ్రామం తుగ్గలి మండలం రాంపల్లిలో దింపేందుకు శివశంకర్ తన బైక్‌పై ఎక్కించుకొని గురువారం అర్ధరాత్రి బయలుదేరాడు. 'వర్షం వస్తోంది.. ఉదయమే వెళ్తా' అని ఎర్రిస్వామి వారించినా వినలేదు. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి-44లో చిన్నటేకూరు సమీపంలో కియా కార్ల షోరూం ఎదురుగా ఉన్న ఓ బంకులో రూ.300 పెట్రోల్ పట్టించుకున్నారు. అప్పుడు సమయం అర్ధరాత్రి 2:24 గంటలు. ఆ బైక్‌కు హెడ్‌లైట్ వెలగడం లేదని, లెఫ్ట్ ఇండికేటర్ వెలుతురులోనే వారు వెళ్లారని బంకు సిబ్బంది తెలిపారు. తర్వాత 2:42 గంటలకు ఆరంఘర్ హోటల్ వద్ద వారు సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యారు. అక్కడి నుంచి 2కి.మీ. వెళ్లాక 2:45 గంటలకు బైక్ కుడివైపు డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిపోయింది. వెనుక కూర్చున్న ఎర్రిస్వామి డివైడర్ మధ్యలో గడ్డిపై పడటంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. రోడ్డుపై పడిపోయిన బి.శివశంకర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చలనం లేని మిత్రుడిని ఎర్రిస్వామి రోడ్డు పక్కకు లాగారు. ఆ తర్వాత పది నిమిషాల వ్యవధిలో ఓ ఆర్టీసీ బస్సు సహా 3 బస్సులు బెంగళూరు వైపు వెళ్లాయి. వాటి డ్రైవర్లు రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను గమనించి పక్క నుంచి తీసుకెళ్లారు. ఆ బైక్‌ను రోడ్డుపైనుంచి పక్కకు లాగేద్దామని ఎర్రిస్వామి ప్రయత్నించారు. 2:55 గంటలకు వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వచ్చింది. రోడ్డుపై పడిఉన్న బైక్‌ను తోసుకుంటూ వెళ్లింది. భారీ శబ్దం రావడంతో డ్రైవర్ బ్రేక్ వేసి వదిలి, ముందుకు వెళ్లాడు. మళ్లీ భారీ శబ్దం రావడంతో మరోసారి బ్రేక్‌వేసి వదిలాడు. ఈ క్రమంలో బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్ ట్యాంక్‌మూత తెరుచుకొని పెట్రోల్ రోడ్డుపై కారుతూ వచ్చింది. బైక్, రోడ్డు మధ్య రాపిడితో నిప్పురవ్వలు ఎగిసి పెట్రోల్ అంటుకుంది. క్షణాల్లో బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. 15 నిమిషాల్లో ఘోరం జరిగిపోయింది. ఏపీకి చెందిన ఆరుగురు, తెలంగాణకు చెందిన ఆరుగురు, కర్ణాటకకు చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, బిహార్, ఒడిశాకు చెందిన ఒక్కొక్కరు, గుర్తు తెలియని మరో వ్యక్తి కలిపి 19మంది మంటల్లో సజీవదహనం అయ్యారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం..

ప్రమాద ఘటనకు ప్రైవేటు బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎంత వర్షం పడుతున్నా బస్సు హెడ్ లైట్ వెలుతురులో రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను గుర్తించకపోవడం బాధ్యతారాహిత్యమని అంటున్నారు. బైక్‌ను ఢీకొనగానే దఢేల్‌మని భారీ శబ్దం వచ్చిందని ప్రయాణికులు చెబుతున్నారు. శబ్దం రాగానే బ్రేక్ వేసి వదిలేశానని డ్రైవర్ లక్ష్మయ్య కూడా పోలీస్ విచారణలో వెల్లడించినట్లు సమాచారం. తక్షణమే బస్సు ఆపేసి కిందకు దిగి, ఏం జరిగిందో గుర్తించి ఉంటే 19 మంది ప్రాణాలు అగ్నికి ఆహుతి అయ్యేవి కావని సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు అంటున్నారు. బస్సు ముందు భాగం లో పల్సర్ బైక్ ఇరుక్కుపోయినా డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా దాదాపు 200 మీటర్ల వరకు బస్సును వేగంగా ముందుకు పోనిచ్చారని, అప్పటికే బస్సుకు మంటలు అంటుకున్నాయని చెబుతున్నారు.

మృతదేహాల కోసం నిరీక్షణ!

కర్నూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాద దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులు తమవారి మృతదేహాల కోసం నిరీక్షిస్తున్నారు. ఆప్తులను కోల్పోయిన ఆవేదనకు తోడు డీఎన్ఏ రిపోర్టు రావడానికి కనీసం 48గంటలు పడుతుందని చెబుతుండటంతో ఉసూరుమంటున్నారు. ప్రమాదం జరిగి 24గంటలు గడిచినా ఈ విషయమై స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనలో పూర్తిగా కాలిపోయిన మృతదేహాలు మాంసపు ముద్దగా మారాయి. ఏ మృతదేహం ఎవరిదో గుర్తించలేనంతగా కాలిపోవడంతో భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా డీఎన్ఏ పరీక్షల అనంతరం మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. డీఎన్ఏ పరీక్షల కోసం మృతదేహాలు, మృతుల రక్తసంబంధీకుల నుంచి నమూనాలు సేకరించారు. ఈ శాంపిల్స్ శనివారం ఉదయం విజయవాడ ల్యాబ్‌లో అప్పగించారు. డీఎన్ఏ పరీక్షల ఫలితాలు సోమవారం ఉదయం వచ్చే అవకాశం ఉందని, ఆ తర్వాతే మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు.

సామాజిక మార్పులో సాహిత్యం పాత్ర ప్రముఖం

- ఛాయా సాహిత్యోత్సవంలో.. తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్
- పాల్గొన్న దక్షిణాది రచయితలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని మరింత మానవీయంగా మార్చడంలో సాహిత్యం పాత్ర అత్యంత ప్రముఖమైనది అని ప్రఖ్యాత తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ అన్నారు. మానవాభివృద్ధికి అవరోధమైన అమానవీయతను ప్రశ్నించడంతో పాటు సమాజాన్ని ముందుకు నడిపించే విధంగా సామాజిక విలువలను ఎత్తిపడుతూ రాసేదే అసలైన సాహిత్యం అని నొక్కి చెప్పారు. జూబ్లీహిల్స్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో శనివారం ఛాయా సాహిత్యోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమ డైరెక్టర్ కె. శ్రీనివాస్ ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం పెరుమాళ్ మురుగన్ మాట్లాడుతూ.. కళ కళ కోసమేనన్న భావనలకు కాలం చెల్లిందని ఉద్ఘాటించారు. రచనా వ్యాసంగం పూర్తి సామాజికమైన విషయంగా పేర్కొన్నారు. ప్రముఖ కన్నడ రచయిత వసుధేంద్ర మాట్లాడుతూ.. ధైర్యం లేని వాళ్లు అసలు రచయితలే కారని వ్యాఖ్యానించారు. సత్యాన్వేషణ రచయితల ప్రాథమిక అర్హత అన్నారు. ప్రముఖ మలయాళ రచయిత్రి షీలాటోమీ మాట్లాడుతూ... కేరళ రాష్ట్రంలో తాను పుట్టి పెరిగిన వయనాడ్ ప్రాంతంలోని మార్పులే తన తొలి రచనకు ప్రేరణ అని వివరించారు. అక్కడ తలెత్తిన ప్రకృతి విధ్వంసాన్ని, వనరుల దోపిడీ వంటి అంశాలను 'వల్లీ' నవలలో చర్చించినట్లు చెప్పారు. గల్ఫ్ దేశాలకు మహిళల వలసలు ఇతివృత్తంగా రాసిన మరొక నవల గురించి ప్రేక్షకులతో ఆమె సంభాషించారు. ఆ నవలలో వలస మహిళలను బాధితులుగా కాక వారి ఆత్మస్థైర్యం, శక్తి సామర్థ్యాలను అక్షరీకరించినట్లు తెలిపారు. మరొక ప్రముఖ రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ.. శ్రీకాకుళం గిరిజన, రైతాంగ సాయుధ పోరాటంతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్ భూపోరాటాలు తెలుగు నవలను ప్రభావితం చేశాయని అన్నారు. తన రచనానుభవాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. రోజంతా వివిధ అంశాలపై ఛాయా సాహిత్యోత్సవంలో చర్చాగోష్ఠులు, సంభాషణలు కొనసాగాయి. రెండు వేలమందికిపైగా ప్రేక్షకులు హాజరయ్యారు. చివరిగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కవితా గానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

4 బస్సుల సీజ్

- రూ. 1.7 లక్షల జరిమానా.. గ్రేటర్‌లో ఆర్టీఏ తనిఖీలు
- ఏపీలో 289 బస్సులపై కేసుల నమోదు

హైదరాబాద్ సిటీ, అమరావతి, విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన ఘోర బస్సు ప్రమాదం నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ లో ఆర్టీఏ అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న 68 ప్రైవేట్ బస్సులను గుర్తించారు. ఆర్టీఏ నిబంధనల ప్రకారం ట్రావెల్స్ బస్సుల్లో ఉండాల్సిన అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, అత్యవసర ద్వారాలు లేనివాటిని, సాధారణ సీట్లను పరిమితికి మించి పెంచిన బస్సును గుర్తించారు. ఇందులో భాగంగా ఆయా వాహనాలకు రూ. 1.7 లక్షల జరిమానా విధించారు. జరిమానాలు చెల్లించకుండా తిరుగుతున్న 4 బస్సులను సీజ్ చేశారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 25 వరకు గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 8,848 కేసులు బుక్ చేశారు. ఈ మేరకు రూ.2.28 కోట్ల కాంపౌండింగ్ ఫీజు, రూ.14.68 కోట్ల ట్యాక్స్‌లు, జరిమానాలు వసూలు చేశారు. అలాగే 877 వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే, ఏపీలో ఒక్కరోజే 289 ట్రావెల్ బస్సులపై రవాణా అధికారులు కేసులు నమోదు చేశారు. ఇందులో అగ్నిమాపక పరికరాలు లేని బస్సులు ఏకంగా 103 ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. అసలు రవాణా చట్టాన్నే లెక్క చేయకుండా తిరుగుతున్న 18 ప్రైవేటు ట్రావెల్ బస్సులను సీజ్ చేసినట్లు రవాణా శాఖ కమిషనర్ మనీశ్‌కుమార్ సిన్హా తెలిపారు.

కళ్ల ముందు అక్రమాలు కానరావా?

- అనుమతి లేకున్నా, భద్రతా ప్రమాణాలు పాటించకున్నా రోడ్లపై యథేచ్ఛగా ట్రావెల్స్ బస్సుల చక్కర్లు
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు
- కేసుల నమోదులోనూ చేతివాటం..

హైదరాబాద్ సిటీ/ గన్‌పార్క్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులతో పోటాపోటీగా, ఒకలా చెప్పాలంటే తోసిరాజనేలా పెద్ద సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రాష్ట్రంలో చక్కర్లు కొడుతున్నాయి. రవాణాశాఖ లెక్కల ప్రకారమే.. హైదరాబాద్ నుంచి వివిధ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకు సుమారు 1,100 ప్రైవేటు బస్సులు తిరుగుతున్నాయి. రవాణా శాఖ అధికారులు ఆ బస్సులు నిబంధనల ప్రకారం ఉన్నాయా లేదా అన్నది తనిఖీ చేయాలి. రిజిస్ట్రేషన్, ఆలిండియా పర్మిట్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్లతోపాటు ప్రయాణికుల భద్ర తకు సంబంధించి అగ్నిమాపక పరికరాలు, అత్యవసర ద్వారాలు, ప్రథమ చికిత్స కిట్లు, అత్యవసర పరిస్థితుల్లో అద్దాలు బద్దలుగొట్టేందుకు వీలుగా సీట్ల సుత్తెలు వంటివి ఉన్నాయో లేదో చూడాలి. రవాణా శాఖ అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రవాణా శాఖలో ఒక్కో ఫైల్‌కు ఒక్కో రేటు ఉంటుందని, ఇది అందరికీ తెలిసిందేనని ఏజెంట్లు చెబుతున్నారు. ట్రావెల్స్ బస్సులకు సంబంధించి రవాణా శాఖకు అధికారికంగా చెల్లించే ఫీజులతోపాటు రూ.5వేల నుంచి రూ.10 వేలవరకు మామూళ్లు తప్పవని అంటున్నారు. మరోవైపు టార్గెట్లు పూర్తి చేయడం, పనిచేస్తున్నామని చూపించుకోవడం కోసం అధికారులు నామమాత్రంగా బస్సులను తనిఖీలు చేస్తుంటారని, ఆ సమయంలోనూ చేతివాటం చూపించి మొక్కుబడి కేసులు, జరిమానాలతో సరిపుచ్చుతారనే ఆరోపణలెన్నో ఉన్నాయి.

ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి

ఏదైనా దుర్ఘటన జరిగినప్పుడు, టార్గెట్‌లు పూర్తి చేయాలనుకున్నప్పుడు మాత్రం రవాణా శాఖ అధికారుల హడావుడి కనిపిస్తుంటుంది. ఇప్పుడు కర్నూలులో ఘోర ప్రమాదం జరిగిన రోజు నుంచే హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా హైవేలపై తనిఖీ చేపట్టారు. ఒకే రోజులోనే నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న 68 ప్రైవేట్ బస్సులను గుర్తించారు. రూ.1.70 లక్షల జరిమానాలు విధించారు. గతంలోని జరిమానాలు చెల్లించకుండా తిరుగుతున్న 4 బస్సులను సీజ్ చేసినట్టు అధికారులు ప్రకటించారు. ఇన్ని రోజులుగా అవి తిరుగుతున్నా కనిపించలేదా అనే విమర్శలు వస్తున్నాయి.

రోడ్లపైనే బస్సులు నిలుపుతున్నా..

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్ నగరంలోని రద్దీ ప్రాంతాలైన అమీర్‌పేట, లక్డీకాపూల్, సెక్రటేరియట్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కనే గంటలకు గంటలు పార్క్ చేసి ఉంటాయి.లక్డీకాపూల్ అయితే రవాణశాఖ ప్రధాన కార్యాలయానికి సమీపంలోనే ఉంటుంది. అక్కడి రైల్వే ఖాళీ స్థలంలో 50కిపైగా ట్రావెల్స్ బస్సులు పార్క్ చేస్తారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు పక్కన బస్సులు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు వస్తున్నా పట్టించుకునేవారే లేరనే విమర్శలు ఉన్నాయి.

అతివేగం.. ప్రాణ సంకటం!

గత 11 ఏళ్లలో తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో 86 వేల మంది మృతి

- ప్రమాదాల్లో 85% అతివేగం వల్లే!
- నామ్‌కే వాస్తేగా రోడ్‌సేఫ్టీ అథారిటీ డీజీపీ పోస్టు
- ఏళ్లకేళ్లుగా పదవి ఖాళీ.. సిబ్బంది కూడా కరువు



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు ఏటేటా పెరిగిపోతున్నాయి. వేలాది మంది ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. గత 11 ఏళ్లలో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారి సంఖ్య 86 వేలకుపైగానే ఉండటం గమనార్హం. రోడ్డు ప్రమాదాల సంఖ్యలో తెలంగాణ ఏటా జాతీయ స్థాయిలో 6 నుంచి 8 స్థానాల మధ్యలోనే ఉంటోంది. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవించినపుడు.. అక్కడ ప్రమా దం ఎందుకు జరిగింది? మరణం సంభవించడానికి కారణాలేమిటి? రోడ్డు నిర్మాణ లోపాలు ఉన్నాయా? అతి వేగమా? మరేదైనా కారణముందా అని గుర్తించాల్సిన వ్యవస్థలు నిర్వీర్యమవడమే దీనికి కారణమనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ కోసం పోలీసుశాఖలో అదనపు డీజీ స్థాయి అధికారికి రోడ్‌సేఫ్టీ విభాగం బాధ్యతలు అప్పగిస్తుంటారు. ప్రత్యేకంగా రోడ్ సేఫ్టీ అథారిటీకి ఛైర్మన్ కూడా ఉంటారు. అది డీజీపీ స్థాయి పోస్టు. అసలు చాలా ఏళ్లపాటు ఈ పోస్టు ఖాళీగానే ఉం డటం గమనార్హం. 2020లో మహేందర్‌రెడ్డి డీజీపీగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదాల విశ్లేషణ చేపట్టారు. ఆ తర్వా త ఆ దిశగా పోలీసు బాసులెవరూ దృష్టిపెట్టలేదు. ఇటీవల డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డి తొలిసారి పోలీసు ఉన్నతాధికారులు, యూనిట్ ఆఫీసర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో ఆరేడువేల మంది వరకు మరణిస్తుండటం బాధాకరమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణం సంభవించిన ప్రతిచోటా నిశిత విశ్లేషణ చేసి మరో ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మితిమీరిన వేగమే ప్రమాదం..

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు వరకు 2,66,650 ప్రమాదాలు జరగ్గా.. 86,186 మంది మరణించారు. పోలీసుశాఖ జరిపిన విశ్లేషణలో.. 85శాతం ప్రమాదాలు మితిమీరిన వేగంతో, 4శాతం ప్రమాదాలు మద్యం మత్తుతో, మిగతావి వివిధ కారణాలతో జరిగినట్టు తేలింది. మితిమీరిన వేగంతో జరిగిన ఘటనల్లోనే 77శాతం మరణాలు నమోదవుతున్నాయి. ఇక రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో.. పాదచారులు 18శాతం, ద్విచక్ర వాహనదారులు 52శాతం, ఆటోల్లో ప్రయాణిస్తున్న వారు 6 శాతం, కార్లలో ప్రయాణిస్తున్న వారు 12శాతం, ట్రక్కులు, లారీల్లోని వారు 8శాతం, బస్సుల్లో ప్రయాణిస్తున్న వారు 4శాతం వరకు ఉంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా వేగం పరిమితమే

ఆస్ట్రేలియా, చైనా సహా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో కూడా గరిష్ఠంగా గంటకు 110-120 కిలోమీటర్ల మధ్య వేగ పరిమితులు ఉన్నా యి. కొన్ని ప్రత్యేకమైన హైవేలపై మాత్రం కొంత ఎక్కువ వేగాన్ని అనుమతిస్తారు. ఇలా సౌదీ, కజకిస్థాన్‌లలో గంటకు 140 కి.మీ, యూఎస్‌ఏలో 137 కి.మీ.గరిష్ఠ వేగానికి అనుమతి ఉంది. ఇక ప్రపంచంలోనే అత్యధికంగా చెక్‌రిపబ్లిక్‌లోని టబోర్-సెస్కే హైవే, స్పెయిన్‌లో మ్యాకనెట్ డీ లాసెల్వా- ఎల్ వెండ్రెల్ హైవేలలో 150 కిలోమీటర్ల గరిష్ఠ వేగానికి అనుమతి ఉంది. అవి అత్యంత భద్రతా ప్రమాణాలతో నిర్మించిన రహదారులు కావడం గమనార్హం.

గత 11 ఏళ్లుగా రోడ్డు ప్రమాదాల తీరు ఇదీ..

ఏడాది	ప్రమాదాలు	మృతులు
2014	20,078	6,906
2015	21,252	7,110
2016	22,811	7,219
2017	22,484	6,596
2018	22,230	6,603
2019	21,570	6,964
2020	19,172	6,882
2021	21,315	7,557
2022	21,619	7,559
2023	22,903	7,667
2024	25,934	7,281
2025	25,102 (సెప్టెంబర్ వరకు)	7,842 (సెప్టెంబర్ వరకు)
మొత్తం	2,66,650	86,186

వేగ నియంత్రణ మాటేలేని ప్రైవేటు బస్సులు!

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నుంచి విజయవాడ ఇబ్రహీంపట్నం మధ్య దూరం 250 కి.మీ... ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు 3 గంటల్లో ఆ దూరాన్ని అధిగమిస్తాయి. అంటే ఆ బస్సులు ఎంత వేగంతో దూసుకెళుతున్నాయో అర్థమవుతుంది. ఈ హైవేలో రెండు చోట్ల స్పీడ్‌గన్‌లు ఉండగా, బస్సు డ్రైవర్లు ఆ ప్రాంతాల దగ్గరకు వచ్చేసరికి వేగం తగ్గిస్తున్నారు. నిజానికి మన హైవేలలో చాలా వరకు బస్సులైతే గంటకు 80 కి.మీ. వేగంతో, కార్ల వంటివి అయితే 100కి.మీ. వేగంలోపే ప్రయాణించేలా డిజైన్ చేసినవి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. హైవేలపై వేగం గంటకు 90 కి.మీ. మించకూడదు. తెలంగాణలో అయితే 80కి.మీ. వేగం దాటకూడదు. కానీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను 120 కి.మీ.కు పైగా వేగంతో నడుపుతున్నారు. దీనితో ఏ చిన్న తేడా వచ్చినా క్షణాల్లోపే వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోతారు. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో అంతర్రాష్ట్ర సర్వీసుల్లో నడిచే రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులకు 80కి.మీ., రాష్ట్రంలోపల తిరిగే సర్వీసులకు 75కి.మీ. వేగపరిమితి పాటిస్తుండటం గమనార్హం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తన పోకడలను కొంత మార్చుకోవాలి. ప్రభుత్వ పరంగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు అనుభవం, అవగాహన ఉండే మంత్రులు, శాసనసభ్యులతో చర్చలు జరపాలి. ప్రతిపక్షాల నుంచి తనకు రక్షణ కవచంలా నిలబడే వారితో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. రాజకీయాల్లో వర్గాలు సహజం. ముఖ్యమంత్రికి కూడా వర్గం ఉంటుంది. ఎన్నికల ఫలితాల తర్వాత మెజారిటీ శాసనసభ్యులు మద్దతు పలికినందునే కదా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయింది? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకున్న తర్వాత అందరూ ఆయన వర్గమే అవుతారు. గతంలో రాజశేఖర రెడ్డి హయాంలో ఇదే జరిగింది. అప్పటిలా ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం బలంగా కూడా లేదు. ముఖ్యమంత్రికి మార్గదర్శకత్వం వహించేవారు కూడా అధిష్ఠానంలో లేరు. అందుచేత రేవంత్‌రెడ్డి తనకు నమ్మకమైన వారితో థింక్ ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి.

తలంటిన రేవంత్.. మంత్రులు షాక్!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మండుతోంది. గురువారంనాడు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి తనలోని ఆవేదనను, ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. సమావేశం ముగిశాక అధికారులను బయటకు పంపించి... గంటకు పైగా మంత్రులకు ఆయన తలంటారు. దాదాపు రెండేళ్ల క్రితం కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి తాను ఎంత శ్రమించిందీ, ఎంత రిస్కు తీసుకున్నదీ వివరిస్తూ ఇటీవల పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ కలుపుకొని వెళ్లాలన్న ఉద్దేశంతో మంత్రులందరికీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ బాధ్యత తీసుకోవడానికి ఒక్కరు కూడా ముందుకు రావడంలేదని ఆక్షేపించారు. రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను దీటుగా ఎదుర్కోడానికి చొరవ తీసుకోకపోగా, ముఖ్యమంత్రిగా తనను ఫెయిల్యూర్‌గా ముద్రవేయడానికి ప్రయత్నాలు చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో మంత్రిని పేరు పెట్టి పిలిచి 'మీకు ఏం తక్కువ చేశానని ఇలా ప్రవర్తిస్తున్నారు?' అని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని, అనుభవరాహిత్యంతో పార్టీని రేవంత్‌రెడ్డి నాశనం చేస్తున్నారని, పార్టీకి అనాదిగా ఓటు బ్యాంకుగా ఉన్న రెడ్డి, దళితులను దూరం చేసుకున్నారని, బీసీ రిజర్వేషన్లు అంటూ పార్టీకి నష్టం చేశారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించినట్టుగా చేస్తున్న ప్రచారంపై రేవంత్ మండిపడ్డారు. ఈ విషయమై తాను ఆరా తీయగా ఖర్గే అలాంటి వ్యాఖ్యలు చేయలేదని రూఢీ అయిందని, అయినా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ చిరాకు పడ్డారు. "నా రెక్కల కష్టంతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చాను. ఆ క్రమంలో ఎన్నో కష్టాలు పడ్డాను. ఎన్నికల సందర్భంగా ఎంతో రిస్కు తీసుకొని కోట్లు అప్పు చేసి పార్టీ అభ్యర్థులకు ఆర్థిక సహాయం చేశాను. ప్రస్తుత ఎమ్మెల్యేల గెలుపుకోసం కాలికి బలపం కట్టుకొని తిరిగాను. కాంగ్రెస్ గెలుపుకోసం నా అంతగా కష్టపడిన మరొకరి పేరు చెప్పండి?" అని రేవంత్‌రెడ్డి సహచర మంత్రులను నిలదీశారు. మంత్రులు తరచుగా కీచులాడుకోవడం వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇప్పుడు నాలో సహనం నశించింది. ఏదైతే అదవుతుంది. ఇకపై నేను తెగింపుతో వ్యవహరిస్తాను. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యం. హద్దు మీరిపోతున్న మంత్రులపై చర్య తీసుకోవడానికి కూడా వెనుకాడను" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "ఖర్గే నన్ను ఉద్దేశించి అనని మాటలను కూడా అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నా మంత్రులు మౌనంగా ఉండటం ఏమిటి? నా ప్రతిష్ఠ దెబ్బతింటే ఆ ప్రభావం పార్టీపై పడదా? నేను ఒక ముఖ్యమంత్రిని అని విస్మరించి ఇష్టారీతిన మాట్లాడటం ఏమిటి? నా సహనానికి కూడా హద్దుంటుంది. బద్నాం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేను. నేనేమిటో రుజువు చేసుకొనే సమయం ఆసన్నమైంది. మీ అందరికీ చెప్పాల్సింది చెప్పాను. ఇకపై నేను ఏ నిర్ణయం తీసుకున్నా మీరు బాధపడి ప్రయోజనం ఉండదు. జరుగుతున్నదంతా పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తా" అని రేవంత్ స్పష్టం చేశారు. "నన్ను ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా చిత్రీకరించడానికి జరుగుతున్న కుట్రను ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. త్వరలోనే అన్నింటికీ ముగింపు పలికిస్తా" అని కూడా హెచ్చరించారు. "పీసీసీ అధ్యక్షుడు కూడా ముఖ్యమంత్రితో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడం ఏమిటి? ఎవరికి వారు సొంతంగా ప్రకటనలు చేసుకుంటూ పోతే ముఖ్యమంత్రిగా నా పరిస్థితి ఏమిటి? వివిధ స్థాయిలలో సమన్వయం లేకపోతే ఎలా?" అని కూడా రేవంత్ నిలదీసినట్టు తెలిసింది.

ఆవేదన, ఆవేశం...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ స్థాయిలో తలంటుతారని ఊహించని మంత్రులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఆయన ఆగ్రహంగా ఉన్నారని గ్రహించిన కొండా సురేఖ విలేకరుల సమావేశంలో తన కుమార్తె వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలను ఉద్దేశించి.. "సీనియర్లుగా మిమ్మల్ని ఎంతో గౌరవించాను. నాతో సమానంగా గుర్తించి ప్రభుత్వంలో పెద్దపీట వేశాను. ఇంకేం చేయాలి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా అందరికీ ఆయన క్లాస్ తీసుకున్నారు. రేవంత్‌రెడ్డిలో ఈ మార్పు చూసి మంత్రులు అవాక్కయ్యారు. ఆయనలో ఆవేదన, ఆవేశం కట్టలు తెంచుకోవడానికి కారణం లేకపోలేదు. పార్టీ పైన, ప్రభుత్వం పైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టులేదని ప్రజలు అభిప్రాయపడేలా ఇటీవలి కాలంలో కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ అన్న ప్రచారం చాప కింద నీరులా సాగుతోంది. ప్రభుత్వపరంగా తీసుకుంటున్న నిర్ణయాల విషయంలో కూడా మంత్రులు తమకు సంబంధం లేదన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు. అనుభవరాహిత్యంతో రేవంత్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని కూడా ప్రచారం చేస్తున్నారట! కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విధంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం మొదలెట్టారు. అదే సందర్భంలో మంత్రుల మధ్య కీచులాటలు బహిర్గతం అయ్యాయి. మంత్రులు బాహాటంగా విమర్శించుకున్నారు. ఈ దశలోనే మంత్రి కొండా సురేఖ కుమార్తె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దారుణంగా దూషించారు. ముఖ్యమంత్రి అన్న గౌరవం కూడా లేకుండా ఆ అమ్మాయి అలా మాట్లాడటంతో రేవంత్‌రెడ్డికి సహజంగానే బాధ కలిగింది.

'మునుపటి' కాంగ్రెస్

కాంగ్రెస్ రాజకీయాలు ఒకప్పుడు ఇలాగే ఉండేవి. కాంగ్రెస్ మార్కు రాజకీయాలను ప్రజలు మరచిపోయి దాదాపు మూడు దశాబ్దాలు అవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో ముఖ్యమంత్రి అయిన రాజశేఖరరెడ్డి పార్టీ పైన, ప్రభుత్వం పైన పూర్తి పట్టు సాధించారు. దీంతో కాంగ్రెస్‌లో అసంతృప్త స్వరాలు మూగబోయాయి. తెలుగునాట ప్రాంతీయ పార్టీలు బలపడటంతో ప్రజలు కూడా కాంగ్రెస్ మార్కు రాజకీయాలను మరచిపోయారు. రాజశేఖరరెడ్డి కూడా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీ స్థాయిలోనే నడిపారు. ఏక వ్యక్తి పాలనకు, ప్రాంతీయ పార్టీల కల్చర్‌కు అలవాటుపడిన తెలుగు ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు రుచించడం లేదు. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోంది. ప్రభుత్వంలోనే కాదు, పార్టీలోనూ రేవంత్‌రెడ్డికి పట్టు లేదన్న అభిప్రాయం వ్యాప్తిచెందుతోంది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అన్న వాస్తవాన్ని విస్మరించి ఎవరు పడితే వారు ఏది పడితే అది మాట్లాడుతుండటంతో జనంలో ఆయన పలుచన అవుతున్నారు. దీని ప్రభావం సహజంగానే పార్టీపై కూడా పడుతోంది. 1995 నుంచి నేటి వరకు ఒంటి చేత్తో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపిన, నడుపుతున్న చంద్రబాబు... ఇంకా కేసీఆర్, జగన్‌రెడ్డి, దివంగత రాజశేఖరరెడ్డిని చూసిన ప్రజలు రేవంత్‌రెడ్డి కూడా అలాగే వ్యవహరిస్తారనీ వ్యవహరించాలనీ ఆశించారు. అయితే, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. ముఖ్యమంత్రిని దూషించిన వారిపై కూడా చర్య తీసుకోలేని పరిస్థితి ఉండటం ఏమిటి? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. చర్య తీసుకోకపోగా మంత్రి కొండా సురేఖ దంపతులను ముఖ్యమంత్రి నివాసానికి తీసుకెళ్లి చర్చలు జరపడం ఏమిటి? దీనివల్ల ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారు? సురేఖ దంపతులతో రేవంత్‌రెడ్డి రాజీ కుదుర్చుకున్నారన్న అభిప్రాయం ప్రజల్లో సహజంగానే ఏర్పడింది. మరో వైపు మంత్రులు ఎవరికి వారు సర్వ స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ, ఈ శాఖ అని లేకుండా అన్ని శాఖల్లో జోక్యం చేసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్లకు కూడా నేరుగా ఫోన్లు చేస్తూ కనీస మర్యాద ఇవ్వకుండా ఇతర శాఖలకు సంబంధించిన అంశాలలో ఆదేశాలు జారీచేస్తున్నారు. కొంతమంది మంత్రులు మహిళా అధికారులను ఇళ్లకు పిలిపించుకుంటున్నారు. రాష్ట్రానికి ఒక్కరే ముఖ్యమంత్రిగా ఉంటారన్న వాస్తవాన్ని విస్మరించి ఎవరికి వారు ముఖ్యమంత్రులుగా భావించుకోవడాన్ని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. కనీస ప్రజాదరణ లేని వాళ్లు సైతం తాము కాంగ్రెస్ పార్టీలో సీనియర్లం అని డాంబికాలు పోతూ రేవంత్‌రెడ్డిని జూనియర్ అని కించపరుస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్ఠను ఇనుమడింపజేయడానికి ప్రయత్నించినప్పుడే పార్టీ ప్రతిష్ఠ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి వ్యవహరిస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిలలో అవినీతి పెరిగిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులను కట్టడి చేయలేకపోతున్నారన్న అభిప్రాయం ఏర్పడింది. మరోవైపు ప్రభుత్వం వద్ద నిధుల కొరత కారణంగా చిన్న చిన్న పనులు కూడా మంజూరు చేయించలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పరిణామాలతో వారిలో అసంతృప్తి చోటుచేసుకుంటోంది.

> నిజానికి రేవంత్‌రెడ్డి అత్యంత రిస్కు తీసుకొని సాధించుకున్న ముఖ్యమంత్రి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు వంటిది కాదు. రాష్ట్రంలో నాయకత్వ మార్పిడికి అధిష్ఠానం కూడా సాహసించలేని పరిస్థితి. ఒక ముఖ్యమంత్రికి ఇంతకంటే అనువైన వాతావరణం ఇంకేముంటుంది?

కలిసిరాని నిర్ణయాలు...

ప్రభుత్వపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు కూడా కలసి రావడంలేదు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలన్న నిర్ణయం ఈ కోవలోకే వస్తుంది. ముందూ వెనుకా ఆలోచించకుండా, చట్టపరమైన చిక్కులను లోతుగా అధ్యయనం చేయకుండా ఈ నిర్ణయం తీసుకోవడంతో ఉభయ భ్రష్టత్వం ప్రాప్తించింది. 42 శాతం రిజర్వేషన్లు ఇప్పించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని బీసీలు భావిస్తుండగా... పార్టీకి అండగా ఉన్న రెడ్లు ఈ నిర్ణయం పట్ల కినుక వహించారు. దళితులు కూడా అసంతృప్తితో ఉన్నారు. నిజానికి బీసీలకు రిజర్వేషన్ల అంశంపై గతంలో పలువురు నాయకులు చేతులు కాల్చుకున్నారు. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతమైన నాయకురాలు కూడా మండల్ కమిషన్ నివేదిక అమలు చేయడానికి సాహసించలేకపోయారని దివంగత కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ తన పుస్తకంలో ప్రస్తావించారు. వీపీ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ నివేదిక అమలుకు పూనుకోగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి. మండల్ కమిషన్ మంటలు మిన్నంటడంతో వీపీ సింగ్ రాజకీయంగా మూల్యం చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో పూర్వాపరాలు ఆలోచించకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీం కోర్టు తీర్పు అమలులో ఉన్నందున ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులు కొట్టిపారేశాయి. దీంతో బీసీల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. రిజర్వేషన్లు పెంచడానికి అసెంబ్లీలో మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టి తప్పుకొన్నాయి. ఫలితంగా ఈ సమస్య పరిష్కార బాధ్యత ప్రభుత్వంపై పడింది. రాజకీయాలు రంగ ప్రవేశం చేయడంతో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. మొత్తంగా చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో బలపడింది. ఈ దశలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ గెలుపొందిన భారత రాష్ట్ర సమితి ఈ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున ఈ స్థానాన్ని గెలుచుకోవలసిన ఆవశ్యకత కాంగ్రెస్ పార్టీకి ఏర్పడింది. ఈ స్థానాన్ని గెలుచుకోగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వం కొంతలో కొంత కుదుటపడుతుంది. ఫలితం అందుకు విరుద్ధంగా ఉంటే మాత్రం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం మరింత బలపడుతుంది. ఇలాంటి సవాళ్లను ఎదురుగా పెట్టుకొని మంత్రులు, నాయకులు క్రమశిక్షణను ఉల్లంఘించి వ్యవహరించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిర్రెత్తుకొచ్చి ఉంటుంది. అందుకే ఆయన ఈ రెండేళ్లలో ఎన్నడూ లేని విధంగా సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా మంత్రులందరికీ క్లాస్ పీకారు.

అధిష్ఠానం ఏం చేస్తున్నట్లు?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితికి ఆ పార్టీ అధిష్ఠానం కూడా బాధ్యత వహించాలి. రాజశేఖరరెడ్డి హయాంలో వలె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వేచ్ఛ ఇవ్వడంలేదు. కాంగ్రెస్ పార్టీలో అందరినీ కలుపుకొనిపోవడం అంటే ఆషామాషీ కాదు. నాయకుడికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే అది సాధ్యం. భయంతో కొందరు, భక్తితో మరికొందరు ముఖ్యమంత్రి పట్ల వినయ విధేయతలు ప్రదర్శిస్తారు. అయితే రేవంత్ విషయంలో ఇప్పుడా పరిస్థితి ఉందా? అంటే లేదనే చెప్పవచ్చు. పార్టీ అధికారంలోకి రావడానికి తన కృషి ప్రధాన కారణమని తెలిసినప్పటికీ... పార్టీలో తాను జూనియర్ అన్న భావన ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభం నుంచి అణకువతోనే ఉంటూ వచ్చారు. చివరికి అది అందరికీ అలుసుగా మారింది. కొంతమంది మంత్రులైతే ఆయనను ముఖ్యమంత్రిగా కూడా గుర్తించడానికి ఇష్టపడటం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పుట్టి మునగడంతోపాటు తాను కూడా మునిగిపోతానని ముఖ్యమంత్రి అభిప్రాయపడుతున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా, ముఖ్యమంత్రిగా తాను ఫెయిల్యూర్ అన్న ముద్ర వేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ కారణంగానే తనకు రాజకీయం తెలియక మెతకగా ఉంటున్నానని భావించవద్దు అని ఆయన తాజాగా మంత్రులను హెచ్చరించారు. ఇకపై తాను కఠినంగా ఉండబోతున్నానన్న సంకేతాన్ని ఆయన మంత్రులు, నాయకులతో పాటు పార్టీ అధిష్ఠానానికి కూడా పంపాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. కొండా సురేఖ విషయమే తీసుకుందాం! ఆమె కుమార్తె అన్న మాటలకు సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి ఉండాలి. రేవంత్‌రెడ్డి కూడా ఒక దశలో ఇదే నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. అయితే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ తీసుకొని కొండా సురేఖను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఆయన అప్పటికి శాంతించారు. అయితే, గురువారం మంత్రివర్గ సమావేశంలో అధికారులు వెళ్లిపోయిన తర్వాత జరిగిన దానికి క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారట. ఫలితంగానే తన కుమార్తె వ్యవహార శైలికి కొండా సురేఖ క్షమాపణ చెప్పుకొన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందన్న విషయం పక్కన పెడితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కాయకల్ప చికిత్స చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అధికారం శాశ్వతం కాదు. అధికారంలో ఉన్నంత కాలం పదవికి వన్నె తేవాలన్న లక్ష్యంతో మాత్రమే రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తే పరిస్థితుల్లో మార్పు రావొచ్చు. నిజానికి కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం రేవంత్‌రెడ్డికి ప్రత్యామ్నాయం లేదు. రేవంత్‌రెడ్డి కాని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కూలిపోవచ్చు. పార్టీ అధిష్ఠానం కూడా ఈ వాస్తవాన్ని గుర్తించాలి. 2004 తర్వాత రాజశేఖరరెడ్డి పార్టీలో, ప్రభుత్వంలో పట్టు పెంచుకున్నట్టుగానే ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా పట్టు సాధించడానికి ప్రయత్నించాలి. హద్దు మీరుతున్న మంత్రులపై చర్యలు తీసుకొనే విషయంలో చొరవ తీసుకోవాలి. అప్పుడే ఆయన నాయకత్వం పట్ల భయంతో పాటు భక్తి ఏర్పడుతుంది. ముఖ్యమంత్రిగా బాగా పనిచేశారని రుజువు చేసుకోగలిగినప్పుడే భవిష్యత్తులో మళ్లీ మళ్లీ అవకాశాలు వస్తాయి. అలా కాకుండా ఫెయిల్యూర్‌గా ముద్రపడితే భవిష్యత్తులో మళ్లీ అవకాశం రావడం కష్టం. ఏ ఒక్కరూ అధికారంలో శాశ్వతంగా ఉండరు అన్న సత్యాన్ని గ్రహించి మెలగాలి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి కూడా తన పోకడలను కొంత మార్చుకోవాలి. ప్రభుత్వ పరంగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు అనుభవం, అవగాహన ఉండే మంత్రులు, శాసనసభ్యులతో చర్చలు జరపాలి. ప్రతిపక్షాల నుంచి తనకు రక్షణ కవచంలా నిలబడే వారితో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. రాజకీయాల్లో వర్గాలు సహజం. ముఖ్యమంత్రికి కూడా వర్గం ఉంటుంది. ఎన్నికల ఫలితాల తర్వాత మెజారిటీ శాసనసభ్యులు మద్దతు పలికినందునే కదా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయింది? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకున్న తర్వాత అందరూ ఆయన వర్గమే అవుతారు. గతంలో రాజశేఖరరెడ్డి హయాంలో ఇదే జరిగింది. అప్పటిలా ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం బలంగా కూడా లేదు. ముఖ్యమంత్రికి మార్గదర్శకత్వం వహించేవారు కూడా అధిష్ఠానంలో లేరు. అందుచేత రేవంత్‌రెడ్డి తనకు నమ్మకమైన వారితో థింక్ ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న కొంతమంది వల్ల ఆయన గౌరవం తగ్గుతోంది. అధికారంలో లేనప్పుడు మీ పక్కన ఎవరున్నారన్నది ఎవరూ పట్టించుకోరు. అధికారంలోకి వచ్చిన తర్వాత, అది కూడా ముఖ్యమంత్రి వంటి అత్యున్నత పదవిలో ఉన్నప్పుడు ఆయన చుట్టుపక్కల ఎవరు ఉన్నారన్నది ప్రజలు గమనిస్తుంటారు. నాయకుడికి ఆత్మవిశ్వాసం ముఖ్యం. ఆత్మవిశ్వాసంతో అడుగులు ముందుకు వేసినప్పుడే పరిస్థితులు అనుకూలంగా మారతాయి. రాజకీయాలలో రిస్కు తీసుకున్నప్పుడే ఫలితాలు వస్తాయి. రేవంత్‌రెడ్డి గతంలో రిస్కు తీసుకొని తెలుగుదేశం పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఢీకొని ఉండకపోతే ఇప్పుడు ముఖ్యమంత్రి కాగలిగేవారా? తనను చులకన చేయడానికి ప్రయత్నిస్తున్న వారికి చెక్ పెట్టే కార్యక్రమాన్ని ఆయన వెంటనే ప్రారంభించాలి. రేవంత్‌రెడ్డి తనను తాను సంస్కరించుకోవడంతో పాటు పార్టీని, ప్రభుత్వాన్ని సంస్కరించడానికీ నడుం బిగించాలి. నిజానికి రేవంత్‌రెడ్డి అత్యంత రిస్కు తీసుకొని సాధించుకున్న ముఖ్యమంత్రి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు వంటిది కాదు. రాష్ట్రంలో నాయకత్వ మార్పిడికి అధిష్ఠానం కూడా సాహసించలేని పరిస్థితి. ఒక ముఖ్యమంత్రికి ఇంతకంటే అనువైన వాతావరణం ఇంకేముంటుంది? పార్టీలో, ప్రభుత్వంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను తన నాయకత్వ ప్రతిభను ప్రదర్శించడానికి లభించిన అవకాశాలుగా రేవంత్‌రెడ్డి పరిగణించాలి. అలా చెయ్యలేని పక్షంలో విఫల ముఖ్యమంత్రిగానే మిగిలిపోవలసి వస్తుందని తెలుసుకోవాలి. ఏ పార్టీలోనైనా తమ నాయకుడి ప్రతిష్ఠను పెంచడం వల్లనే ఆ పార్టీకి భవిష్యత్తు ఉంటుంది. రాజశేఖరరెడ్డిని పార్టీ మొత్తం తలకెత్తుకోవడం వల్లనే ఆయన ప్రతిష్ఠ పెరిగి 2009లో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. అలా కాకుండా కాంగ్రెస్ మంత్రులు, నాయకులు ఇప్పటిలా వ్యవహరించి ఉంటే 2009లో పార్టీ ఓడిపోయి ఉండేది. భారత రాష్ట్ర సమితి నాయకులు ఇప్పటికే తాము అధికారంలోకి వచ్చినట్టేనని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ లేదా బీజేపీకి అవకాశం ఇవ్వడమా? లేక కాంగ్రెస్ ప్రతిష్ఠను, ప్రభుత్వ ప్రతిష్ఠను పునరుజ్జీవింపజేయడమా? అన్నది కాంగ్రెస్ ముఖ్యులే తేల్చుకోవాలి. ప్రజలు మరచిపోయిన కాంగ్రెస్ సంస్కృతిని మళ్లీ గుర్తుకు తెచ్చే విధంగా ప్రవర్తిస్తే అధికారం కోల్పోవడానికి సిద్ధపడక తప్పదు. తస్మాత్ జాగ్రత్త!



> భయంతో కొందరు, భక్తితో మరికొందరు ముఖ్యమంత్రి పట్ల వినయ విధేయతలు ప్రదర్శిస్తారు. అయితే రేవంత్ విషయంలో ఇప్పుడా పరిస్థితి ఉందా? అంటే లేదనే చెప్పవచ్చు. పార్టీ అధికారంలోకి రావడానికి తన కృషి ప్రధాన కారణమని తెలిసినప్పటికీ... పార్టీలో తాను జూనియర్ అన్న భావన ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభం నుంచి అణకువతోనే ఉంటూ వచ్చారు. చివరికి అది అందరికీ అలుసుగా మారింది. కొంతమంది మంత్రులైతే ఆయనను ముఖ్యమంత్రిగా కూడా గుర్తించడానికి ఇష్టపడటం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పుట్టి మునగడంతోపాటు తాను కూడా మునిగిపోతానని ముఖ్యమంత్రి అభిప్రాయపడుతున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా, ముఖ్యమంత్రిగా తాను ఫెయిల్యూర్ అన్న ముద్ర వేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ కారణంగానే తనకు రాజకీయం తెలియక మెతకగా ఉంటున్నానని భావించవద్దు అని ఆయన తాజాగా మంత్రులను హెచ్చరించారు. ఇకపై తాను కఠినంగా ఉండబోతున్నానన్న సంకేతాన్ని ఆయన మంత్రులు, నాయకులతోపాటు పార్టీ అధిష్ఠానానికి కూడా పంపాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు.

రాజవంశీకుల శాసనం అబద్ధమా?

కొత్త శాసనాలు బయటపడితే పాతవి మూలకు పడేయాలా? ఇదేం వాదన! సామంతుడో, మరెవరో వేసిన తామ్ర శాసనాలకు ఉన్న విలువ స్వయానా రాజవంశీకులే వేసిన బయ్యారం శాసనానికి లేదా? ఇదేం శాస్త్రీయత?! (కాకతీయులపై కొత్త వెలుగులు– సెప్టెంబర్ 28). అది పవర్ పాయింట్ ప్రదర్శన అయినా, ఐమాక్స్ తెర మీద ప్రదర్శన అయినా నిజాలు తారుమారవుతాయా?

క్రీ.శ 956 నాటి దానార్ణవుని 'మాంగల్లు దాన శాసనం' కాకర్త్య గుండన వంశక్రమాన్ని వెనుకకు మూడు తరాల వరకు ప్రస్తావించింది. కాకతీయ వంశం, గుండియ రాష్ట్రకూట, ఎర్రియ రాష్ట్ర కూట (భార్య వంద్యనాంబ), కాకర్త్య గుండన... ఈ శాసనంతో హనుమకొండకు చెందిన మొదటి తరం కాకతీయులను కలపడంలో నాటి చరిత్రకారులు విఫలమైన సందర్భంలో, 1966లో ఆవిష్కరించిన బయ్యారం చెరువు శాసనం కాకతీయ వంశక్రమాన్ని సంపూర్ణంగా వివరించింది. దీంతో కాకతీయ వంశక్రమంపై అప్పటివరకు ఉన్న సందేహాలన్నీ పటాపంచలు అయ్యాయి! మాంగల్లు శాసనంలో 4 నుంచి 9 తరాలు వర్ణనతో, రుద్రదేవుడి అనుమకొండ శాసనంలో 12, 13 తరాల వర్ణనతో, బయ్యారం శాసనంలోని 14 తరాల వరకు పోల్చి చూస్తే, ఎట్టి భేదం లేకుండా బయ్యారం శాసనం కాకతీయుల వంశవృక్ష నిరూపణకు ప్రబల సాక్ష్యంగా నిలిచింది.

దుర్జయ వంశం– వెన్నయ– మొదటి గుండన– రెండవ గుండన– మూడవ గుండన– ఎర్రియ-పిండి గుండన(కాకర్త్య గుండన)– ఇలా గణపతి దేవుడి వరకు 14 తరాల వరకు సాగుతుంది. ఈ విధంగా కాకతీయ వంశక్రమంపై బయ్యారం చెరువు శాసనం మనకు ఒక స్పష్టత ఇస్తుంది. ఎందుకంటే ఇది స్వయానా కాకతీయ వంశస్థులే వేయించారు కాబట్టి! (ఈ శాసనాన్ని వేయించింది గణపతి దేవుడి చెల్లెలైన మైలమాంబ– ఈమె నతవాటి వక్కటి మల్లరుద్రుని భార్య.) కాకతీయ వంశస్థాపకుడు అయిన వెన్ననృపుడు పృథ్వీని కాకతీ పట్టణం నుంచి పాలించాడని స్పష్టంగా చెబుతున్నది (గణపతి దేవుడి గారవపాడు దాన శాసనం కూడా ఇదే విషయాన్ని తెలుపుతున్నది). ఈ వెన్నయ్య, ఆయన సైన్యంతో కలిసే, రాష్ట్రకూట రాజైన దంతిదుర్గుడు... బాదామి చాళుక్యులపై విజయాన్ని సాధించి, ఆ రాజ్య భాగాలను కలుపుకున్న తరువాతే రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు!

> స్థానిక చారిత్రక అస్తిత్వం నిలుపుకోవడానికి ఆరాటపడే మాలాంటి వాళ్ళమంతా అడిగే ప్రశ్న ఒక్కటే! ఎక్కడో ఏదో ఒక శాసనం బయలుపడినంత మాత్రాన ఆ ఒక్క శాసనమే కాకతీయ చరిత్రను మొత్తం తిరగరాయగలదా? అలాంటప్పుడు అంతకు ముందున్న వేల శాసనాల అస్తిత్వం మాటేమిటి?



కాకతీయుల వంశానికే గాక వారి చరిత్రకు సంబంధించి కూడా బయ్యారం శాసనం ఆయువుపట్టు లాంటిది, అటు తర్వాత ఎక్కడ ఏ శాసనాలు దొరికినా (అవి శిలాశాసనాలైనా, రాగిరేకుల శాసనాలైనా, సాహిత్యాధారాలైనా) ఇప్పటివరకు బయల్పడిన అతిపెద్ద పూదండ లాంటి వేల కాకతీయ శాసనాలలో (వాటిలో ఏదైనా అదనపు సమాచారం ఉంటే) అవి ఒక పుష్పంలా ఒదిగిపోగలవే తప్ప, వాటికవే చరిత్రను తిరగరాయలేవు! అలా రాయాలని అభిలషించేవారు స్వయానా కాకతీయ రాజవంశీకులు వేసిన తమ వంశవృక్ష శాసనాన్ని చరిత్రలో కనుమరుగు చేయాల్సి ఉంటుంది!!

మొదటి తరం కాకతీయులు బయలుదేరిన కాకతీపురం విషయానికొస్తే... ఊహలే సిద్ధాంతాలకు దారితీస్తాయి, సిద్ధాంతాలు పరికల్పనలకు... అంటే ప్రయోగాలకు దారితీస్తాయి. మొహంజోదారో నగరం బయలు పడకముందు 1920లో జాన్ మార్షల్ మదిలో ఊహలే ఉన్నాయి, అక్కడ ఎందుకు ప్రాచీన అవశేషాలు దొరుకుతున్నాయని! ఆ తర్వాత ఆయన ఒక సిద్ధాంతాన్ని నిర్మించుకుని, నిరూపణ కోసం అక్కడ తవ్వకాలు చేశాడు. మొహంజోదారో నగరాన్ని ప్రపంచం ముందు నిలబెట్టాడు! ప్రాచీన కాకతీపురానికి సంబంధించి హన్మకొండకు దగ్గరలోని కక్కిరాలపల్లి, కత్రియాల గ్రామ పేర్లలో కాకతీయ నామ సామ్యం ఉంది. పంథిని, కత్రియాల, కక్కిరాలపల్లిని కలుపుతూ ఒక త్రిభుజాన్ని గీస్తే ఆ మధ్యలో ప్రాచీన విశేషాలు ఇబ్బడి ముబ్బడిగా దొరికాయి. ఆ ప్రాచీన అవశేషాల్ని ఆయా గ్రామాల్లో నేటికీ చూడవచ్చు. పంథిని గ్రామశివారులో రెండు పురాతన గుళ్లు ఉన్నాయి. వాటిలో విగ్రహాలు లేవు, ఆ గుళ్లకు ఓ పేరంటూ లేదు. అయితే అవి సకలేశ్వరాలయం, గుండేశ్వర భట్టారక ఆలయం ఎందుకు కాకూడదు?

ప్రాచీన కాలంలో ప్లేగు, కలరా లాంటి వ్యాధులు వచ్చినప్పుడు ఊళ్లకు ఊళ్లే నిర్మానుష్యమయ్యేవి. చావగా మిగిలిన వాళ్ళు కట్టుబట్టలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి, అక్కడ మళ్లీ గ్రామాలను నెలకొల్పుకునేవారు! అలా ఆ కాకతీపురం నుంచి ఇరువైపులా వెళ్లిపోయిన ప్రజా సమూహాలే ఈ కత్రియాల, కక్కిరాలపల్లి లాంటి గ్రామాలను నిర్మించుకున్నాయని శాస్త్రీయంగా ఊహించవచ్చు! అందుకే ఈ రెండు గ్రామాల పేర్లలో కాకతీపుర నామ సామ్యం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ తవ్వకాలు సాగించి, ఏ ఆధారం దొరకక, ప్రయత్నం విఫలమైనప్పుడు మాత్రమే... సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని కాగిత (కాకతీయ) రామచంద్రపురం కాకతీపురమా? లేక అదే జిల్లాలో కోదాడ మండలంలో దొండపాడు గ్రామంలో గల 'కాకతమ్మ బీడు'ను తవ్వితే కాకతీపురం బయలుపడుతుందా? లేక కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం పట్టణానికి 12 మైళ్ళ దూరంలో కాకతీయ అనే గ్రామం ఉందని కర్ణాటక చరిత్రలో ఉంది, మరి అదా? అదీ కాకపోతే నేటి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని కాందారపురము నుంచి కాకతీయులు బయలుదేరినట్టుగా ప్రతాప చరిత్ర తెలుపుతున్నది, మరి ఇది నిజమా? ఇవన్నీ మనం శాస్త్రీయంగా తేల్చుకున్నాక మాట్లాడుకోవల్సి ఉన్నది! స్వస్తివాక్యం ఏమంటే– స్థానిక చారిత్రక అస్తిత్వం నిలుపుకోవడానికి ఆరాటపడే మాలాంటి వాళ్ళమంతా అడిగే ప్రశ్న ఒక్కటే! ఎక్కడో ఏదో ఒక శాసనం బయలు పడినంత మాత్రాన ఆ ఒక్క శాసనమే కాకతీయ చరిత్రను మొత్తం తిరగ రాయగలదా? అలాంటప్పుడు అంతకు ముందున్న వేల శాసనాల అస్తిత్వం మాటేమిటి?

▪ డా. అంబటి శ్రీనివాస్‌రాజు
'మన కాకతీయులు' గ్రంథకర్త



ఉర్సు నాగేశ్వర ఆలయంలో పాలు పోస్తున్న భక్తులు


ఘనంగా నాగుల చవితి

నాగేంద్రస్వామి దేవాలయాల్లో అభిషేకాలు

వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసంలో నాలుగో రోజున జరిగే నాగుల చవితి వేడుకలను శనివారం నేత్రపర్వంగా జరుపుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో దేవాలయాలను సందర్శించి నాగేంద్రస్వామి విగ్రహాలకు జరిగే అభిషేకాల్లో పాల్గొన్నారు. కొన్ని దేవాలయాల్లో నాగేంద్రుడి పుట్టల వద్ద పసుపు, కుంకుమలు చల్లి పుట్టలో పాలు పోశారు. తెల్లవారు జామునుంచి నాగుల చవితి ప్రారంభం కావడంతో ఉదయం 4 గంటల నుంచే ఆలయాల్లో సుప్రభాత సేవతో నాగుల చవితి పూజలు ప్రారంభమయ్యాయి. గీసుగొండ మండలం ఊకల్ గ్రామంలోని శ్రీబాల నాగసుబ్రహ్మణ్యేశ్వర దేవాలయంలో విశేష అభిషేకం, విశేష అర్చన, విశేష అలంకరణను అర్చకులు సముద్రాల సుదర్శనచార్యులు, సముద్రాల హర్ష కుమార్ నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వర ఆలయంలో ప్రాంగణంలోని నాగేంద్రుడి పుట్టను కూడా వేలాది మంది మహిళలు దర్శించుకొని మొక్కుబడులు చెల్లించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఉన్న నాగేంద్రుడి పుట్ట వద్ద కూడా మహిళలు బారులు తీరి పాలు పోశారు. నగరంలోని చారిత్రక భద్రకాళి దేవాలయంలోని నాగేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. ఎల్లం బజార్‌లోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పుట్టలో పాలుపోసే కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రామన్నపేట రామలింగేశ్వరాలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, ఆకారపువారి గుడిలో నాగేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. కాశిబుగ్గ శివాలయంలో, రంగంపేట శివాలయంలో నాగేంద్రస్వామికి పూజలు కొనసాగాయి. ఉర్సులోని నాగేంద్రస్వామి దేవాలయంలో పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని పుట్టలోపాలు పోశారు.

నగరాభివృద్ధికి రూ.50 కోట్లు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరం అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. వరంగల్ నగరాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు కావడానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరికి మేయర్ సుధారాణి ధన్యవాదాలు తెలిపారు.





విభేదాలకు తెర పడినట్టేనా!?

కాక రేపిన కాంగ్రెస్ అంతర్గత కలహాలు

- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ బహిరంగ క్షమాపణలతో లొల్లికి తెర
- చిచ్చు రేపిన మేడారం టెండర్లు, మాజీ ఓఎస్డీ సుమంత్ అరెస్టు యత్నాలు
- సీఎం, మంత్రులపై కొండా దంపతుల కుమార్తె వ్యాఖ్యలతో మరింత ఆజ్యం
- సయోధ్య నెరిపిన టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి
- ఓరుగల్లు ఎమ్మెల్యేలతో మాత్రం విభేదాలు కంటిన్యూ

వరంగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో సీఎం, మంత్రులతో కొండా దంపతులకు ఏర్పడిన విభేదాలు మంత్రి సురేఖ క్షమాపణలతో ఇక ముగిసినట్టేనా.. అనే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో ఏర్పడిన విభేదాలపై రెండు రోజుల క్రితం కేబినెట్ మీటింగ్ అనంతరం మంత్రి సురేఖ వివరించారు. సీఎంకు క్షమాపణలు చెపుతున్నట్లుగా ప్రకటించారు. తమ కుమార్తె వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. దీంతో వివాదం ముగిసిందనే చర్చ నెలకొంది. అయితే సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితోపాటు పలువురిపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మేడారం టెండర్ల విషయంలో దేవాదాయశాఖకు సంబంధించిన రూ.101కోట్ల పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనకు తెలియకుండానే తన సొంత కంపెనీలకు కాంట్రాక్టులు ఇప్పించుకున్నారని సురేఖ.. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వివాదం చెలరేగటంతో మరుసటి రోజు మేడారం జాతర అభివృద్ధి పనులపై జరిగిన సమీక్షకు సురేఖ లేకుండానే మంత్రులు పొంగులేటి, సీతక్కలు నిర్వహించారు.

దీంతో అగ్రహంగా ఉన్న మంత్రి కొండా సురేఖ.. అక్టోబరు 15న నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించేందుకు వరంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మేడారం జాతరకు సంబంధించి దేవాదాయశాఖకు కేటాయించిన రూ.101కోట్ల పనులను రద్దు చేసి, ఆర్‌అండ్‌బీకి కేటాయించారు. దీనికి తోడు మంత్రి కొండా సురేఖ ఓఎస్‌డీగా ఉన్న సుమంత్‌ను ఆ పదవిని ప్రభుత్వం తొలగించింది. వీటితో మనస్తాపంతో ఉన్న మంత్రి కొండా సురేఖ ఇంటికి మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు రావడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. హైదరాబాద్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద పోలీసులతో మంత్రి కుమార్తె సుష్మితాపటేల్ వాగ్వాదానికి దిగటం, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, (మిగతా 6వ పేజీలో)

ఇద్దరు పిల్లలకు ఒకే ఆక్సిజన్

- ఎంజీఎం ఆస్పత్రిలో ప్రమాదకర దృశ్యం
- పసి పిల్లల ప్రాణాలతో సిబ్బంది చెలగాటం

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదల ఆస్పత్రిగా పేరొందిన ఎంజీఎం ఆస్పత్రిలో ఇద్దరు పసిపిల్లల ప్రాణాలతో చెలగాటమాడిన తీరు శనివారం ఉదయం కనిపించింది. ఎంజీఎం వార్డులో చేరిన ఇద్దరు పిల్లలకు వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షల కోసం తరలించడం కనిపించడం కనిపించింది. తరలించే క్రమంలో రోగికి ఆక్సిజన్ అవసరం అయింది. ఒక ఆక్సిజన్ సిలిండర్‌ను ఒక పసిపిల్లవాడికి అందించాల్సి ఉండగా, ఇద్దరు పిల్లలకు ఒకే సిలిండర్ అమర్చారు. పైగా పసిపిల్లల తల్లిదండ్రులకే ఆపరేటింగ్ అప్పగించారు. ఆక్సిజన్ మోతాదు ఎక్కువ, తక్కువ అయితే పసి పిల్లల ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది. వాస్తవానికి ఈ పనులన్నీ చక్కబెట్టేందుకు ప్రభుత్వం పేషంట్ కేర్లను నియమించింది. ఈ సమయంలో వీరు




ఒకే సిలిండర్‌ను ఇద్దరు పిల్లలకు అందజేస్తున్న దృశ్యం

ఎక్కడ ఉన్నారన్న అనుమానం వ్యక్తం అవుతోంది. ఇదంతా పిల్లల వార్డు వైద్యులు చూస్తుండగానే జరిగింది. ఈ దృశ్యాలు పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

వెల్లివిరిసిన సాంకేతిక సృజన

- 50కిపైగా ఈవెంట్లతో సందడిగా సాగిన సాంకేతికోత్సవం
- చివరి రోజూ కొనసాగిన ఈవెంట్లు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- విజేతలకు నగదు బహుమతుల ప్రదానం
- నిట్‌లో ముగిసిన టెక్నోజియాన్
- క్రమ శిక్షణ, నిబద్ధతతోనే విజయం : రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డైరెక్టర్ బాలలత

7











విభేదాలకు తెర పడినట్టేనా!?

(5వ పేజీ తరువాయి)

వేం నరేందర్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేయటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ వివాదం నేపథ్యంలో కేబినెట్ సమావేశానికి కొండా సురేఖ దూరంగా ఉండటం పలు ఊహాగానాలకు దారితీసింది. సీఎంతో మంత్రి సురేఖకు విభేదాలు ఏర్పడ్డాయనే చర్చ జరిగింది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఓ నాయకుడు కొండా దంపతులను టార్గెట్ చేశారనే చర్చ జరిగింది. సీఎంకు సమాచారం లేకుండా సదరు నాయకుడు అధికారులకు, పోలీసులకు ఆదేశాలు జారీ చేసి వివాదానికి కారణమయ్యారనే చర్చ కూడా జరిగింది.

ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌లో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి దీపావళి రోజున మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. జరిగిన పరిస్థితులపై సీఎంకు కొండా దంపతులు వివరించారు. దీంతో సీఎంకు, కొండా దంపతులకు మధ్య ఉన్న విభేదాలు తొలిగిపోయాయనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అయితే అనూహ్యంగా గురువారం మంత్రి కొండా సురేఖ మీడియా ముందు సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పడంతో సమస్య సద్దుమణిగినట్టేననే చర్చ జరుగుతోంది. అయితే సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై మాత్రం సురేఖ ఎలాంటి కామెంట్ చేయకపోవటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో ఉన్న విభేదాలు పరిష్కారం అయ్యాయనుకున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కీలక నేతలతో ఉన్న విభేదాలు మాత్రం అలాగే కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పరకాల, స్టేషన్‌ఘనపూర్, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలతో కొండా దంపతులకు విభేదాలు ఉన్నాయి. అలాగే నర్సంపేట ఎమ్మెల్యేతో మొదటి నుంచి రాజకీయ వైరం కొనసాగుతోంది. మంత్రి, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు ఏఐసీసీ నేతల వరకు వెళ్లింది. సీఎం, మంత్రి పొంగులేటి, ఇతరులతో విభేదాలకు ఫుల్‌స్టాప్ పడినట్లుగానే.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలతో ఉన్న విభేదాలకు బ్రేక్‌వేసేలా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టిసారించాలని కార్యకర్తలు కోరుతున్నారు. వీరి మధ్య విభేదాలతో ద్వితీయశ్రేణి నేతలకు పదవులు రాకుండా అడ్డుపడుతున్నాయనే భావన నెలకొంది. జనవరి 27వ తేదీన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలిని ప్రభుత్వం ప్రకటించింది. అయితే మంత్రి, ఎమ్మెల్యేల మధ్య విభేదాలతో ఇప్పటి వరకు ఆ పాలకవర్గం ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే రద్దు అయింది.

ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- మినీ సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో చెత్త తరలింపు వాహనాల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు స్థలాలను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. శనివారం వరంగల్ నగర పరిధిలోని కీర్తినగర్, గొర్రెకుంట, కోటిలింగాల ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఆమె పర్యటించారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. చెత్తను నేరుగా సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తే ఇంధనం వృథా అవుతుందని, ఇకపై మినీ సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు తరలించే విధంగా ఇన్‌స్పెక్టర్లు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఓపెన్ స్పేస్‌లను గుర్తించి భూకబ్జాలు కాకుండా డాటా సేకరించి అధికారులకు వెల్లడించాలన్నారు. ఇంకా ఓపెన్ స్పేస్‌లలో బయో కంపోస్ట్ ఎరువుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. గొర్రెకుంట ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి జరిపిన కట్టడాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కీర్తినగర్‌లో ఇప్పటికే రెండు ప్రభుత్వ స్థలాలు గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని, మరో రెండు స్థలాల్లో కూడా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ సంతోష్‌బాబు, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ సతీష్, టీపీఎస్ శ్రీకాంత్, టీపీబీవో నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత కలిగి ఉండాలి

వరంగల్ నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో పాటు కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాకతీయ మ్యూజికల్ గార్డెన్, ప్లానిటోరియం పనులు చివరిదశకు వచ్చాయని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం మ్యూజికల్ గార్డెన్, ప్లానిటోరియం పనులను పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, ఈఈలు రవికుమార్, భీంరావు, హెచ్‌వో అసీఫ్, డీఈలు రాజ్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



గొర్రెకుంటలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

డ్రగ్స్ నియంత్రణలో యువతదే కీలక పాత్ర

- జిల్లా అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చంద్ర ప్రసన్న

వర్ధన్నపేట అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో డ్రగ్స్ నిర్మూలనలో యువత కీలకమని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చంద్ర ప్రసన్న సూచించారు. శనివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రప్రసన్న హాజరై మాట్లాడారు. కొందరు డ్రగ్స్ బారినపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికను, ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం వంటివి గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

రైతులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్ర ప్రసన్న సూచించారు. మండలంలోని కట్ర్యాల గ్రామ శివారులో ఉన్న రైతు వేదికలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులకు పంట నష్టం, భూమి పట్టాదారు, ఇనం భూములు, కౌలు రైతు చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ రైతులకు ఈ చట్టాల పట్ల మెరుగైన సేవలందించేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు సురేశ్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ శృతి, వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, ఏవో విజయ్ కుమార్, ఎస్ఐ సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.



కట్ర్యాలలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ చంద్ర ప్రసన్న

మహిళా కళాశాల ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు

కేయూ క్యాంపస్ అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ మహిళా కళాశాల కాంట్రాక్టు అధ్యాపకురాలు జి.మధుశ్రీ, ప్రిన్సిపాల్ బీఎస్ఎల్ సౌజన్యల ఘటనపై కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం విచారణ కమిటీని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, సభ్యులుగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, సుబేదారి యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీజే శ్రీలత, ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలత మెంబర్, సెక్రటరీలుగా నియమించారు. కమిటీ వీలైనంత త్వరగా విచారణ చేపట్టి నివేదిక అందచేయాలని ఉత్తర్వులలో స్పష్టం చేశారు.

మోసగాడి మాయాజాలం మటాష్

ఎట్టకేలకు పట్టుబడిన నిందితుడు

రూ. 3 లక్షల నగదు, బంగారం, స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం

పర్వతగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కమిషనరేట్‌లో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పెట్రోల్ బంకులు, మినీ బ్యాంకులను టార్గెట్ చేసుకుని పెద్ద ఎత్తున మోసాలు చేసిన నిందితుడిని ఎట్టకేలకు పర్వతగిరి పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఈ మేరకు నిందితుడిని మీడియా ముందుకు ప్రవేశపెట్టి పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా రెడ్యానాయక్ కాలనీకి చెందిన రాపోలు శ్రీనివాస్ అనే వ్యక్తి క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించాలంటూ నమ్మించి మోసం చేసి రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తూ, జనగాం, హనుమకొండ, వర్ధన్నపేట, పర్వతగిరి, నెక్కొండ, లింగాల ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలాల్లో దాదాపు రూ. 6 లక్షల వరకు మోసం చేశాడని తెలిపారు. విచారణలో నిందితుడు నేరాలన్నీ ఒప్పుకోగా పోలీసులు అతని వద్ద నుంచి రూ.3 లక్షల నగదు, 6 గ్రాముల బంగారం, బ్లూ కలర్ యాక్టివా స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన పర్వతగిరి పోలీసులను సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఈస్ట్ జోన్ డీసీపీ, ఏసీపీ అభినందించినట్లు తెలిపారు.



పర్వతగిరిలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్

ప్రేమ విఫలమై..

యువకుడి ఆత్మహత్య

చెన్నారావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలమై యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ధర్మతండాలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై లక్ష్మణమూర్తి కథనం ప్రకారం.. ఇదే తండాకు చెందిన బోడ విజయ - మోహన్ దంపతుల కుమారుడు మహేశ్ (21) డిగ్రీ చదువుతున్నాడు. రెండేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. సదరు యువతి తల్లిదండ్రులు వేరే అబ్బాయితో వివాహం చేయడానికి పెండ్లి సంబంధాలు చూశారు. ఈ విషయం మహేశ్‌కు తెలిసింది. తనకు ఆ యువతితో పెండ్లి జరుగదని తీవ్ర మనస్తాపంతో ఈ నెల 23న రాత్రి 11 గంటలకు తన సెల్ ఫోన్‌లో వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.



పురుగుల మందు తాగుతున్న యువకుడు



వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ సందర్శించి తాళం వేసి ఉండటంతో బయట ఉండిపోయిన కలెక్టర్

ఎంఎల్ఎస్ పాయింట్‌కు తాళం

- కలెక్టర్ ఆగ్రహం

వర్ధన్నపేట అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని పౌర సరఫరాల ఎంఎల్ఎస్ పాయింట్ పరిశీలనకు శనివారం వచ్చిన జిల్లా కలెక్టర్ సత్య శారదకు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తాళం వేసి ఉండడంతో పౌర సరఫరాల అధికారి సంధ్యారాణికి కలెక్టర్ సత్యశారద ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తనిఖీచేసి రిపోర్టు అందజేయాలని ఆదేశించారు. వెంటనే పౌర సరఫరాల అధికారి సంధ్యారాణి ట్రైని డిప్యూటీ కలెక్టర్ శృతివర్షిణితో కలిసి వర్ధన్నపేట పౌర సరఫరాల ఎంఎల్ఎస్ పాయింట్ గిడ్డంగి తాళం తీసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను, గోదాంలోని బియ్యం నిల్వ వివరాలను తనిఖీ చేశారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు వారు తెలిపారు. కాగా, కలెక్టర్ తనిఖీకి వచ్చిన సమయంలో తాను డీఎస్‌వో కార్యాలయంలో ఉన్నట్టు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి వెంకన్న తెలిపారు. శనివారం ఉదయమే తాను ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలో విధులకు హాజరయ్యానని, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం తరలించిన అనంతరం డీలర్లకు బియ్యం కేటాయింపుల పత్రం కోసం హనుమకొండలోని డీఎస్‌వో కార్యాలయానికి వెళ్లానని తెలిపారు.

ఏడుగురు గుప్త నిధుల ముఠా అరెస్టు

మెటల్ డిటెక్టర్, ట్యాబ్, కారు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం

వరంగల్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, తవ్వకాల కోసం ఉపయోగించే మెటల్ డిటెక్టర్, ట్యాబ్, 7సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని నిందితులను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వేములవాడకు చెందిన నర్సింగోజ్ శంకర్, ముద్దంగుల రవి, ఎర్రం శరత్‌రెడ్డి, ముల్కనూర్‌కు చెందిన కంది శివాజీ, కరీంనగర్ జిల్లా రేకుర్తికి చెందిన ఊట్ల అశోక్, కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన పడమటండి రాజు, మౌటం నాగరాజును అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించగా, ఐతరబోయిన తిరుపతి పరారీలో ఉన్నట్లు తెలిపారు.



గుప్త నిధుల కోసం తవ్వకాలు చేసిన గుంత

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉద్యోగుల కమిటీ ఎన్నిక

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కాకతీయ వైద్య కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆస్పత్రి ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.విక్రమ్‌కుమార్, అధ్యక్షురాలిగా డి.శోభ, ప్రధాన కార్యదర్శిగా అమన్ మీర్జా, ఉపాధ్యక్షులుగా ఎస్.ప్రసాద్, ఎస్. భానురేఖ, పి.దేవి, జి.సంతోష్‌కుమార్, పి.మురళి, ప్రియదర్శిని, కార్యదర్శులుగా డి.సంధ్య, ఎం.హిమబిందు, ఎ.శ్రీకాంత్, ఆర్. లావణ్య, జి.రమాదేవి, పి.రాజు, కోశాధికారిగా టి.రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బి.దేవేందర్, సుజిత్ కుమార్, ప్రశాంతి, అనిల్, స్వర్ణలత, రాజ్‌కుమార్, మురళి, రత్నకుమారి, కోమల, రేష్మ, భిక్షపతి, భద్ర, మౌనిక, జయసుధా, సుమతి ఎన్నికయ్యారు.



శోభ



అమన్ మీర్జా

ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సమ్మక్క
- సీపీఎం కార్యాలయంలో అంగన్‌వాడీ 2వ మహాసభలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సమ్మక్క అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా 2వ మహాసభలు శోభారాణి, జోత్స్న, ప్రేమలత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సమ్మక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ), ప్రైమరీ విద్యను, కేవీ, నవోదయలాంటి స్కూల్ లకు అప్పగిస్తే పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించే పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అందిచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ప్లేవే పద్ధతితో అనుభవజ్ఞులైన అంగన్‌వాడీ కార్యకర్తలు బోధిస్తారన్నారు. ప్రైమరీ విద్యను అంగన్‌వాడీలకు అప్పజెప్పాలని, ఐసీడీఎస్‌ను పర్మినెంట్ చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు మెరుగైన అధునిక సౌకర్యాలు కల్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలని వెంటనే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థ పనిచేయడానికి సౌకర్యవంతమైన ఇంటర్నెట్ విధానం అవసరమని, గ్రామీణప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు, సిగ్నల్స్ అందక అహర పంపిణీలో ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. ఎఫ్ఆర్ఎస్ వల్ల గర్భిణులు, పిల్లల ముఖచిత్రాలు సేకరించడం, ఆధార్ లింక్‌తో ఓటీపీ ధ్రువీకరణ వంటి వాటి వలన డేటా దుర్వినియోగం, సైబర్ మోసాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌తో అంగన్‌వాడీ టీచర్ల సమయం వృథా కావడమే కాకుండా వారి కళ్ల మీద, మెదడ మీద ఒత్తిడి పెరిగి అనారోగ్య సమస్యల తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఈ మహాసభలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రభాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యురాలు కె.రమాదేవి, శ్రీలేఖ, జమున, హైమావతి, ప్రసన్న రజిత, ఉమాదేవి, వసంత, రాజేశ్వరి, తిరుమల, స్వరూపరాణి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమ్మక్క

వెల్లివిరిసిన సాంకేతిక సృజన

- 50కి పైగా ఈవెంట్లతో సందడిగా సాగిన సాంకేతికోత్సవం
- చివరి రోజూ కొనసాగిన ఈవెంట్లు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- విజేతలకు నగదు బహుమతుల ప్రదానం
- నిట్‌లో ముగిసిన టెక్నోజియాన్

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో రెండు రోజుల పాటు వైభవంగా జరిగిన టెక్నోజియాన్-2025 (సాంకేతికోత్సవం) శనివారం ముగిసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎన్ఐటీల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు టెక్నోజియాన్‌లో పాల్గొన్నారు. వరంగల్ నిట్‌లోని 7వేల మందికిపైగా విద్యార్థులు కూడా వీరితో కలిసి వివిధ ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీలు, పలు విభాగాల ఆధ్వర్యంలో 50కిపైగా ఈవెంట్లను నిర్వహించారు. ప్రతీ ఈవెంట్ ప్రత్యేకతను చాటాయి. వీటిలో చాలా వరకు కొత్తవి. సరికొత్త ఆవిష్కరణలు. వినోదాన్ని పంచే ఫన్నీ ఈవెంట్లు కొన్ని కాగా, వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచే ఈవెంట్లు మరికొన్ని. అన్నింటిలోనూ విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటారు. వీరికి టెక్నోజియాన్ ముగింపు సందర్భంగా రూ.2.60 లక్షల నగదు పురస్కారాలను, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. శనివారం రెండో రోజు కూడా వివిధ ఈవెంట్లు పోటాపోటీగా సాగాయి. నిట్ అధ్యాపకులు, సాంకేతిక నిపుణులు టెక్నోజియాన్‌లో నిర్వహించిన ఈవెంట్లు, ప్రదర్శించిన ఎగ్జిబిట్లను స్వయంగా పరిశీలించి వాటి ప్రత్యేకతలను రికార్డుచేశారు. భవిష్యత్‌లో ఈ సమాచారం ప్రయోగాల కొనసాగింపునకు దోహదపడుతుందని ఈవెంట్ టీమ్‌లీడర్లు అభిప్రాయపడ్డారు.

చిన్నారుల హల్‌చల్

టెక్నోజియాన్‌లో చిన్నారులు హల్‌చల్ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము స్వయంగా రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. టెక్నోజియాన్ ద్వారా సాంకేతిక కళాశాలలో చదివే విద్యార్థులనే కాకుండా చిన్నారులను కూడా ప్రోత్సహించే లక్ష్యంతో వారికీ ఇందులో అవకాశంకల్పించారు. సైన్స్‌పట్ల వారిలో జిజ్ఞాస పెంపొందించే ఉద్దేశంతో వారి ఎగ్జిబిట్ల ప్రదర్శనకు అవకాశం కల్పించారు. టెక్నోజియాన్‌కు హాజరైన ఇతర రాష్ట్రాల నిటియన్లు ఈ ఎగ్జిబిట్లను ఆసక్తిగా తిలకించారు. 40కిపైగా ఎగ్జిబిట్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. పిల్లలంతా 5 నుంచి 10 ఏళ్లలోపువారే. అర్జున్ సాయి అనే ఐదేళ్ల యూకేజీ విద్యార్థి ప్రదర్శించిన మెటల్ డిటెక్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎలక్ట్రిక్ సర్క్యూట్ ద్వారా లోహాలను ఎలా కనిపెట్టవచ్చో దీని ద్వారా చూపించాడు. మరో విద్యార్థి మూగవాళ్ల కోసం యూసింగ్ ఫ్లెక్సనర్ ఫర్ సింబాలింగ్ అనే పరికరాన్ని రూపొందించాడు. మూగవాళ్లు దీనిని ద్వారా సంకేతాలు పంపి తమకు కావలసింది తెలియచేయవచ్చు. మరో విద్యార్థి వీల్‌చైర్‌ను రిమోట్ ద్వారా నడిపే పరికరాన్ని తయారు చేశాడు.



● కిట్ అసెంబ్లీ

టెక్నోజియాన్‌లో భాగంగా నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కిట్ అసెంబ్లీ విశేషంగా ఆకట్టుకున్నది. ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగాపాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న వారికి కార్లు, మోటారు సైకిళ్లు, వివిధ వస్తువులకు సంబంధించిన విడిభాగాలను ఇస్తారు. ఒక బాక్స్‌లో ఒకటి నుంచి ఆరు వస్తువులు విడి భాగాలు ఉంటాయి. పోటీలో పాల్గొనేవారు వీటిలో ఏదైనా ఒక వస్తువు విడిభాగాలను 40 నుంచి 60 నిమిషాల్లో కలిపి దాని వాస్తవ రూపాన్ని తీసుకురావాలి. ఇలా నిర్ణీత సమయంలో ఒక కిట్‌లోని విడి భాగాలను కలపగలిగిన వారినే విజేతలుగా పరిగణిస్తారు.



● ఆప్టి మిస్త్రీ

ఇది కూడా ప్రత్యేక ఈవెంటే. ఒక మిస్టరీని ఛేదించడానికి మనం సృజనాత్మకతను వాడుతాం. ఈ ఈవెంట్‌లో సృజనాత్మకతకు విద్యుత్‌ను కూడా జోడిస్తే.. ఇదో కొత్త భావన. నిట్‌లోని ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు దీనిని రూపొందించారు. కొన్ని లాజికల్ ఎలక్ట్రికల్ సర్క్యూట్‌లో కొన్ని నెంబర్లు ఉంటాయి. ఈ నెంబర్ల సహాయంతో విద్యార్థులు తమ సృజనాత్మతను జోడించి కొన్ని కోడ్స్ పంపడం ద్వారా మిస్టరీని ఛేదిస్తారు. మిస్టరీని ఛేదించడంలో మనుషులతో పాటు విద్యుత్ సహాయం తీసుకోవచ్చునని దీనిని బట్టి తెలుసుకోవచ్చు.



● సుమో వార్

ఇది కూడా ఒక ఫన్నీ ఈవెంట్. సుమోల మల్లయుద్ధం లాంటిది. వాస్తవంగా అయితే బరిలో మల్లయుద్ధం సుమోలు చేస్తారు. కానీ, ఈ ఈవెంట్‌లో సుమోలకు బదులు చెక్కతో ప్రత్యేకంగా రూపొందించి చతురస్రాకారపు బాక్స్, దానిపై అమర్చిన ఇనుప ఈటె, బాక్స్‌పై బెలూనే సుమో వీరుడు. రింగ్‌లో మొత్తం నాలుగు ఉంటాయి. రింగ్‌ను అనుకొని డేంజర్ జోన్ ఉంటుంది. రిమోట్ సాయంతో ఈ బాక్స్‌లను ఒకదానికి ఒకటి ఢీకొట్టడం ద్వారా ప్రత్యర్థి బాక్స్‌ను రింగ్ బయటకు డేంజర్ జోన్‌లోకి పంపినవారే విజేత. బయటకు పంపలేకపోయినా బాక్స్‌పై ఉన్న ఈటెతో ఎదుటి బాక్స్‌పై ఉన్న బెలూన్ అయిన పగులగొట్టగలిగినా గెలిచినట్టే.



● బ్లేజ్

ఇది ఒక ఫన్నీ ఈవెంట్. లేజర్ బుల్లెట్ల ద్వారా ఎదుటి వ్యక్తిని శక్తిహీనుడిని చేయడం ఈవెంట్ ప్రత్యేకత. ఇందులో ఇద్దరు ప్రత్యర్థులు ఉంటారు. వారి చేతిలో రెండు లేజర్ గన్లు ఉంటాయి. ప్రత్యేకంగా రూపొందించిన బ్లేజర్‌ను ధరించి పోటీలో పాల్గొనాలి. ఈ బ్లేజర్‌పై రిసీవర్ ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు తమ లేజర్ గన్‌ల ద్వారా దానిపై సరిగ్గా గురిపెట్టి పరస్పరం షూట్ చేసుకుంటే లేజర్ బుల్లెట్ ఎవరికి తగులుతుందో ఆ ప్రత్యర్థి శక్తి విహీనమవుతాడు. అలా ఎవరైతే ముందుగా తన ప్రత్యర్థిని శక్తివిహీనుడిని చేస్తారో వారు విజేత. వరంగల్ నిట్ రోబోటిక్ ట్యాబ్ దీనిని రూపొందించింది.



● నో బగ్స్ గివెన్

ఇది కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు పరీక్ష పెట్టే ఈవెంట్. ఈవెంట్‌లో ఐదు నుంచి ఆరు రౌండ్లు ఉంటాయి. ఒక ప్రాజెక్టులోని బగ్స్(ఎర్రర్స్)ను కోడింగ్ ద్వారా ఎంత వేగంగా చేయగలిగితే అంత ర్యాంక్ వస్తుంది. కోడింగ్ మొదట పూర్తి చేసిన వారు ఒక రౌండ్ నుంచి ఇంకో రౌండ్‌కు వెళతుంటారు. మొత్తం ఆరు రౌండ్లు ఉంటాయి. ఇందులో మొదటి మూడు రౌండ్లు ఎవరు ముందు చేస్తే వారే విజేతలు. ఈ పోటీలో సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నిబద్ధతతోనే విజయం

- జీవితంలో స్వీయ కృషి ఎంతో ముఖ్యం
- గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి
- రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డైరెక్టర్ బాలలత
- వరంగల్ నిట్‌లో ప్రేరణాత్మక ప్రసంగం

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, నిబద్ధత, దూరదృష్టి ద్వారా ఎలాంటి సవాళ్లయినా అధిగమించి విజయాన్ని సాధించవచ్చునని రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్, సివిల్ పరీక్షల శిక్షకురాలు, మోటివేటర్ మల్లవరపు బాలలత అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025లో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ.. జీవితంలోని ప్రతీ దశలో నిరంతర కృషి, స్వీయ విశ్వాసం ముఖ్యమన్నారు. విద్యార్థులు ఇష్టమైన వృత్తిని ఎంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎలాన్ మస్క్ క్రమబద్ధమైన పని విధానం గురించి బాలలత ఆసక్తిగా వివరించారు. ఆయన చిన్న విరామాలతో క్రమ శిక్షణతో కూడిన పనిసమయాలను పాటిస్తారని చెప్పారు. అలాగే రతన్‌టాటా స్వభావం, వినయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించిన వ్యక్తుల జీవితాల నుంచి ప్రేరణ పొందాలని, వారి ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదగాలని అన్నారు. మొబైల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. విజయవంతమైన వ్యక్తులు తమ సమయాన్ని, ఆలోచనను సమాజాభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వినియోగిస్తారని అన్నారు. నియమబద్ధమైన జీవనం, విశ్లేషణాత్మకమైన ఆలోచనలు, నిరంతర అధ్యయనం, కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస వంటి మంచి అలవాట్లు విజయానికి సోపానాలని అన్నారు. అనంతరంవిద్యార్థులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలుఇచ్చారు. తన జీవిత ప్రయాణాన్ని సంక్షిప్తంగా వివరించారు.



మాట్లాడుతున్న బాలలత



● ఫొటో డిజైన్

టెక్నోజియాన్‌లో భాగంగా ఫొటో డిజైనర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సాంకేతిక ఉత్సవంలో పాల్గొనే విద్యార్థులు తీపి గుర్తుగా ఇక్కడ నిలబడి ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. అందమైన ఫ్రేమ్‌ను రూపొందించారు. ఆ ఫ్రేమ్ మధ్యలో నిలబడడం ద్వారా దిగే ఫొటోలు కళాత్మకంగా కనిపిస్తున్నాయి.



● మోషన్ క్యాప్చర్ వర్క్‌షాప్

ఈ వర్క్‌షాప్ టెక్నోజియాన్‌లో ప్రత్యేకంగా నిలిచింది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. స్క్రీన్‌పై పదికి పైగా కార్టూన్ పాత్రలు ఉంటాయి. అందులో ఏదైనా ఒక దానిని ఎంచుకోవాలి. ఎదురుగా కెమెరా ఉంటుంది. దానిముందు నిల్చొని మనం ఎలా నటిస్తే స్క్రీన్‌పై మనం ఎంచుకున్న కార్టూన్ అలా కదులుతుంది. దీనిని రికార్డు చేస్తే కార్టూన్ ఫిల్మ్ అవుతుంది.



● మర్డర్ మిస్టరీ

టెక్నోజియాన్‌లో ఎక్కువగా ఆకట్టుకున్న ఈవెంట్ మర్డర్ మిస్టరీ. ఫన్నీగా, ఎగ్జైటింగ్‌గా ఉన్న ఈ ఈవెంట్ విద్యార్థుల తెలివి తేటలకు పరీక్ష పెట్టింది. ఓ హత్య కేసును ఛేదించే క్రమంలో కృత్రిమ మేధ చాట్‌బాట్స్‌ను ఉపయోగించి అనుమానితులుగా పేర్కొన్న వారి ప్రవర్తనను నిశితంగా బేరీజు వేసుకుంటూ హత్యోదంతానికి రూపకల్పనచేసి తద్వారా ఈ అనుమానితుల్లోని అసలైన హంతకుడిని గుర్తించడం ఈ ఈవెంట్ ప్రత్యేకత. ఇందుకు 40 నిమిషాల వ్యవధిఉంటుంది. ఆలోగా ఏటీమ్ గుర్తిస్తే అదే విజేత. ఇంకో టీమ్‌లో ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు ఉంటారు.



మూగ వారి కోసం తయారు చేసిన సెన్సార్ పరికరం



చిన్నారి రూపొందించిన మెటల్ డిటెక్టర్



లైట్ పెయింటింగ్‌పై వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న విషయ నిపుణుడు



చిన్నారుల ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న సందర్శకులు

సీజేఐపై దాడి న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై దాడి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బాలసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా(సీజేఐ)పై ఒక లాయర్ బూటుతో దాడి చేసిన సంఘటన న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగంపై, దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అభివర్ణించారు. దళితుడైన గవాయ్‌పై దాడి జరిగితే దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ వ్యవస్థలన్నీ ఎందుకు మౌనంగా ఉంటున్నాయనే ప్రశ్నకు ఇంత వరకు జవాబు దొరకడం లేదన్నారు. శనివారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంద కృష్ణ మాదిగ మాట్లాడారు. దేశంలో న్యాయ వ్యవస్థకు అధిపతి అయిన చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగితే ఎలాంటి చర్యలు చేపట్టక పోవడానికి కారణాలేంటో అర్థం కావడం లేదన్నారు. దాడి జరిగాక దేశ ప్రధాని నరేంద్రమోదీ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ దాడిని దేశం యావత్తు ఖండిస్తోందని, ఈ సంఘటన ప్రతీ భారతీయుడిని ఆగ్రహానికి గురి చేసిందని, ఇది న్యాయ వ్యవస్థపై దుర్మార్గమైన చర్య అని అన్నారని మంద కృష్ణమాదిగ తెలిపారు. దేశ ప్రతిపక్ష నేతలైన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ సంఘటనను రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఖండించారని అన్నారు. అంతేగాక సిద్ధాంతాలు ఏమైనప్పటికీ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, వామపక్షాలతో సహా సంఘటనను ఖండించాయని ఇంకా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు ఎందుకు చేయడం లేదని డిమాండ్ చేయకుండా ఎందుకు మౌనం వహిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మల్లికార్జున ఖర్గే దళితుడైనప్పటికీ ఎందుకు మౌనం వహిస్తున్నారో జవాబు చెప్పాలని అన్నారు. సంఘటనపై మానవ హక్కుల కమిషన్ ఎందుకు స్పందించడం లేదన్నారు. సంఘటనను మేధావులతో సహా అన్ని వ్యవస్థలు ఖండించినా ఎందుకు నిరసన తెలపడం లేదని అన్నారు. దళిత పార్టీలకు న్యాయకత్వం వహిస్తున్న పార్టీలు కూడా ఎందుకు మౌనంగా ఉంటున్నాయని అన్నారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి పట్ల దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవం పేరుతో లక్షలాది మందితో నవంబరు 1న నిరసన ప్రదర్శనకు పూనుకుంటున్నట్లు మంద కృష్ణ మాదిగ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా న్యాయ వ్యవస్థపై గౌరవం ఉన్న రాజకీయ పార్టీలన్నీ నిరసన ప్రదర్శనలో పాల్గొనాల్సిందిగా మంద కృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద సుకుమార్ మాదిగ, జిల్లా ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి అక్కెనకుంట వెంకటస్వామి మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు చాతాళ్ల శివ మాదిగ, మాదిగ యువసేన నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్స్ అడ్మిషన్లన్నీ ఆన్‌లైన్‌లోనే..

- దుబారా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు
- పీజీ కొత్త విద్యార్థులకు హాస్టల్స్ అడ్మిషన్లు
- కొత్త విద్యార్థులతో కేయూలో సందడి





హాస్టల్ అడ్మిషన్ పత్రాలను ఇస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కొత్త విద్యార్థులతో కేయూ హాస్టల్ ఆఫీస్ వద్ద సందడి

కేయూ క్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో కొత్త విద్యార్థులతో సందడి నెలకొంది. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర కోర్సుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. అక్టోబరు 24 నుంచి ఫిబ్రవరి 19 వరకు పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ అల్మానాక్ విడుదల చేయడంతో విద్యార్థులతో వర్సిటీలో సందడి నెలకొంది. కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టళ్లలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది నుంచి హాస్టల్ అడ్మిషన్లన్నీ ఆన్‌లైన్‌లోనే చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ నేతృత్వంలో రూపొందించారు. విద్యార్థుల సమగ్ర వివరాలన్నీ కేయూ హాస్టల్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. హాస్టల్స్ డిపాజిట్‌ను చెల్లించగానే అడ్మిషన్ ఫామ్ జనరేట్ అవుతుంది. అడ్మిషన్ ఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత విభాగాధిపతితో సంతకం చేయించి వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో అందచేయగానే రూమ్‌తోపాటు మెస్‌కార్డు ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ వెల్లడించారు.

కేయూ హాస్టల్ వెబ్‌సైట్ ఇదే..

కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర ఏదైనా రెగ్యులర్‌లతో పాటు కొన్ని ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వర్సిటీలో వారి కోర్సు కాలపరిమితి మేరకు హాస్టల్‌తోపాటు మెస్ సౌకర్యాలు కల్పిస్తారు. హాస్టల్ వసతి కోసం కేయూ కాలేజేస్.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అకడమిక్ ఇయర్, కోర్సు టైప్, కోర్సు, కోర్సు ఇయర్, సెమిస్టర్, కాలేజీ, హాల్‌టికెట్ నెంబరు, స్టూడెంట్, తండ్రి, తల్లి పేరుతో పాటు పాటు పుట్టిన తేదీ, సామాజిక వర్గం, అడ్రస్, డిపాజిట్ వివరాలతో పాటు ఫొటో నమోదు చేయాలి. తర్వాత హాస్టల్ ఫామ్ జనరేట్ అయిన తర్వాత డౌన్‌లోడ్ చేసుకుని మెస్, హాస్టల్స్ సౌకర్యాలు పొందాలి. వెబ్‌సైట్ అడ్రస్ https://kucolleges.co.in/hostels/newad-mission వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ వెల్లడించారు.

హాస్టల్స్ ఫీజుల వివరాలు ఇవే..

కేయూలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సామాజిక వర్గాల వారీగా హాస్టల్స్ డిపాజిట్లను నిర్ణయించారు. ఓసీ కేటగిరి అభ్యర్థులు రూ.12,200, బీసీ కేటగిరి అభ్యర్థులు రూ.10,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.8,200 చెల్లించాలి. అన్ని కేటగిరీలకు చెందిన దివ్యాంగులు ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని డైరెక్టర్ తెలిపారు.

కావాల్సిన ధృవపత్రాలివే..

హాస్టల్స్‌లో అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థులకు కాలేజీ అలాట్‌మెంట్ ఫామ్, హాస్టల్ అడ్మిషన్ రశీదు, ప్రిన్సిపాల్ ఆఫీస్ అడ్మిషన్ రశీదు, ఆదాయ ధృవీకరణ, ఆధార్‌కార్డు, కుల ధృవపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలి.

మహిళలకు పద్మాక్షి.. పురుషులకు న్యూపీజీ హాస్టల్..

నూతనంగా కేయూలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తారు. మహిళా అభ్యర్థులకు క్యాంపస్‌లోని పద్మాక్షి లేడీస్ హాస్టల్, అలాగే పురుషులకు న్యూపీజీ హాస్టల్‌లో గదులు కేటాయిస్తారు. ఇతర వివరాలకు క్యాంపస్‌లోని హాస్టల్ ఆఫీస్‌లో సంప్రదించాలని కోరారు. దరఖాస్తులు చేసుకున్న వారందరికీ హాస్టల్స్, మెస్ సౌకర్యాలు అప్పటికప్పుడు అందిస్తామన్నారు.

కొత్త విద్యార్థులతో క్యాంపస్ కళకళ

అక్టోబరు 24 నుంచి పీజీ కోర్సుల సెమిస్టర్ తరగతులు షురువు కావడంతో విద్యార్థులు క్యాంపస్‌కు తరలివచ్చారు. హాస్టల్ వసతి కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. అన్ని విభాగాల విద్యార్థులతో క్యాంపస్ కొత్త కళ సంతరించుకుంది. పీజీ అడ్మిషన్ల రెండో దఫా, మూడో దఫా అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగుతోంది. మొదటి దఫాలోనే క్యాంపస్ కళాశాలలో దాదాపుగా సీట్లన్నీ నిండినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ఎంజీఎం సూపరింటెండెంట్‌పై వేటు?

- వరుస సంఘటనలపై ఆరోగ్య శాఖ మంత్రి సీరియస్

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎంజీఎంలో జరుగుతున్న వరుస సంఘటనలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయినట్లు తెలిసింది. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శిని శనివారం ఆదేశించినట్లు తెలిసింది. అదేవిధంగా ప్రతీవారం ఎంజీఎంపై సమీక్ష నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని డీఎంఈని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఎంజీఎం ఘటనలపై 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలను ప్రచురించింది. ఎంజీఎంలో మంచం ఎక్కిన పాలన, ఎంజీఎంలో గాడితప్పిన పాలన, శిథిలావస్థకు చేరిన నర్సింగ్ స్కూల్ భవనం లాంటి కథనాలు ప్రచురితం అయ్యాయి. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని ఆదేశించినట్లుగా తెలిసింది. అదేవిధంగా పలువురు ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం నూతన సూపరింటెండెంట్ అయినా ఎంజీఎం పాలనను గాడిలో పెట్టాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేఎంసీలో ఉత్కర్ష-2025 ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, తదితరులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక కళాశాల ఉత్సవం ఉత్కర్ష-2025 శనివారం ప్రారంభమైంది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సుంకరనేని అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డాక్టర్ శ్రీధర్ కస్తూరి (1980 బ్యాచ్ అలుమిని), సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ.. ఉత్కర్ష ప్రతీ సంవత్సరం విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనకు, సామాజిక బాధ్యతాభావం పెంపొందించేందుకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక, క్రీడా, సామాజిక కార్యక్రమాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మధుబాబు, డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ రమేశ్, డాక్టర్ గౌతమ్, వైద్య విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేడు రైతు సదస్సు

న్యూశాయంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రైతు సదస్సు, మెగా హెల్త్ క్యాంపు, నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సదస్సులో సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త చలపతిరావు హాజరై వ్యవసాయానికి సంబంధించిన మెళకువలపై అవగాహన కల్పిస్తారన్నారు. హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ ఆస్పత్రి వైద్య బృందంచే మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఐవా అధ్యక్షుడు కృష్ణమనేని పాపారావులు హాజరవుతారని ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రైతులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటేశ్వర్‌రావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కుమార్‌పల్లిలో పట్టుబడిన పేకాటరాయుళ్లు

వరంగల్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమార్‌పల్లి మార్కెట్ ఏరియాలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకుకొని వారి నుంచి రూ.8,935 నగదును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఏడుగురిలో ఆరుగురు పురుషులతో పాటు 19 ఏళ్ల యువతి పట్టుబడ్డట్లు తెలిపారు. తదుపరి చర్యలు కోసం హనుమకొండ పోలీసులకు అప్పగించామన్నారు.

'సుమతిరెడ్డి'లో ప్లేస్‌మెంట్ డ్రైవ్



సావనీర్ విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఎంఎన్‌సీ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినీలకు నియామక పత్రాలను అందజేశారు. ప్రత్యేకంగా అమెజాన్ కంపెనీలో రూ.1.2 కోట్ల ప్యాకేజీతో ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థినీ కె.మానసతో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సావనీర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.మహేష్, వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ ఎన్.శ్రీవాణి, డాక్టర్ ఇ.కుమారస్వామి, డాక్టర్ కె.శ్రీని వాస్, బి.ప్రశాంత్, కళాశాల ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పోస్టల్ కాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట, పోలీస్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్, టెంపుల్ ట్రీ విల్లాస్ ఏరియాలో 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

యువత డ్రగ్స్ బారిన పడొద్దు


మాట్లాడుతున్న ఎస్సై పరుశురాములు

వరంగల్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ బారిన పడొద్దని హనుమకొండ ఎస్సై పరుశురాములు సూచించారు. శనివారం హనుమకొండ పద్మాక్షీకాలనీలో ఎస్ఆర్ కళాశాలలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో యువతకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై పరుశురాములు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టిసారించి ఉన్నతంగా ఎదగాలన్నారు. గంజాయి విక్రయించిన, సేవించిన 8712584473 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100, సైబర్ క్రైమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, రోడ్డు ప్రమాదాలు, సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 గురించి తెలియజేసేలా జాగృతి కళాబృందం వారి ఆటపాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యం, జాగృతి కళాబృందం సభ్యులు నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పూల్‌సింగ్, శ్రీనువాస్, నారాయణ, విక్రమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వంగర గురుకుల పాఠశాలకు మూడు రోజులు సెలవులు

భీమదేవరపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంగర పీవీ నర్సింహరావు బాలికల గురుకుల పాఠశాలకు మూడు రోజుల పాటు సెలవులను ప్రకటించారు. రెండు రోజుల కిందట పదో తరగతి విద్యార్థి శ్రీవర్షిత ఆత్మహత్యకు పాల్పడగా తోటి విద్యార్థులు ఎలాంటి అం దోళనకు గురికాకుండా ఉండేందుకు మూడు రోజుల పాటు సెలవులను ప్రకటించారు. దీంతో విద్యార్థులందరూ ఇళ్లకు వెళ్లిపోవడంతో పాఠశాల ఒక్కసారిగా బోసిపోయింది.

ఉషు నేషనల్స్‌కు ఎంపికైన వరుణ్‌కు సన్మానం


ఉషు పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని సన్మానిస్తున్న కార్పొరేటర్

హసన్‌పర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తికి చెందిన పోతరాజు సంతోష్ కుమారుడు పోతరాజు వరుణ్ అండర్-17 ఉషు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శీలం పార్థసారథి తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకు మార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వరుణ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. జమ్మూకాశ్మీర్‌లో జరగ బోయే జాతీయ స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభకనబర్చి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, రైల్వే బోర్డు మెంబర్ దాసరి రాజు, నాయకులు మట్టెడ సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాది హరిచందన మృతి


వరంగల్ లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉభయ జిల్లాలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ న్యాయవాది వి.హరిచందన అనారోగ్యంతో మృతి(25) చెందారు. శనివారం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. హనుమకొండ బుద్ధభవన్ ప్రాంతానికి చెందిన న్యాయవాది హరిచందన.. 2023లో పెండెకంటి లా కాలేజీ నుంచి లా పట్టాను అందుకున్నారు. అనంతరం జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పులి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అంబేద్కర్, లైబ్రరీ సెక్రటరీ వెంకట్, వరంగల్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.పూజ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వైభవంగా నాగుల చవితి


మడికొండలోని మెట్టుగుట్టపై పుట్టకు వల్మీక పూజ నిర్వహిస్తున్న దృశ్యం

వేయిస్తంభాల గుడికి తరలివచ్చిన భక్తులు

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చారిత్రక శ్రీ రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల గుడిలో కార్తీక మహానాగుల చవితిని ఘనంగా నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నాట్యమండంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి పంచామృతాలతో నవరసాలతో సర్పసూక్త, శ్రీ సూక్తంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు, వారి సతీమణి హిమబిందుతో పాటు సీహెచ్ రమేష్ కుమార్, సూర్యప్రభ దంపతులు అభిషేకం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్ కుమార్ మహిళా భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, అర్చకులు సందీప్, ఆలయ వేదపండితులు గంగు మణికంఠ శర్మ అవధాని పర్యవేక్షణలో పూజాకార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం ఈ కార్తీక మాసం ప్రతీ సోమవారం వేయిస్తంభాల గుడిలో మహిళలకు సాయంత్రం వేళ సామూహికంగా దీపాలు వెలిగించుకునేందుకు వేయిస్తంభాల గుడి తరుపున ప్రమిదలు, వత్తులు, నువ్వుల నూనె అందించనున్నట్టు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. కార్తీక పౌర్ణమి నాడు వేలాదిమంది మహిళా భక్తులకు ఉచితంగా ప్రమిదలు అందచేయనున్నట్టు తెలిపారు

- మడికొండ: మడికొండలోని మెట్టుగుట్ట దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం నాగుల చవితిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామికి ఉదయం ఫల, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి విజయగణపతి స్వామి వారి ఆలయం వద్ద గల పుట్టకు వల్మీక పూజ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు నిర్వహించి పుట్టలో పాలుపోసి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారులు రామల సునిత, ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ తదితరులు పాల్గొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.


హసన్‌పర్తిలో నాగుల చవితి గురించి వివరిస్తున్న రమేష్ శర్మ


వేయిస్తంభాల గుడిలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ

- హసన్‌పర్తి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని వేద పండితులు దహగం రమేష్ శర్మ అన్నారు. మండల కేంద్రంలోని బొత్తల కుంట నాగమయ్య దేవాలయంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వీసం పాపిరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు దహగం రమేష్‌శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, నాయకులు అనుష, జన్ను రవిందర్, ఇమ్మడి రాజేందర్, దూడల ప్రకాష్, తాళ్ల మధు, వేల్పుల సాయి, బిగుళ్ల సురేష్, వల్లా గంగాధర్ పాల్గొన్నారు.

రాజనీతి శాస్త్రంలో చైతన్యకుమారికి డాక్టరేట్


కేయూ క్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకురాలు కె.చైతన్యకుమారి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ చైతన్యకుమారికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'పబ్లిక్ పాలసీ అండ్ ట్రైబల్ వెల్ఫేర్ ఏ స్టడీ ఆఫ్ ఐటీడీఏ ప్రోగ్రామ్స్ ఇన్ కొమురంభీం ఆసీఫాబాద్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ సాధించారు. కేయూ రిజిస్ట్రార్, రాజనీతి శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రామచంద్రం పర్యవేక్షణలో చైతన్యకుమారి పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన చైతన్యకుమారిని పలువురు అభినందించారు.

సోషల్ వర్క్‌లో వాణికి డాక్టరేట్


కేయూ క్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సోషల్‌వర్క్ విభాగం పరిశోధకురాలు బత్తిని వాణి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ వాణికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'హెల్త్ సీకింగ్ బిహేవియర్ ఎమాంగ్ కోయ ట్రైబ్ వుమెన్స్ ఇన్ ఏటూరునాగారం ఐటీడీఏ ఆఫ్ తెలంగాణ స్టేట్- స్టడీ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గాను డాక్టరేట్ సాధించారు. కేయూ సోషియాలజీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ టి.రమేశ్ పర్యవేక్షణలో వాణి పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన వాణిని పలువురు అభినందించారు.

కళాకారుడు శివాజీ మృతి తీరని లోటు

మడికొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం మడికొండకు చెందిన ప్రముఖ కళాకారుడు శివాజీ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. శివాజీ భౌతిక కాయాన్ని ప్రముఖ కళాకారుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు సందర్శించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ మృతి కళారంగానికి తీరని లోటని అన్నారు. ఆయన వెంట కుమ్మరి గూడెం మాజీ సర్పంచ్ , సామాజిక కార్యకర్త కళాకారుడు నల్లమారి రమేష్ ఉన్నారు.


శివాజీ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న నాగేశ్వర్‌రావు

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

- రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లాపూర్ శివారు బావుపేట క్రాస్‌రోడ్డు వద్ద శనివారం సాయంత్రం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో రైల్వే ఉద్యోగికి తీవ్ర గాయాలు కాగా ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లికి చెందిన దాడి ప్రభాకర్ బావుపేటలోని రైల్వే గేట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే శనివారం విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై హనుమకొండ నుంచి బావుపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో ఎల్లాపూరు శివారు బావుపేట క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ఘటనలో రైల్వే గేట్‌మెన్ ప్రభాకర్‌కు తలకు గాయాలుకాగా, ఐనవోలు మండలం సింగారంకు చెందిన ఆటో డ్రైవర్ పవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అనంతరం ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు.


రోడ్డు ప్రమాదానికి గురైన ఆటో, ద్విచక్ర వాహనం

హార్వెస్టర్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

హసన్‌పర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సరం డిసెంబర్‌లో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు చేసి రైతులకు డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న హార్వెస్టర్ యజమాని సంగ సంపత్‌పై చర్యలు తీసుకోవాలని గుంటూర్‌పల్లి రైతులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామంలో వరికోత కోసం యజమాని తీసుకువచ్చిన హార్వెస్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. బాధిత రైతుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. సంగ సంపత్ అనే హార్వెస్టర్‌ను యజమాని గత డిసెంబర్‌లో గంటూర్‌పల్లికి చెందిన 10 మంది రైతుల వద్ద వరి, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసి రైతులకు సుమారు రూ.10 లక్షలు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఈ నెల 23న సంబంధిత హార్వెస్టర్ యజమాని గుంటూర్‌పల్లికి చెందిన పలువురి రైతుల వరి పంట కోస్తుండగా గుర్తించి హార్వెస్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యజమాని రైతులకు డబ్బులు ఇవ్వకుండా మోసానికి పాల్పడడమే కాకుండా రైతులపై తప్పుడు ఫిర్యాదు చేశారని అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. అనంతరం రైతులు స్వాధీనం చేసుకున్న హార్వెస్టర్‌ను పోలీసు స్టేషన్‌లో అప్పగించి డబ్బులు ఇప్పించాలని పోలీసులను వేడుకున్నారు. ఎస్సై దేవేందర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో గంటూర్‌పల్లికి చెందిన బాధిత రైతులు సుంకరి రాంరెడ్డి, బొల్లెడ్ల దేవేందర్ రెడ్డి, ఇనుగాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఇనుగాల దేవేందర్‌రెడ్డి, పప్పు శ్రీకాంత్, ఇనుగాల సంజీవరెడ్డి, సుంకరి రమాదేవి, బొంత పద్మ, పోలు నిరంజన్, పింగిళి సమ్మిరెడ్డి, పింగిలి వెంకట్‌రెడ్డి ఉన్నారు.


వరికోత మిషన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తున్న రైతులు

కాలం చెల్లిన బేకరీ ఉత్పత్తులు పట్టివేత

వరంగల్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు సమీపంలోని ఖజూర్ బెంగుళూరు బేకరీలో కాలంచెల్లిన కూల్ కేక్ క్రీంతో పాటు కలర్స్ ఇతర 15 రకాల రూ.11వేల విలువ చేసే బేకరీ ఉత్పత్తులను శనివారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. బేకరీ నిర్వాహకుడు ఎం.డి. హనీఫ్‌ను విచారణ నిమిత్తం ఫుడ్ సేఫ్ ఆఫీసర్‌కు అప్పగించామన్నారు.

నవంబరు 8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 8, 9 తేదీల్లో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు క్రీడాపోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఓపెన్ టూ ఆల్ బాలబాలికల విభాగంలో రెండురోజుల పాటు పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు నగదు పురస్కారంతో పాటు, ప్రశంసాపత్రాలు, వ్యక్తిగత మెడల్స్ ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా కోరారు.

గ్రూప్-1, 2 విజేతలకు నేడు అభినందన సభ

న్యూశాయంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ -1, గ్రూప్ -2 ఉద్యోగాలు సాధించిన పద్మశాలి యువతకు ఆదివారం హనుమకొండలోని జిల్లా పరిషత్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్, పద్మశాలి జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకటరమణ శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ అభినందన సభకు రిటైర్డ్ ఐఏఎస్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల పూర్వ కమిషనర్ చిట్ల పార్థసారథి హాజరవుతారని గ్రూప్ -1, గ్రూప్- 2 సాధించిన పద్మశాలి యువకులు అభినందన సభకు హాజరు కావాలని ఆ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాయపర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైలారం గ్రామ శివారులో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన అంగిరేకుల శివ(26) తొర్రూరుకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా మైలారం గ్రామ శివారులో పెట్రోల్ పంపు సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వేలేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేలేరు మండలంలోని పలు గ్రామాలలో పత్తి, వరి, కంది పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పత్తిలో పిండినల్లి, గులాబి రంగు కాయతొలిచే పురుగు నివారణకు సలహాలు ఇవ్వడంతో పాటు కందిలో మచ్చల పురుగు ఆశించినట్లయితే నివారణకు వేపనూనే పిచికారి చేయాలని సుచించారు. పంటలకు సరైన సమయంలో మందులు పిచికారి చేసుకోవాలని, సస్యరక్షణ చర్యల్లో నిర్లక్ష్యం వహిస్తే పంట చేతికి అందకుండా పోతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట్‌రెడ్డి, రాములు, గోన్యనాయక్, మధు, పద్మజ పాల్గొన్నారు.

మూకుమ్మడిగా దోచేశారు..

- వెలుగులోకి వస్తున్న మిల్లర్ శ్రీనివాస్ అక్రమాలు
- నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్‌ల తిరస్కరణ
- కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- పరారీలో ఉన్న ఏఈవో అర్చన పీఎస్‌లో ప్రత్యక్షం

శాయంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని శాయంపేట, కాట్రపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో 2024-25 రబీ సీజన్‌లో నిర్వహించిన కొనుగోలు కేంద్రాలలో ప్రైవేట్ వ్యక్తులు, నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్ బెజ్జంకి శ్రీనివాస్‌తో కలిసి, ధాన్యం లేకుండానే ఉన్నట్లుగా అక్రమాలకు పాల్పడి రూ.1.87కోట్లు కాజేశారు. ఈ బాగోతం ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్ అధికారులు విచారణలో బయటపడి, మొత్తం 21మందిపై శాయంపేట పీఎస్‌లో కేసు నమోదైన విషయం విదితమే. ఇందుకుగాను పలువురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించగా.. కొందరు నిందితులు ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారు. నిందితులు లలిత, చరణ్‌ను పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ బండ లలిత, వాంకుడోతు చరణ్‌తో కలిసి అక్రమాలకు తెరలేపినట్లు విచారణలో తెలిసినట్లు సమాచారం. ఇందుకుగాను లలిత, చరణ్, శాయంపేట సెంటర్ ఇన్‌చార్జి హైమావతిలకు మిల్లర్ శ్రీనివాస్ రూ.లక్షల్లో వాటాలు అందజేశారని తెలిసింది. లలితను రైతుగా చూపి తన ఖాతాలో రూ.13 లక్షలు జమచేయించాడు. ఇవి కలుపుకుంటే మొత్తంగా స్కామ్ రూ.రెండు కోట్లకు చేరినట్లు తెలిసింది. ఈనెల 11న కేసు నమోదైనప్పటి నుంచి నిందితులు ముందస్తు బెయిల్ కోసం విస్తృతంగా ప్రయత్నాలుచేసినా ఎవరికీలభించకపోవడంతో పలు దఫాలుగా పిటిషన్‌లు వేస్తూనే ఉన్నారు. అరెస్ట్‌కాకుండా ఎవరికి బెయిల్ లభించలేదు. ఈ కేసులో ఇదివరకే పలువురు నిందితుల ఖాతాల్లో సుమారు రూ.70లక్షల వరకుడబ్బులు ఫ్రీజ్‌చేయగా, తాజాగా 8వేల క్వింటాళ్ల ధాన్యం రవాణా చేయకుండానే చేసినట్లుగా కాజేసిన రూ.4 లక్షలను నిందితుడైన ట్రాన్స్‌పోర్టర్ రాజేశ్వరరావు వద్ద రికవరీ చేశారు. నిందితులలో ఒకరైన శాయంపేట ఏఈవో అర్చన ఇంతకాలంగా పరారీలో ఉం డగా, ముందస్తు బెయిల్ తిరస్కరణతో శనివారం పీఎస్‌లో ప్రత్యక్షమైంది. కుటుంబ సభ్యులతో సహా పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ పట్టుబడితే పలు కీలక విషయాలు బయటపడనున్నాయి.

ఈ శీతాకాలం అందమైన రైలు ప్రయాణ అనుభవాన్ని సొంతం చేసుకోవాలనుకుంటున్నారా? అయితే మనోహరమైన ప్రకృతి దృశ్యాల గుండా సాగే ఈ రైలు ప్రయాణాలను ఎంచుకోండి.

చలికాలం చక్కర్లు కొట్టేద్దాం!

చలికాలం వాతావరణం ప్రయాణాలకూ, వినోదాలకూ ఎంతో అనుకూలంగా ఉంటుంది. పైగా ఈ కాలంలో పర్వత ప్రాంతాల ప్రకృతి ఎంతో రమణీయంగా ఉంటుంది. మంచు కప్పేసిన పర్వతాలు, దట్టమైన అడవులు, పారే సెలయేర్లు... ఇలాంటి అద్భుతమైన ప్రకృతి అందాలను వీక్షిస్తూ వాటి గుండా రైల్లో ప్రయాణించే అనుభవాన్ని పొందడం కోసం ఇవిగో ఈ రైలు ప్రయాణాలను ఎంచుకోవచ్చు.



కల్కా - శిమ్లా (హిమాచల్‌ప్రదేశ్)

కల్కా-శిమ్లా రైల్వే స్టేషన్... నిర్మాణ కౌశలానికి గాను 2008లో యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. 1903లో బ్రిటిషర్లు నిర్మించిన కల్కా-శిమ్లా రైల్వే మార్గం అద్భుతమైన ప్రకృతిదృశ్యాలకు పేరు పొందింది. మంచు పర్వతాల గుండా 900 వంతెనలు, వెయ్యి సొరంగాల మీదుగా సాగే ఈ రైలు ప్రయాణం అసాంతం అద్భుతమైన ప్రకృతిదృశ్యాలు మనల్ని కనువిందు చేస్తాయి. నాలుగు నుంచి ఐదు గంటల పాటు సాగే ఈ ప్రయాణం జీవితంలో మర్చిపోలేని అనుభవాన్ని అందిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



ప్యాలెస్ ఆన్ వీల్స్ (రాజస్థాన్)



అత్యంత విలాసవంతమైన రైలు ప్రయాణాన్ని కోరుకునేవాళ్లు ప్యాలెస్ ఆన్ వీల్స్‌ను తప్పక ఎంచుకోవాలి. ఈ విలావంతమైన రైలు ఏడు రాత్రుళ్లు, 8 పగళ్లు నిరాటంకంగా ప్రయాణిస్తుంది. రాజస్థాన్ నుంచి ఆగ్రా వరకూ నడిచే ఈ రైలును 1982లో లాంచ్ చేశారు. కళ్లుచెదిరే ఇంటీరియర్స్, అద్భుతమైన భోజనం, ఆతిథ్యం.. ఇలా ఈ రైల్లో విలాసాలకు ఏమాత్రం కొదవ ఉండదు. ఈ రైలు ప్రతి సంవత్సరం, సెప్టెంబరు నుంచి ఏప్రిల్ వరకూ నడుస్తుంది. ప్రధాన నగరాలైన ఢిల్లీ, జైపూర్, చిత్తోర్‌ఘడ్, ఉదయ్‌పూర్, ఆగ్రాల మీదుగా ప్రయాణిస్తుంది.

డార్జిలింగ్ - హిమాలయన్ రైల్వే (పశ్చిమ బెంగాల్)

డార్జిలింగ్, హిమాలయన్ టాయ్ ట్రైన్ యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. 1879 నుంచి 1881 మధ్య కాలంలో నిర్మించిన ఈ రైల్వే లైన్, కొత్త జల్పాయ్‌గురి, డార్జిలింగ్‌ల మధ్య నడుస్తూ ఉంటుంది. ఈ రైలు మార్గం అత్యంత ఎత్తులో ఉన్న రైల్వే స్టేషన్, ఘుమ్ మీదుగా ప్రయాణిస్తుంది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఈ మార్గంలో ప్రయాణించగలిగితే, మనోహరమైన పర్వత దృశ్యాలను వీక్షించే అవకాశం దక్కుతుంది. ఈ నెలల్లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు, రైల్లో నుంచి హిమాలయాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి.

జమ్ము - బారాముల్లా లైన్

కశ్మీర్ శీతాకాలపు భూతలస్వర్గం. కశ్మీరు అందాలను పూర్తి స్థాయిలో వీక్షించాలనుకునేవాళ్లు ఈ రైలు ప్రయాణాన్ని తప్పక ఎంచుకోవాలి. ఈ 324 కిలోమీటర్ల ప్రయాణంలో, మంచు కప్పేసిన పర్వతాలు, అందమైన నదులు కనువిందు చేస్తాయి. అలాగే ప్రపంచంలోనే అత్యంత పొడవాటి చీనాబ్ వంతెన మీదుగా ప్రయాణించే అవకాశం కూడా దక్కుతుంది. బనిహాల్ నుంచి సంగల్డన్ వరకూ సాగే భారతదేశంలోని అతి పొడవాటి సొరంగం కూడా ఈ దారిలోనే ఉంటుంది. కొత్తగా వాడుకలోకి వచ్చిన ఈ రైలు మార్గం ప్రయాణి కులకు ఒక కొత్త అనుభవాన్ని అందిస్తుంది.

నీలగిరి మౌంటెన్ రైల్వే

నీలగిరి మౌంటెన్ రైల్వే కూడా మరొక యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదే! మెట్టుపాళ్యం నుంచి ఊటీ వరకూ ప్రయాణించే ఈ రైలు మార్గాన్ని 1908లో బ్రిటిషర్లు నిర్మించారు. అందమైన ప్రకృతిదృశ్యాల గుండా సాగే ఈ రైలు పాతకాలపు ఆవిరి ఇంజన్‌తో నడుస్తుంది. పిల్లలూ, పెద్దలూ, ప్రకృతి ప్రేమికులు, చరిత్ర పట్ల ఆసక్తికలిగిన వారు... ఇలా ఈ రైలు ప్రయాణం ప్రతి ఒక్కర్నీ అందర్నీ అలరిస్తుంది. నీలగిరి కొండల అందాలను ఆస్వాదించాలనుకునేవారు ఈ రైలు ప్రయాణాన్ని మిస్ చేసుకోకూడదు.

చిన్న మాట మాట్లాడినా ప్రమాదమే!



తెలుగు సినీ పరిశ్రమలో ప్రతిభావంతులైన యువ హీరోల్లో **కిరణ్ అబ్బవరం** ఒకరు. ఈ మధ్యకాలంలో ఆయన నటించిన 'కె-ర్యాంప్' సంచలన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల నాడిని ఎలా పట్టుకోవాలి? సోషల్ మీడియాలో ఎలాంటి పాత్ర పోషిస్తోందనే విషయాలపై ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ.

'కె-ర్యాంప్' విజయం మీలో ఎలాంటి మార్పు తీసుకువచ్చింది..

'కె-ర్యాంప్' విజయం చాలా ఆత్మవిశ్వాసాన్ని కలగజేసింది. ఈ విజయాన్ని పూర్తిగా ఎంజాయ్ చేస్తున్నాను. ఈ సినిమాను మొదలుపెట్టినప్పుడే దీపావళికి విడుదల చేయాలనుకున్నాం. ఎందుకంటే పండుగకి ఇంట్లో వాళ్లందరితోను కలిపి సినిమాకు వెళ్లాలనుకుంటారు. పైగా పండుగ అంటే నగరాల నుంచి వేల మంది తమ సొంత ఊళ్లకు వెళ్తారు. అలాంటి వారందరు సరదాగా ఎంజాయ్ చేసే సినిమా తీయాలనుకున్నాం. సినిమాలో సీన్స్ అన్నీ అలాగే డిజైన్ చేశాం. ఆ ప్రయత్నంలో విజయవంతమయ్యామనే అనుకుంటున్నా.

కొన్ని వివాదాలూ ఎదురయ్యాయి కదా...

అవును. పత్రికా సమావేశాల్లో కొన్ని వివాదాస్పదమైన ప్రశ్నలు వేస్తూ ఉంటారు. అవి చాలావరకు సినిమాకు సంబంధం లేనివే అయి ఉంటాయి. అప్పుడప్పుడు ఈ ప్రశ్నలు ఎందుకు తలెత్తుతున్నాయనే ఆలోచనల వస్తుంది. కొంచెం ఇబ్బందిగా అనిపిస్తుంది. ఒక పండుగకు నాలుగు సినిమాలు విడుదలయినప్పుడు వాటి మధ్య పోటీ ఉంటుంది. పత్రికా సమావేశాల్లో కూడా ఈ సినిమాలను పోలుస్తూ ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. పొరపాటున మాట్లాడే చిన్న చిన్న మాటలు కూడా వివాదాస్పదమవుతున్నాయి. అందువల్ల చాలా సందర్భాలలో వివాదాస్పదమయిన ప్రశ్నలు అడిగినప్పుడు మౌనంగా ఉండిపోతున్నాను.

మీ స్క్రిప్ట్‌ల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

గత ఏడాదిన్నర నుంచి నా ఆలోచన సరళిలో మార్పు వచ్చింది. నాకు అర్థమయినంత వరకు అందరు ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా తీయలేం. ప్రేక్షకులు చాలా స్మార్ట్‌గా ఉంటున్నారు. వారికి నచ్చింది మాత్రమే చూస్తున్నారు. అందువల్ల రకరకాల సినిమాలు చేయాలనుకుంటున్నా. ఉదాహరణకు కె-ర్యాంప్‌నే తీసుకుందాం. ఇది ఎంటర్‌టైన్‌మెంట్ జోనర్‌కు సంబంధించినది. దీనిని ఇష్టపడే ప్రేక్షకుల కోసం ఎంత కొత్తగా తీయగలం, వారికి థియేటర్స్‌కు ఎలా తీసుకురాగలం? అనే విషయం పైనే ఎక్కువగా ఆలోచించా. నా ఉద్దేశంలో ఇంకా నాకు వయస్సు ఎక్కువ రాలేదు కాబట్టి... వచ్చే నాలుగేళ్ల పాటు రకరకాల స్క్రిప్ట్‌లను ఎంచుకొని సినిమాలు చేయవచ్చు.

ప్రేక్షకుల అభిరుచులు మారిపోతున్నాయనుకుంటున్నారా?

అనుకున్న సమయానికి సినిమా బయటకు రాకపోతే ఇబ్బందే! నా ఉద్దేశంలో మీడియం బడ్జెట్ సినిమాలకు- సినిమా మొదలుపెట్టిన ఏడు నెలల లోపులో బయటకు వచ్చేయాలి. ప్రొడక్షన్ విషయంలో లేటు అయితే సమస్యలు ఎదురవుతాయి. ప్రేక్షకులు కేవలం వర్తమానంలో ఉన్న భావోద్వేగాలకు ప్రభావితం అవుతున్నారు. ఏదైనా సినిమా మూడేళ్ల లేటు అయిందనుకుందాం. ఆ సబ్జెక్ట్ అప్పటి దాకా రానిదే అయిఉండవచ్చు. కానీ దానిలో ఉండే ప్రధానమైన పాయింట్స్ ఎక్కడో ఒక చోట వచ్చేస్తున్నాయి. ఎమోషన్స్ పాతబడిపోతున్నాయి. ఉదాహరణకు నేను నటించిన 'దిల్ రుబా' సినిమాను తీసుకుందాం. అది నా ఉద్దేశంలో మంచి సినిమా. 2022లో ప్రారంభించాం. లేటు అయిపోయింది. ఆదరణ తగ్గిపోవటానికి ఈ లేటే కారణం.



మీరు రచయిత కదా... మీ ఉద్దేశంలో తెలుగులో కథా రచయితలు తగ్గిపోవటానికి కారణాలేమిటి?

అవును. నేను రచయిత కావాలని ఇండస్ట్రీకి వచ్చాను. కానీ నటుడయ్యాను. ఇక కథల విషయానికి వస్తే- ప్రతి రచయిత తానే ఎందుకు దర్శకుడు కాకూడదనుకుంటున్నాడు. నా దగ్గరకు వచ్చే వాళ్లలో- "నా దగ్గర కథ ఉంది.. నిర్మాత లేదా డైరక్టర్‌ను చూపిస్తారా?" అడిగేవారు ఎవరూ లేరు. చాలామంది నిర్మాతలు- "మా డైరెక్టర్ దగ్గర కథ ఉంది. వినండి" అంటారు. దర్శకులు "మా దగ్గర కథ ఉంది.. వినండి" అంటారు. ఇతర భాషల్లో ఇలాంటి సమస్య లేదు. మళయాళంలో అనేకమంది రచయితలు కనిపిస్తారు.

ప్రేక్షకులను థియేటర్‌కు ఎలా తీసుకురావాలి?

సినిమాకు ఒక వైబ్ క్రియేట్ చేయాలి. కానీ ఆ వైబ్ ఎలా వస్తుందనే విషయం ఎవరికి తెలియదు. టీజర్‌తో వర్క్అవుట్ అవుతుందా? ట్రైలర్‌తో వర్కవుట్ అవుతుందా? అనే విషయం తెలియదు. ఒక సినిమాలో ఉన్నదేమిటనే విషయం పది రోజుల ముందు ప్రేక్షకులకు అర్థమవ్వాలి. అప్పుడే వాళ్లు థియేటర్స్‌కు వస్తున్నారు. సినిమా విడుదలయిన తర్వాత సినిమాలో ఉన్నది అర్థమయినా ప్రయోజనం ఉండకపోవచ్చు. ఓటీటీల్లో వస్తే చూద్దాం అనుకోవచ్చు. 'కె-ర్యాంప్' సినిమా కోసం నేను తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో పర్యటించాను. ఈ సినిమా విజయం కావటానికి కారణం- దీనిలో ఉన్న ఎంటర్‌టైన్‌మెంట్ ప్రేక్షకులకు అర్థం కావటం. 'థియేటర్‌కు వెళ్లి ఎంజాయ్ చేద్దాం' అనే భావన ఉన్నప్పుడే ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. లేకపోతే ఓటీటీలో వచ్చినప్పుడు చూద్దాం అని ఆగిపోతున్నారు.

అందరూ 'ఓటీటీలోనే చూద్దాం' అనే ఫీలింగ్‌లో ఉన్నారా?

అందరూ అలా లేరు. ఆడియన్స్‌కు కంటెంట్ నచ్చితే కచ్చితంగా థియేటర్‌కు వస్తారు. ఓటీటీలో చూద్దాం అనుకోరు. సినిమాలో ఉన్న ముఖ్యమైన విషయాలను ప్రేక్షకుడి దాకా పట్టుకు వెళ్లటమే నిజమైన ఛాలెంజ్. ఒకసారి ప్రేక్షకుడు సినిమాలో తమకు నచ్చేది ఉందని నమ్మితే వారు సినిమాను విజయవంతం చేస్తారు. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో చాలామంది మామూలు ప్రేక్షకులు సినిమా చూసి వచ్చి రివ్యూలు పెడుతున్నారు. "మామా... సినిమా అదిరింది.. థియేటర్‌లో చూడు" అంటున్నారు. లేకపోతే "మామా... సినిమా సో.. సో.. ఓటీటీలో చూసుకోవచ్చులే" అంటున్నారు.

నిర్మాతలు, దర్శకులు కూడా ఓటీటీల కోసమే తీస్తున్నారనే విమర్శ ఉంది కదా...

ఈ విమర్శను నేను అంగీకరించను. ప్రతి దర్శకుడు, నిర్మాత- తన సినిమా థియేటర్‌లో విడుదల చేయాలనే అనుకుంటాడు. మొదలు పెట్టినప్పుడు- థియేటరికల్ కాకుండా మిగిలిన మార్కెట్ల నుంచి ఎంత సొమ్ము వస్తుందని ఆలోచించవచ్చు. కానీ థియేటర్‌లో విడుదల చేయాలనే కోరిక ప్రతి నిర్మాతకు ఉంటుంది. షూటింగ్ ఒక 40 శాతం పూర్తయిన తర్వాత సినిమా ఎలా వస్తోందనే విషయం నిర్మాతకు అర్థమయిపోతుంది. ఒక వేళ ఏదైనా తేడా ఉంటే- మరింత మెరుగ్గా ఎలా చేయాలనే విషయాన్ని ఆలోచిస్తారు. అంతే తప్ప ఓటీటీలో విడుదల చేద్దాం అని వదిలేయరని నా అభిప్రాయం.

సోషల్ మీడియాపై మీ అభిప్రాయమేమిటి?

సోషల్ మీడియా ఒక వైల్డ్ ఫైర్‌లా తగులుకుంది. చాలా జాగ్రత్తగా ఉండాల్సిన రోజులు వచ్చాయి. ప్రతి చిన్న మాట ఆచితూచి మాట్లాడాల్సి వస్తోంది. ఇంతకు ముందు ఏదైనా మాట మాట్లాడితే అందరికీ తెలియటానికి కొన్ని రోజులు పట్టేది. ప్రస్తుతం గంటల సమయం వైల్డ్ ఫైర్‌లా పాకేస్తోంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

జీవితం గురించి ఇక్కడే నేర్చుకున్నా..



"విజయం ఒక్క రోజులో రాదు... నిరంతరం కష్టపడితేనే అది మనల్ని వరిస్తుంది" అంటున్నారు బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) ప్రొఫెసర్ **మాధవీలత**. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెన నిర్మాణంలో ఆమె కీలకపాత్ర పోషించారు. తాను చదువుకున్న 'వరంగల్-నిట్'లో 'టెక్నోజియాన్-2025' ప్రారంభోత్సవానికి హాజరైన మాధవీలత 'నవ్య'తో పలు విషయాలు పంచుకున్నారు.

"నేను 'ఆర్ఈసీ' (ప్రస్తుతం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)- వరంగల్) పూర్వ విద్యార్థిని. సివిల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ ఇక్కడే చేశాను. ఈ రెండేళ్లు నేను ఇక్కడ గడిపిన కాలాన్ని, అధ్యాపకుల సహకారాన్ని మరిచిపోలేను. జీవితం అంటే ఇక్కడే నేర్చుకున్నాను. ఈనాటి నా విజయానికి పునాది 'నిట్'లో పొందిన జ్ఞానమే. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నేను చదువుకున్న ఈ కాలేజీకి రావడం, ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. నాటి జ్ఞాపకాలన్నీ మరోసారి మనసులో మెదులుతున్నాయి. నా భర్త కూడా ఈ కాలేజీ పూర్వ విద్యార్థే.

సక్సెస్ అంటే..

సక్సెస్ అంటే నా దృష్టిలో రెండు రకాలు. ఒకటి సమాజానికి ఉపయోగపడే రీతిలో నిర్మాణాత్మకమైన ఒక పనిని విజయవంతంగా, అత్యంత ప్రతిభావంతంగా చేయగలిగే 'బాహ్య విజయం' ఒకటి. దీనివల్ల పొందే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. ఇక మనకు ఆత్మసంతృప్తిని పరిపూర్ణంగా కలిగించేది 'అంతర్ విజయం'. మనిషి ఈ రెండిటినీ ఎప్పుడూ అనుభూతి చెందుతూ ఉండాలి. కష్టపడకుండా ఏదీ రాదు. అలాగని 24 గంటలు కష్టపడాల్సిన అవసరం కూడా లేదు. నా విషయానికి వస్తే... నేను కష్టపడ్డాను అలాగే కుటుంబాన్ని కూడా పట్టించుకున్నాను. జమ్ము-కశ్మీర్‌లోని చీనాబ్ బ్రిడ్జి నిర్మాణంలో పాలుపంచుకున్నప్పుడు... అంత పని ఒత్తిడిలోనూ కుటుంబంతో గడిపాను. బాధ్యతలతోపాటు కుటుంబాన్ని కూడా బ్యాలెన్స్ చేయగలగాలి. కుటుంబం చాలా ముఖ్యం. అయితే కుటుంబం కోసం మన అలవాట్లను మానుకోవాల్సిన అవసరం కూడా లేదు. కష్టపడుతూనే మన హాబీలను కొనసాగించుకోవచ్చు. నాకు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. సమయం చిక్కినప్పుడల్లా పొలం పనులు చేస్తాను.

చీనాబ్ వంతెన గుర్తింపు తెచ్చింది...



చీనాబ్ వంతెన నిర్మాణం నాకు అనుభవంతో పాటు గుర్తింపు కూడా తెచ్చిపెట్టింది. ఈ వంతెన నిర్మాణంలో కన్సల్టెంట్‌గా 17 ఏళ్లుగా పనిచేసిన ఏకైక మహిళను నేనే. మధ్యలో ఎంతోమంది వెళ్లిపోయారు. కానీ ఎన్ని కష్టాలు వచ్చినా కొనసాగాను. ఆ వంతెన నిర్మాణంలో ఎంతో మంది కృషి ఉంది.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

యువత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటి సాధనకు నిరంతరం శ్రమించాలి. ఏది ముఖ్యమో అదే చేయాలి. సెల్‌ఫోన్‌కు అతుక్కుపోయి గంటల తరబడి సమయాన్ని వృధా చేయకూడదు. మన ముందున్న లక్ష్యాలు ఏమిటి? ఉన్నతస్థాయికి ఎదగడానికి ఏం చేయాలి? అనేది యువత గుర్తెరగాలి. అలాగే సామాజిక సంబంధాలు ఎంతో ముఖ్యం. ఈనాటి యువకులు, ముఖ్యంగా విద్యార్థులు తమ చుట్టు గిరిగీసుకుంటున్నారు. వారికి సన్నిహితులైన స్నేహితులు తక్కువ మంది ఉంటున్నారు. ఎక్కువ మంది స్నేహితులు ఉండాలి. ఏదైనా కష్టం వస్తే చెప్పుకోవడానికి సన్నిహితులు ఉండాలి. పది మంది మనుషులు మనకు దగ్గరగా ఉన్నప్పుడు సమస్యలు చెప్పుకుంటే తేలికవుతుంది. అది లేకపోవడం వల్లే యువత నైరాశ్యానికి గురవుతున్నారు. ఏ రంగంలోనూ నేను విజయం సాధించలేకపోతున్నానే బాధ వారిని కుంగదీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వారికి కుటుంబం అండగా ఉండాలి. వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలి. విజయం అనేది ఒక్క రోజులో రాదు. నిరంతరం నిజాయితీగా కష్టపడితేనే దాన్ని పొందగలం."





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఇడ్లీ కొట్టు	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 29
బల్లాడ్ ఆఫ్ ఏ స్మాల్ ప్లేయర్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 29
అమెజాన్ ప్రైమ్		
హెడ్డా	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 29
హెజ్బిన్ హోటల్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 29
జియో హాట్‌స్టార్		
మానా కీ హమ్ యార్ నహీన్	హిందీ సిరీస్	అక్టోబర్ 29
లోక ఛాప్టర్ 1: చంద్ర	మలయాళ చిత్రం (తెలుగులో)	అక్టోబర్ 31
సన్ నెక్ట్స్		
బ్లాక్‌మెయిల్	తమిళ చిత్రం	అక్టోబర్ 30

'పింక్ బాల్' మెరుపులు..!



నీతా అంబానీ ఫ్యాషన్ సెన్స్ కేవలం స్టయిల్స్ ట్రెండ్స్‌కు మాత్రమే పరిమితం కాదు. ఆమె దుస్తులు భారతీయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ఆమె తరచూ భారతీయ చేనేత, బనారసి, కాంజీవరం, పటోలా చీరలు ధరించి అంతర్జాతీయ వేదికల పైన సందడి చేస్తుంటారు. సంప్రదాయ దుస్తులు ధరించినా అధునాతన దుస్తుల్లో కనిపించినా ఆమె లుక్ సామాజిక మాధ్యమాల్లో ప్రముఖంగా చర్చనీయాంశమవుతుంది. ఆమె ఆభరణాల ఎంపిక కూడా అసాధారణంగా ఉంటుంది. మ్యాచింగ్ నగలను ధరించడంలో ఆమెకు ఆమే సాటి. ఇటీవల బ్రిటిష్ మ్యూజియంలో జరిగిన పింక్ బాల్ కార్యక్రమానికి దేశీ స్టయిల్‌లో హాజరయ్యారు నీతా. సంప్రదాయ కాంజీవరం చీర కట్టుకుని అరుదైన పచ్చలు, వజ్రాలు పొదిగిన లాంగ్ నెక్లెస్‌తో భారత దేశ వారసత్వానికి ప్రతీకగా నిలిచారు.

అందమైన చీరలో నీతా...

నీతా ధరించిన కాంజీవరం జరీ పట్టు చీర రంగు పౌడర్ పింక్. దీన్ని స్వచ్ఛమైన మల్బరీ సిల్క్, బంగారు జరీ దారాలతో రూపొందించారు. ఈ చీరను 68 ఏళ్ల మాస్టర్ వీవర్ ఆర్. వర్ధన్ తన స్వహస్తాలతో నేశారు. ఈ సంప్రదాయ కళారూపాన్ని నేయడం తన తండ్రి, తాతల నుంచి నేర్చుకున్నాననీ, ఇది తమ కుటుంబ వారసత్వ కళ అనీ ఆయన గర్వంగా చెబుతున్నారు. మెటాలిక్ సీక్విన్, జర్దోసి వర్క్‌లతో చీర బార్డర్‌ను అందంగా తీర్చిదిద్దారు. కొంగును వెండి జరీ కట్‌వర్క్‌తో అలంకరించారు. ఈ చీర మీద ఆఫ్ షోల్డర్ కోర్సెట్ బ్లౌజ్ ధరించారు నీతా. జరీ దారాలతో ఎంబ్రాయిడరీ వర్క్ చేయడంతో బ్లౌజ్‌కు రిచ్‌లుక్ వచ్చింది. చీర మీద చక్కగా మ్యాచ్ అయ్యింది. చీర కొంగుతోపాటు బ్లౌజ్‌ను ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా డిజైన్ చేశారు.

చక్కని నెక్లెస్

నీతా అంబానీ ధరించిన లాంగ్ నెక్లెస్... ఈవెంట్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇండోర్ మహారాణి సంయోగిత దేవి ధరించిన నెక్లెస్‌ను ప్రేరణగా తీసుకుని ఎంతో ఇష్టంగా దీన్ని చేయించుకున్నారు నీతా. ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ కాంతిలాల్ చోటాలాల్ దీన్ని రూపొందించారు. నెక్లెస్ మధ్యలో పెండెంట్‌గా 70 క్యారెట్ల కొలంబియన్ పచ్చను పొదిగారు. దీనికి ఇరువైపులా 40 క్యారెట్ల పియర్ వజ్రాలను డ్రాప్స్‌గా అమర్చారు. పెండెంట్ దిగువన నిజాం కాలం నాటి 40 క్యారెట్ల గుండ్రని వజ్రాన్ని అందంగా కూర్చారు. నెక్లెస్‌కు ఇరువైపులా మరో రెండు కుషన్ కట్ వజ్రాలను సొగసుగా జోడించారు. ఈ లాంగ్ నెక్లెస్‌లో వాడిన వజ్రాలు, పచ్చలను నీతా వ్యక్తిగతంగా సేకరించుకున్నవే కావడం విశేషం. చెవులకు వజ్రాల జుంకాలు, వేలికి పెద్ద వజ్రపుటుంగరం, చేతులకు వజ్రాల గాజులతో నీతా అపురూపంగా కనిపించారు. తేలికపాటి మేకప్, అలల హెయిర్ స్టయిల్ ఆమె అందాన్ని మరింత పెంచాయి.

ఇషా కూడా...



తల్లితోపాటు హాజరైన ఇషా అంబానీ... పింక్ బాల్ ఈవెంట్‌కు సహ అధ్యక్షత వహించారు. పింక్ థీమ్‌కు తగ్గట్టు అబు జాని సందీప్ ఖోస్లా ప్రత్యేకంగా రూపొందించిన హ్యాండ్ మేడ్ కోచర్ డ్రెస్‌లో మెరిసిపోయారు ఇషా. జర్దోసి వర్క్, గులాబీ రంగు ముత్యాలు, సీక్విన్స్, మెరిసే స్ఫటికాలతో డిజైన్ చేసిన స్కర్ట్‌కు జతగా బ్లష్ పింక్ చామోయిస్ శాటిన్ జాకెట్‌తో రాయల్‌గా కనిపించారు. ఈ డ్రెస్‌ను 30 మంది కళాకారులు 3670 గంటలు శ్రమించి తీర్చిదిద్దారు. చెవులకు పచ్చల జుంకాలు, మెడలో పచ్చల నెక్లెస్, వేలికి పచ్చలు పేర్చిన వజ్రపుటుంగరం, గోళ్లకు పింక్ కలర్ నెయిల్ రింగ్స్‌తో హుందాగా ఆకర్షణీయంగా నిలిచారు ఇషా.

హ్యామ్ కాదు.. పెద్ద స్కామ్

రోడ్ల అభివృద్ధి పేరుతో రూ.8వేల కోట్ల కుంభకోణం!

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపణ

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హ్యామ్ మోడల్‌లో రోడ్ల అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు రూ.8 వేల కోట్ల కుంభకోణం చేయబోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అది హ్యామ్ కాదని, పెద్ద స్కామ్ అని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ఫేజ్-1లో భారీ కుంభకోణం జరగబోతుందన్నారు. సీఆర్ఐఎఫ్ రేట్ల ప్రకారం రోడ్లు రూ.9వేల కోట్లలో పూర్తవుతాయని, అయితే రూ.8వేల కోట్లు పెంచి రూ.17వేల కోట్లు చేశారని ఆరోపించారు. ఈ టెండర్లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కుంభకోణంపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయించాలని ఆయన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కోరారు. ఒక టెండర్ కోసం ఇద్దరు రాష్ట్ర మంత్రులు కొట్టుకొని ముఖ్యమంత్రి దగ్గర సెటిల్మెంట్ చేసుకున్నారని, మద్యం సీసాల లేబుళ్ల టెండర్ విషయంలో మంత్రి చెప్పినట్టు వినలేదని ఒక అధికారిని బదిలీ చేశారని ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

జూబ్లీహిల్స్‌నుంచే బీఆర్ఎస్ జైత్ర యాత్ర

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలకు చెక్‌పెట్టాలి.. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్కసీటూ రాలేదు

- వాళ్లు దోచుకుంటారనే ప్రజలు ఓట్లు వేయలేదు
- బీఆర్ఎస్ హయాంలోని అభివృద్ధిని వివరించండి
- గ్రేటర్ హైదరాబాద్ ప్రజా ప్రతినిధులతో కేటీఆర్



హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మోసాలకు ఈ ఉప ఎన్నికల్లో చెక్ పెట్టాలన్నారు. తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ఆయన శనివారం సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచార వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ దొంగలు దోచుకుంటారనే.. గత ఎన్నికల్లో వారికి హైదరాబాద్ ప్రజలు ఓట్లు వేయలేదని, అందుకే హైదరాబాద్‌లో వారికి ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కలేదని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాలేదని, పేదల ఆశలన్నీ అడియాశలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కష్టాలు తగ్గాయని కేటీఆర్ గుర్తుచేశారు. 20 వేల లీటర్ల వరకు ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5కే భోజనం, పింఛన్లు, రంజాన్ తోఫాతో పాటు అనేక పథకాలు అమలు చేశామని, ప్రాపర్టీ ట్యాక్స్‌ను కూడా తీసేశామని చెప్పారు. జీహెచ్ఎంసీలో, హైదరాబాద్‌లో ప్రతి ఎన్నికలోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేశారని కేటీఆర్ వివరించారు. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బకాయిలతో ముంచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులు, రైతులు, మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. "అర చేతిలో స్వర్గం చూపిస్తే ఊళ్లలో కొందరు మోసపోయారు. అందుకే గ్రామాల నుంచి రైతులు, ప్రజలు జూబ్లీహిల్స్‌కు వచ్చి ప్రచారం చేస్తామని చెబుతున్నారు" అని ఆయన అన్నారు. ఏదైనా అడిగితే ఫ్రీ బస్సు ఇచ్చాం కదా అని చెబుతున్నారని, ఆడవాళ్లకు ఫ్రీ ఇచ్చి పురుషులకు డబుల్ రేటు పెట్టారని ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు, దళితులకు కాంట్రాక్టుల్లో వాటా ఇస్తామన్నారని కానీ అమలు మాత్రం శూన్యమని చెప్పారు. రూ.4 వేల కోట్ల బడ్జెట్ పెడతానని ముస్లింలను మోసం చేశారని, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే చిన్న షాక్ ఇవ్వాల్సిందేనన్నారు. తెలంగాణలోని గరీబోళ్లు, కార్మికులు, రైతులు అందరూ జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారని, జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. 11న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఆయన కోరారు. "మీ ఓటు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని కాపాడుకుందాం" అని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ అభివృద్ధికి గత ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, మోసాలను గుర్తు చేయాలని కేటీఆర్ సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలిస్తే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

కేబినెట్‌ను దండుపాళ్యంగా అభివర్ణిస్తారా..?

- హరీశ్‌రావు ఇలా మాట్లాడటం సరికాదు
- అభివృద్ధిపై చర్చకు సిద్ధం: మంత్రి అడ్లూరి

సిద్దిపేట అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కేంద్రంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య శనివారం సవాళ్ల పర్వం కొనసాగింది. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరాలయానికి వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. క్యాబినెట్ సమావేశంలో ఎలాంటి వ్యక్తిగత అంశాలు ప్రస్తావించనప్పటికీ, మంత్రివర్గాన్ని, ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్‌రావు దండుపాళ్యంగా అభివర్ణించడం బాధాకరమని, రాజకీయ చరిత్ర ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం సరికాదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ 20 నెలల పాలనలో చేసిన అభివృద్ధి, పథకాల అమలుపై హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు.

దండుపాళ్యం ముఠా నేత రేవంత్‌రెడ్డి


- ఈ నెల 27న చర్చకు సిద్ధం:కొప్పుల

సిద్దిపేట అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముమ్మాటికి కాంగ్రెస్ వాళ్లది దండుపాళ్యం ముఠానే అని, అందిన కాడికి దోచుకునుడు, అందరు కలిసి పంచుకునుడే వాళ్ల పని అని, ఆ ముఠా నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వ్యాఖ్యానించారు. సిద్దిపేటలోని శ్రీ వెంకటేశ్వరాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారు మాట్లాడారు. సిద్దిపేటకు వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్.. హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యల పట్ల మండిపడ్డారు. మంత్రి అడ్లూరి ఇక్కడకు వచ్చి నిజాలు చెబుతున్నానంటూ అబద్ధాలు మాట్లాడారని, వాటిని తేటతెల్లం చేసేందుకు తాము ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. సవాల్ విసిరిన మంత్రి అడ్లూరికి ప్రతి సవాల్ విసురుతున్నామని, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద చర్చకు 27న ఉదయం 11 గంటలకు తాము వస్తామని చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

జటాధరుడికి జో లాలి



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా దర్శకద్వయం వెంకట్ కల్యాణ్, అభి షేక్ జైస్వాల్ తెరకెక్కించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇటీవలె విడుదలైన టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా మేకర్స్ 'జో లాలి జో...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శ్రీమాన్ కీర్తి సాహిత్యానికి రాజీవ్ రాజ్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. పావని వాసా, రాజీవ్ రాజ్ మైమరిపించేలా ఆలపించారు.

శరవేగంగా చిత్రీకరణ



వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ ఓ హారర్ కామెడీ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. 'వీటీ15' అనేది వర్కింగ్ టైటిల్. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. వరుణ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్, ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'వరుణ్ కెరీర్‌లోనే ఈ సినిమా ప్రత్యేకంగా ఉండబోతోంది. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్- తమన్ కాంబినేషన్‌లో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికర అప్డేట్స్ త్వరలో ఇవ్వబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు.



రష్మికకు అవార్డు ఖాయం

అల్లు అరవింద్

'ఈ 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం కథను రాహుల్ నాలుగేళ్ల క్రితం చెప్పాడు. 'ఆహా'కు వెబ్ సిరీస్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నాడు. కానీ, ఇలాంటి మంచి కథతో సినిమా చేస్తేనే బాగుంటుందని అనిపించింది. ఈ కథలో హీరోయిన్ క్యారెక్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంటుంది. అలాంటి పాత్రకు రష్మిక మాత్రమే న్యాయం చేయగలదు అని అనిపించింది. తను నాకు కూతురు లాంటిది. ఈ సినిమాలో నటనకు గాను రష్మికకు ఉత్తమ నటి అవార్డు రావడం ఖాయం' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. రష్మిక మందన్న లీడ్ రోల్‌లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. దీక్షిత్ శెట్టి కథానాయకుడు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో ట్రైలర్‌ని విడుదల చేశారు. రష్మిక మాట్లాడుతూ 'ఈ చిత్రం కథ విన్నప్పుడు ఇప్పటివరకూ ఇలాంటి ప్రేమ కథని మనం చూడలేదనిపించింది. మనందరి జీవితాల్లో ఇలాంటివి జరుగుతాయి కదా అని అనిపించింది. ఇందులో భూమా అనే పాత్రలో నటించాను. నా కెరీర్‌లో సరైన సమయంలో సరైన ఎంపిక ఈ ప్రాజెక్టు' అని అన్నారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నేను విద్యార్థిగా హాస్టల్‌లో ఉండే రోజుల్లో అనుకున్న కథ ఇది. ట్రైలర్‌లో చూపించినట్లే సినిమా ఆద్యంతం మనసును కదిలించే భావోద్వేగాలతో ఉంటుంది. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'రష్మిక లేకుంటే 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమానే లేదు. దీక్షిత్ మాకు దొరికిన గొప్ప నటుడు. ఈ చిత్రం తర్వాత ఆయన టాలీవుడ్‌లో మరో పదేళ్లు వరుసగా సినిమాలు చేస్తారు' అని అన్నారు.

బాలీవుడ్ హాస్యనటుడు సతీశ్ షా కన్నుమూత



బాలీవుడ్ వెండితెరపై హాస్యనటుడిగా తనదైన ముద్ర వేసిన సతీశ్ షా(74) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవలే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అయినా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు సతీశ్ రవిలాల్ షా. 1951లో ముంబైలో జన్మించారు. పుణేలోని ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో నటనలో శిక్షణ తీసుకున్నారు. హిందీ సినిమా చరిత్రలో అత్యుత్తమ హాస్య చిత్రాల్లో ఒకటిగా భావించే 'జానే భీ దో యారో' చిత్రంలో అవినీతిపరుడైన మున్సిపల్ కమీషనర్ డి మెల్లో పాత్రలో సతీశ్ నటన చిరస్మరణీయంగా నిలిచింది. అలాగే బాలీవుడ్ బ్లాక్‌బస్టర్స్ 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, హమ్ ఆప్ కె హై కౌన్, మై హూనా, కల్ హో నా హో' లాంటి చిత్రాల్లో ఆయన సహాయ పాత్రల్లో అలరించారు. టీవీ రంగంలో సతీశ్ షా ప్రతిభను నిరూపించిన తొలి కార్యక్రమం 'యే జో హై జిందగీ'. ఈ హాస్య ధారావాహికలో 55 ఎపిసోడ్లలో 55 విభిన్న పాత్రలను పోషించి అరుదైన ఘనతను షా సాధించారు. 'సారాభాయ్ వర్సెస్ సారాభాయ్' షోలో అత్తాకోడళ్ల మధ్య తగవులు పెట్టే ఇంద్రవదన్ సారాభాయ్ పాత్రతో ఆయన బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు. ఐదు దశాబ్దాల పాటు సాగిన ఆయన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో 200కు పైగా సినిమాలు, పలు టీవీ సీరియల్స్‌లో నటించి ప్రేక్షకులను అలరించారు. 1982లో ఆయన ఫ్యాషన్ డిజైనర్ మధు షాను వివాహం చేసుకున్నారు.

గుర్తుండిపోయే విజయం

ప్రదీప్ రంగనాథన్

"డ్యూడ్' సినిమా వంద కోట్ల వసూళ్లను అధిగమించింది. ప్రేక్షకుల ఆదరణ లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. గుర్తుండిపోయేలా అద్భుత విజయాన్ని అందించిన ఆడియన్స్‌కు కృతజ్ఞతలు. హౌస్‌ఫుల్ కలెక్షన్లతో సినిమా దూసుకుపోతోంది' అని అన్నారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా, మమిత బైజు కథానాయికగా కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై వై. రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై ప్రేక్షకాదరణతో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. చిత్ర దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ 'నా తొలి చిత్రం మైత్రీ బేనర్‌లో భారీ విజయాన్ని అందుకొన్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇంత గొప్పగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత వై.రవిశంకర్ మాట్లాడుతూ 'మా సినిమాకు తెలుగుతో పాటు తమిళంలోనూ అద్భుతమైన ఆదరణ దక్కుతోంది. మా సంస్థలో పరిచయమైన భరత్ కమ్మ, నితీష్ రానా, బుచ్చిబాబు సానా పెద్ద దర్శకులుగా ఎదిగారు. ఇప్పుడు అదే కేటగిరీలో కీర్తీశ్వరన్ చేరినందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.



భావోద్వేగ ప్రేమ గాథ



మిన్హాజ్ రుమి, యష్నా ముత్తులూరి ప్రధాన పాత్రధారులుగా అఖిల్ రాజ్ తెరకెక్కిస్తోన్న ప్రేమ కథా చిత్రం 'దేవ్-పారు'. ఏకే ప్రొడక్షన్స్ బేనర్‌పై అఖిల్ రాజు దర్శకత్వంలో లోడీ ఫాహద్ అలీఖాన్ నిర్మిస్తున్నారు. శనివారం నిర్వహించిన కారక్రమంలో 'నా ప్రాణమంతా..' అంటూ సాగే ప్రేమ గీతాన్ని దర్శకుడు కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ గీతానికి ఓషో వెంకట్ స్వరాలందించగా, కాలభైరవ ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది ఒక భావోద్వేగ ప్రేమ గాథ. యువతను బాగా ఆకట్టుకుంటుంది. మిన్హాజ్ అద్భుతంగా నటించాడు' అని చెప్పారు. మిన్హాజ్ రోమి మాట్లాడుతూ ' ఈ సినిమాలో ప్రేమ కథతో పాటు భావోద్వేగ సన్నివేశాలు, హాస్యం, వినోదం వంటి అన్ని హంగులూ ఉన్నాయి' అని అన్నారు. నిర్మాత అలీఖాన్ మాట్లాడుతూ 'కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే తపన ఈ చిత్రంతో నెరవేరింది' అని పేర్కొన్నారు.



నవంబరు 1 నుంచి బ్యాంకుల్లో వచ్చే మార్పులేమిటంటే..

బ్యాంకుల్లో ఖాతాదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు వచ్చే నెల 1వ తేదీ నుంచి చెక్ పడనుంది. ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాదారుడికి జరగరానిది ఏమైనా జరిగితే.. వారసులు ఆ ఖాతా సెటిల్ చేసుకోవడం పెద్ద సమస్యగా ఉండేది. లాకర్ల వస్తువుల సెటిల్‌మెంట్‌లోనూ ఇదే సమస్య. అయితే నవంబరు 1 నుంచి ఈ కష్టాలకు తెరపడనుంది. వీటి పరిష్కారానికి వీలు కల్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి సంబంధించిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం, 2025'ను పార్లమెంట్ ఇప్పటికే ఆమోదించింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఈ ఏడాది నవంబరు 1 నుంచి బ్యాంకింగ్ చట్టాల్లో కింది మార్పులు చోటు చేసుకోనున్నాయి. అవేమిటంటే?

నలుగురి వరకు నామినీలు: బ్యాంకు డిపాజిటర్లు ఇక నలుగురి వరకు నామినీలను నామినేట్ చేయవచ్చు. ఈ నలుగురిని ఒకేసారి లేదా ఒకరి తర్వాత ఒకరిని నామినేట్ చేయవచ్చు. ఈ మార్పు వల్ల డిపాజిట్ ఖాతాదారుడికి జరగరాని అనర్థమేదైనా జరిగితే, డిపాజిట్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ తేలికవుతుంది.

లాకర్లలోని వస్తువులకు నామినేషన్: లాకర్లు, సేఫ్ కస్టడీలోని వస్తువుల విషయంలో నామినేషన్‌కు అవకాశం ఉంటుంది. అంతేకాదు వరుస క్రమం ప్రకారం మాత్రమే నామినీలకు లాకర్లను నిర్వహించే అధికారం ఉంటుంది.

వాటాల విభజన: కొత్త చట్టంతో ఖాతాదారు తన తదనంతరం తన డిపాజిట్ లేదా లాకర్‌లోని వస్తువుల్లో ఏ నామినీకి ఎంత మొత్తం లేదా ఎంత శాతం చెల్లించాలనే విషయాన్ని ముందుగానే బ్యాంకుకు తెలియజేయవచ్చు. ఈ సదుపాయం ఒకేసారి నలుగురు నామినీలను నామినేట్ చేసే కేసుల్లో మాత్రమే వర్తిస్తుంది.

ఎవరెవరికి: బ్యాంకుల్లో డిపాజిట్లు, లాకర్లు, సేఫ్ డిపాజిట్ వాల్ట్‌లు ఉన్న వ్యక్తిగత/జాయింట్ లేదా సోల్ ప్రొప్రైటరీ ఖాతాదారులు అందరూ.. ఇక తమకు నచ్చిన నలుగురిని తమ నామినీలుగా నామినేట్ చేయవచ్చు. ఒకేసారి లేదా వరుస క్రమంలో తమ ప్రాధాన్యత ప్రకారం నామినీలను నామినేట్ చేయవచ్చు. అయితే ఎవరో ఒక ఖాతాదారుడికి ప్రతినిధిగా ఉన్న వ్యక్తులు మాత్రం ఎవరినీ నామినేట్ చేసేందుకు అవకాశం లేదు.

తేలిగ్గా క్లెయిమ్స్ పరిష్కారం: కొత్త నిబంధనలతో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా జరగనుంది. దీంతో క్లెయిమ్‌ల పరిష్కారంలో ఆలస్యం, వివాదాలకు కూడా అవకాశం ఉండదు.

ఒకే దరఖాస్తు: కొత్త చట్టం ప్రకారం నామినీల నామినేషన్ల కోసం ఇక బ్యాంకులన్నీ ఒకే ప్రామాణిక అప్లికేషన్‌ను అనుసరిస్తాయి. దీనివల్ల క్లెయిమ్స్ సెటిల్‌మెంట్, డాక్యుమెంటేషన్ కూడా సులభమవుతుంది.

జాయింట్ ఖాతాల్లో పారదర్శకత: జాయింట్ ఖాతాదారులు పరస్పర అంగీకారంతో నామినీల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయవచ్చు. దీని వల్ల ఖాతాదారుడు చనిపోయినప్పుడు క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ మరింత తేలికవుతుంది.

మరింత రక్షణ: నామినీల ప్రక్రియ సులభతరం కావడంతో డిపాజిట్లకు, లాకర్లకు చట్టపరంగా మరింత రక్షణ ఏర్పడుతుంది. దీనివల్ల ఖాతాదారుడు మరణించినప్పుడు.. అతని నామినీలకు ఖాతాలోని సొమ్ము పంపిణీ త్వరగా, సులభంగా పూర్తవుతుంది.

క్రమబద్ధీకరణ: మారిన నిబంధనలతో వరుస క్రమంలో ఉన్న నామినీలు మాత్రమే, లాకర్లలోని వస్తువులు, సేఫ్ డిపాజిట్లను ఖాతాదారుడు సూచించిన నిష్పత్తిలో అందుకోగలుగుతారు.

రికార్డుల నిర్వహణ: ఈ మార్పులతో బ్యాంకులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ పద్ధతిలో నామినీల రికార్డులు అప్‌డేట్ చేయాలి. దీనివల్ల మానవ తప్పిదాలకు తావు ఉండదు. బ్యాంకుల మీదా జవాబుదారీతనం పెరుగుతుంది.

ఫాక్స్‌కాన్ ప్లాంట్‌లో ఉత్పత్తి నెలకు 2 లక్షల యూనిట్లకు పెంపు | మరో రూ.1,800 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్.. యాపిల్ ఎయిర్‌పాడ్స్ తయారీ హబ్

న్యూఢిల్లీ: యాపిల్ ఎయిర్‌పాడ్స్ తయారీకి భాగ్యనగరం హబ్‌గా అవతరించబోతోంది. యాపిల్ సంస్థ కోసం ఎయిర్‌పాడ్స్ తయారు చేస్తున్న తైవాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్‌కు చెందిన హైదరాబాద్ యూనిట్ 'ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ' (ఎఫ్ఐటీ) ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఉత్పత్తి ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని కొంగరకలాన్ ప్లాంట్‌లో కంపెనీ ప్రస్తుతం నెలకు 1,00,000 యూనిట్లకు పైగా ఎయిర్‌పాడ్స్‌ను తయారు చేస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా యాపిల్ ఎయిర్‌పాడ్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా హైదరాబాద్‌లోని యూనిట్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు 2,00,000 యూనిట్లను పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం వచ్చే 6-8 నెలల్లో ప్రొడక్షన్ లైన్లను విస్తరించడంతో పాటు మరో 3,000 మందిని నియమించుకోనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్లాంట్‌లో 2,000 మంది పనిచేస్తున్నారు.

చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగంగా: ఫాక్స్‌కాన్ తన తయారీ కార్యకలాపాలను చైనాను దాటి విస్తరించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగంగా భారత్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించటంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని ఎయిర్‌పాడ్స్ తయారీ ప్లాంట్‌ను భారీగా విస్తరిస్తోంది. ఇందుకనుగుణంగానే తైవాన్‌లోని ప్లాంట్ల నుంచి అవసరమైన తయారీ యంత్రాలను ఇక్కడి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గత నెలలో యాపిల్ మార్కెట్లోకి విడుదల చేసిన ఎయిర్‌పాడ్స్ 4, ఎయిర్‌పాడ్స్ ప్రో 3 మోడళ్లను ఉత్పత్తి చేసేందుకు ఈ యంత్రాలను వినియోగించనున్నట్లు సమాచారం. కాగా ఫాక్స్‌కాన్ ఇప్పటికే హైదరాబాద్ యూనిట్ కోసం రూ.3,000 కోట్ల పెట్టుబడులు పెట్టింది. తాజాగా చేపట్టనున్న విస్తరణ కోసం మరో రూ.1,800 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిసింది.

సీసీఎల్ నుంచి ఎన్‌సీసీకి రూ.6,829 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎన్‌సీసీ లిమిటెడ్.. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) అనుబంధ సంస్థ సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్) నుంచి రూ.6,828.94 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా జార్ఖండ్‌లోని చంద్రగుప్త ప్రాంతంలో సీసీఎల్‌కు చెందిన ఆమ్రపాలి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌లో బొగ్గు వెలికితీత, తరలింపు సహా వ్యాగన్ లోడింగ్ వంటి పనులను చేపట్టాల్సి ఉంటుందని ఎన్‌సీసీ తెలిపింది. ఈ కాంట్రాక్ట్ కాలపరిమితి ఏడు సంవత్సరాలని పేర్కొంది. కాంట్రాక్టులో భాగంగా హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ (హెచ్ఈఎంఎం)ను వినియోగించాల్సి ఉంటుందని ఎన్‌సీసీ వెల్లడించింది.

కోటక్ బ్యాంక్ లాభం రూ.3,253 కోట్లు

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) కోటక్ మహీంద్రా బ్యాంక్.. స్టాండ్అలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 3 శాతం తగ్గి రూ.3,253 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,344 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.16,239 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.13,649 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 4.54 శాతానికి తగ్గింది. కాగా బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 1.39 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.32 శాతానికి తగ్గాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	575
వరంగల్	557	గోదావరి	565
చిత్తూరు	583	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	107
కర్నూలు	117	నెల్లూరు	112
విశాఖపట్నం	119	అనంతపురం	112
గోదావరి	123		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,620 ▲	1,15,150 ▲	1,70,000 ▼
విజయవాడ	1,27,000 ▲	1,21,000 ▲	1,53,500 ▲
విశాఖపట్నం	1,26,980 ▲	1,15,000 ▲	1,70,000 ▼
రాజమండ్రి	1,25,620 ▼	1,15,150 ▼	1,53,000 ▼
ప్రొద్దుటూరు	1,23,000 ▼	1,13,160 ▼	1,53,000 ▼
ముంబై	1,21,518 ▼	1,11,310 ▼	1,47,033 ▼

లే అవుట్స్‌లోని స్థలాలు అమ్ముతుంటే జీఎస్‌టీ చెల్లించాలా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తొలినాళ్లతో పోల్చుకుంటే ఈ ఎనిమిది సంవత్సరాలలో వివిధ రంగాలకు సంబంధించి చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు రియల్ ఎస్టేట్ రంగాన్ని తీసుకుంటే మొదట్లో నివాసిత (రెసిడెన్షియల్) అపార్ట్‌మెంట్ల అమ్మకానికి 12 శాతం పన్ను ఉండేది. 2019 నుంచి దీన్ని 5 శాతానికి తగ్గించటం జరిగింది. అలాగే మొదట్లో ఉన్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) సదుపాయాన్ని తొలగించారు. అయితే వాణిజ్య పరిధిలోకి వచ్చే కమర్షియల్ అపార్ట్‌మెంట్స్‌కు మాత్రం పన్ను శాతంలో గానీ, ఐటీసీ విషయంలో కానీ ఎలాంటి మార్పులు చేయలేదు. మొత్తానికి, నిర్మాణ రంగానికి సంబంధించిన జీఎస్‌టీలో కొంత స్పష్టత ఉన్నప్పటికీ లే అవుట్ వేసి ప్లాట్లను విక్రయించటం.. అంటే స్థలాల అమ్మకం విషయంలో జీఎస్‌టీకి సంబంధించి కొంత గందరగోళం ఉంది. దీనికి ముఖ్య కారణం.. ఈ రంగం ఇంకా అసంఘటితంగానే ఉండటం, అలాగే నిర్మాణ రంగంతో పోలిస్తే వీరికి ఆడిటర్లు, అసోసియేషన్స్ గానీ ఉండవు. అంతేకాకుండా సరైన సలహా ఇచ్చే వారు సాధారణంగా ఉండరు. కాబట్టి లే అవుట్స్‌లోని ప్లాట్లు విక్రయించే టప్పుడు జీఎస్‌టీ చెల్లించాలా? వద్దా? అనే విషయంలో ఈ రంగంలోని వారికి కొంత అవగాహనా లోపం ఉంది.

సర్వీస్ కిందకు వచ్చేవి ఏమిటంటే..

వివరంగా చెప్పాలంటే, జీఎస్‌టీ చట్టంలోని నిర్వచనాల ప్రకారం.. అపార్ట్‌మెంట్లకు సంబంధించి ఒక ప్రాజెక్ట్ మొదలు పెట్టినప్పటి నుంచి ప్రాజెక్ట్ పూర్తయి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే వరకు జరిపే అమ్మకాలను 'సర్వీస్' కింద భావిస్తారు. కాబట్టి వీటి మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే 'రెరా' చట్టం ప్రకారం ప్రమోటర్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అనే నిర్వచనం కేవలం నిర్మాణ రంగానికే కాకుండా ఖాళీ లేదా వ్యవసాయ భూములను ప్లాట్లుగా అంటే 'లే అవుట్'గా అభివృద్ధి చేయటానికి కూడా వర్తిస్తుంది. దీంతో ఒక వ్యక్తి కొంత స్థలాన్ని లే అవుట్‌గా డెవలప్ చేసి అందులోని స్థలాలను అమ్మటం అనేది జీఎస్‌టీ వర్తించే అంశం అని ఒక వాదన. దీనికి కారణం ఏమిటంటే, ఒక లే అవుట్‌లో డెవలప్‌మెంట్ జరిగే దశలో ప్లాట్లు అమ్మటం అనేది కంప్లీషన్ సర్టిఫికెట్ రాక ముందు అపార్ట్‌మెంట్లను అమ్మటంతో సమానం. ఎందుకంటే, ఇందులో స్థలం మాత్రమే కాకుండా రోడ్లు, కాలువలు, పార్క్ మొదలైన వాటితో కూడిన డెవలప్‌మెంట్ అనే అంశం ముడిపడి ఉంది. ప్రమోటర్ కేవల స్థలానికే కాకుండా డెవలప్‌మెంట్‌కు కలిపి డబ్బులు తీసుకుంటాడు. దీంతో ఇది కూడా సర్వీస్ కింద భావిస్తూ తగిన జీఎస్‌టీ చెల్లించాలనేది ఒక వాదన. కానీ, జీఎస్‌టీ చట్టం ప్రకారం పొలాలు, స్థలాలు అంటే భూమి అమ్మకం అనేది జీఎస్‌టీలోకి వచ్చే అంశం కాదు. కాబట్టి ఇదే మినహాయింపు లే అవుట్ ప్లాట్లకు కూడా వర్తిస్తుందని ఇంకొక ఆలోచన.

ప్రభుత్వ మార్గదర్శకాలు

ఈ గందరగోళాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ రంగానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం, ఏదేనీ ఒక లే అవుట్‌లో అమ్మే స్థలాలకు ఎటువంటి జీఎస్‌టీ వర్తించదు. అంటే లే అవుట్ డెవలప్‌మెంట్ జరిగే దశలో కావచ్చు లేదా పూర్తయిన తర్వాత కావచ్చు.. ఎప్పుడు అమ్మినా ఆ ప్లాట్ల మీద ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. ఇదే సమయంలో మరొక వివరణ ఇవ్వటం జరిగింది.

లే అవుట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే అంటే భూమి చదును చేయటం, అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణం లేదా పార్క్ ఏర్పాటు మొదలైన పనులను ఎవరికైనా కాంట్రాక్ట్ ఇస్తే.. సదరు కాంట్రాక్టర్ ఆ మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అంతే కానీ, ప్లాట్ కొనుగోలుదారుడు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. కాబట్టి ప్రమోటర్, కొనుగోలుదారులు, కాంట్రాక్టర్లు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవటం అత్యంత ఆవశ్యకం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

మళ్లీ వస్తామో.. లేదో?

"ఆసీస్‌లో క్రికెట్ ఆడడం నాకిష్టం. 2008లో తొలిసారిగా ఇక్కడికి వచ్చా. అప్పుడు చాలా సరదాగా గడిచింది. ఇక మళ్లీ క్రికెటర్లుగా మేమిద్దరం (రోహిత్, విరాట్) ఇక్కడికి వస్తామో? రామో? తెలియదు. ఆసీస్‌లో ఇంత చక్కటి ఆదరణ లభించడం అద్భుతంగా అనిపిస్తుంది. మమ్మల్ని ఆదరించిన ఆసీస్ ప్రేక్షకులకు కృతజ్ఞతలు." - రోహిత్ శర్మ

- వన్డే, టీ20ల్లో కలిపి అత్యధిక పరుగులు (18,437) చేసిన బ్యాటర్‌గా విరాట్. సచిన్ (18,436)ను అధిగమించాడు.
- వన్డేల్లో ఎక్కువ 150+ భాగస్వామ్యాలు (12) నమోదు చేసిన జోడీగా సచిన్-గంగూలీతో సమంగా నిలిచిన రోహిత్-విరాట్.
- ఆసీస్‌లో ఎక్కువ సెంచరీలు (6) చేసిన పర్యాటక బ్యాటర్‌గా రోహిత్.
- అంతర్జాతీయ క్రికెట్‌లోని ప్రతీ ఫార్మాట్‌లోనూ కనీసం 5 శతకాలు బాదిన ఏకైక ప్లేయర్‌గా రోహిత్. టెస్టులు (12), వన్డేలు (33), టీ20లు (5) కలిపి ఓవరాల్‌గా అతడికిది 50వ సెంచరీ.
- అతి పెద్ద వయస్సు (38)లో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ గెలుచుకున్న భారత ప్లేయర్‌గా రోహిత్. ధోనీ (37)ని అధిగమించాడు.
- వన్డేల్లో ఎక్కువ పరుగులు (14,255) సాధించిన రెండో బ్యాటర్‌గా విరాట్. సచిన్ (18,426) ముందున్నాడు.



రోహిత్ (121 నాటౌట్) | విరాట్ (74 నాటౌట్)

ఇప్పటికే సిరీస్ పోయిన దశలో మూడో వన్డే నామమాత్రపు మ్యాచే.. అయితేనేం.. ప్రేక్షకులకదేమీ పట్టలేదు. ఆసీస్ గడ్డపై విరాట్ కోహ్లీ, రోహిత్ చివరి ఆట చూసేందుకు ప్రఖ్యాత సిడ్నీ క్రికెట్ మైదానం కిటకిటలాడిపోయింది. ఇంతటి అభిమానాన్ని ఆ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు కూడా ఏమాత్రం వమ్ము చేయలేదు. ఆసీస్ బౌలర్లపై ఆధిపత్యంతో రోహిత్ తన వింటేజ్ ఆటతీరును ప్రదర్శించగా, ఇక రెండు వరుస డకౌట్ల నుంచి తేరుకున్న విరాట్ క్లాస్ ఇన్నింగ్స్‌తో మైమరిపించాడు. అజేయంగా నిలిచిన ఈ ఇద్దరు భారత్‌ను వైట్‌వాష్ ముప్పు నుంచి తప్పించడంతో పాటు విమర్శకుల నోళ్లు మూయించారు.

ఇద్దరూ ఇరగదీశారు

- సెంచరీ బాదిన రోహిత్
- ఫామ్ చాటుకున్న విరాట్
- ఆఖరి వన్డేలో ఆసీస్‌పై భారత్ ఘనవిజయం

సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియాకు ఓదార్పు విజయం దక్కింది. వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ (125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్లతో 121 నాటౌట్) సెంచరీతో, విరాట్ కోహ్లీ (81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) హాఫ్ సెంచరీతో బ్యాట్లు ఝుళిపించడంతో మూడో వన్డేలో 9 వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. అయితే సిరీస్‌ను 2-1తో ఆసీస్ దక్కించుకున్నప్పటికీ.. ఈ ఫార్మాట్‌లో తొలిసారిగా భారత్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనుకున్న కంగారూల కోరిక మాత్రం నెరవేరలేదు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. రెన్షా (56), కెప్టెన్ మిచెల్ మార్ష్ (41), షార్ట్ (30) రాణించారు. హర్షిత్ రాణాకు 4, సుందర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 237 పరుగులు చేసి నెగ్గింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా రోహిత్ నిలిచాడు.



అదిరే ఆట: 237 పరుగుల ఛేదనలో ఓపెనర్ రోహిత్, విరాట్ కళ్లుచెదిరే ఆటతీరుతో ప్రేక్షకులను అలరించారు. వీరి ప్రతీ పరుగును వారంతా ఆస్వాదించారు. మరో ఓపెనర్ గిల్ (24)తో రోహిత్ తొలి వికెట్‌కు 69 రన్స్ అందించాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన పేసర్ హాజెల్‌వుడ్ 11వ ఓవర్‌లో గిల్‌ను అవుట్ చేశాడు. ఆ తర్వాత ఆసీస్ బౌలర్లకు రో-కో చుక్కలు చూపించారు. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య క్రీజులోకి వచ్చిన విరాట్ తొలి సింగిల్ తీయగానే స్టేడియం మార్మోగిపోయింది. రెండు వరుస డకౌట్ల తర్వాత వచ్చిన పరుగు కావడంతో కోహ్లీ కూడా సరదాగా పిడికిలి బిగించి చూపాడు. జంపా, హాజెల్‌వుడ్ ఓవర్లలో ఒక్కో ఫోర్‌తో విరాట్ లయ అందుకున్నాడు. రోహిత్ సైతం జంపా ఓవర్‌లో సిక్సర్‌తో గేరు మార్చాడు. 56 బంతుల్లో విరాట్ హాఫ్ సెంచరీ పూర్తి చేయగా, 105 బంతుల్లో రోహిత్ కెరీర్‌లో 33వ శతకాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత షార్ట్ ఓవర్‌లో రోహిత్ 6,4తో.. 39వ ఓవర్‌లో విరాట్ ఫోర్‌తో మరో 69 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.



హర్షిత్ (4/39)

చెక్ పెట్టిన రాణా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌ను పేసర్ హర్షిత్ చక్కటి పేస్, బౌన్స్‌తో ఇబ్బందిపెట్టాడు. అలాగే ఫీల్డింగ్‌లో విరాట్, శ్రేయాస్ కళ్లు చెదిరే క్యాచ్‌లతో ఆకట్టుకున్నారు. ఓపెనర్లు మార్ష్, హెడ్ (29) వేగంగా ఆడి తొలి వికెట్‌కు 61 రన్స్ జోడించారు. ఆ తర్వాత బౌలర్ల ధాటికి ఆసీస్ నుంచి భారీ భాగస్వామ్యాలు ఏర్పడలేదు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు అక్షర్, సుందర్ కట్టడి చేయగా.. రాణా మిడిలార్డర్‌ను కుదురుకోనీయలేదు. దీంతో ఆసీస్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: మార్ష్ (బి) అక్షర్ 41, హెడ్ (సి) ప్రసిద్ధ్ (బి) సిరాజ్ 29, షార్ట్ (సి) విరాట్ (బి) సుందర్ 30, రెన్షా (ఎల్బీ) సుందర్ 56, క్యారీ (సి) శ్రేయాస్ (బి) హర్షిత్ 24, కూపర్ (సి) విరాట్ (బి) హర్షిత్ 23, ఓవెన్ (సి) రోహిత్ (బి) హర్షిత్ 1, స్టార్క్ (బి) కుల్దీప్ 2, ఎలిస్ (సి) రోహిత్ (బి) ప్రసిద్ధ్ 16, జంపా (నాటౌట్) 2, హాజెల్‌వుడ్ (బి) హర్షిత్ 0; ఎక్స్‌ట్రాలు: 12; **మొత్తం: 46.4 ఓవర్లలో 236 ఆలౌట్.** **వికెట్ల పతనం:** 1-61, 2-88, 3-124, 5-195, 6-198, 7-201, 8-223, 9-236, 10-236. **బౌలింగ్:** సిరాజ్ 5-1-24-1, హర్షిత్ 8.4-0-39-4, ప్రసిద్ధ్ 7-0-52-1, కుల్దీప్ 10-0-50-1, అక్షర్ 6-0-18-1, సుందర్ 10-0-44-2.

భారత్: రోహిత్ (నాటౌట్) 121, గిల్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 24, విరాట్ (నాటౌట్) 74, ఎక్స్‌ట్రాలు: 18; **మొత్తం: 38.3 ఓవర్లలో 237/1.** **వికెట్ పతనం:** 1-69. **బౌలింగ్:** స్టార్క్ 5-0-31-0, హాజెల్‌వుడ్ 6-1-23-1, ఎలిస్ 7.3-0-60-0, కూపర్ 5-0-36-0, జంపా 10-0-50-0, ఓవెన్ 1-0-2-0, షార్ట్ 4-0-29-0.

హన్సిక, సారికలకు రజతాలు

అండర్-23 ప్రపంచ రెజ్లింగ్

నోవి సాద్ (సెర్బియా): అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరిన భారత రెజ్లర్లు హన్సిక లాంబ (53 కిలోలు), సారిక మాలిక్ (59 కిలోలు) రజతాలతో సరిపెట్టుకున్నారు. పసిడి పోరులో హరున మొరికవ (జపాన్) చేతిలో హన్సిక, రుకా నటామి (జపాన్) చేతిలో సారిక ఓడారు.

రాహుల్ శతకం

హైదరాబాద్ 255/1

పుదుచ్చేరితో రంజీ

పుదుచ్చేరి: రాహుల్ సింగ్ (114 బ్యాటింగ్) శతకం, హిమతేజ (62 బ్యాటింగ్) అర్ధ శతకంతో చెలరేగడంతో పుదుచ్చేరి జట్టుతో శనివారం మొదలైన రంజీ గ్రూప్ 'డి' ఎలీట్ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట ముగిసే సరికి హైదరాబాద్ వికెట్ నష్టానికి 255 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. ఇక..ఆంధ్రతో విజయనగరంలో ప్రారంభమైన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో తొలిరోజు ఆట ఆఖరికి బరోడా తొలి ఇన్నింగ్స్‌లో 230/6 స్కోరు చేసింది.

సెమీఫైనల్లో ఎవరెవరంటే..

ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా (బుధవారం)
భారత్ x ఆస్ట్రేలియా (గురువారం)

మహిళల వన్డే వరల్డ్‌కప్



అలనా కింగ్ (7/18)

కింగ్ మ్యాజిక్

7 వికెట్లతో విజృంభణ
టాప్ లేపిన ఆసీస్
దక్షిణాఫ్రికా చిత్తు

ఇండోర్: డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా టాప్ లేపింది. వన్డే వరల్డ్ కప్ లీగ్ దశను అజేయంగా ముగించిన ఆసీస్ మొత్తం 13 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. స్పిన్నర్ అలనా కింగ్ (7/18) తిప్పేయడంతో.. శనివారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 7 వికెట్లతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. తొలుత దక్షిణాఫ్రికా 24 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ లారా వొల్వార్ట్ (31) టాప్ స్కోరర్. ఓపెనర్లు వొల్వార్ట్‌ను షుట్ అవుట్ చేయగా.. తన్జిమ్ బ్రిట్స్ (6)ను కిమ్ గార్త్ వెనక్కిపంపడంతో సఫారీల పతనం ఆరంభమైంది. వన్‌డౌన్ బ్యాటర్ సునె లుస్ (6) వికెట్‌తో వేటను మొదలెట్టిన కింగ్.. కాప్ (0), డెర్క్‌సెన్ (5), ట్రయాన్ (0), జెఫ్తా (29), క్లాస్ (4), డి క్లెర్క్ (14)ను అవుట్ చేసి సఫారీల వెన్నువిరిచింది. ఛేదనలో ఆసీస్ 16.5 ఓవర్లలో 98/3 స్కోరు చేసి నెగ్గింది. ఓపెనర్ జార్జియా వోల్ (38 నాటౌట్), బెత్ మూనీ (42) మూడో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలిపించారు.

నేటి మ్యాచ్‌లు — స్టార్ నెట్‌వర్క్‌లో

ఇంగ్లండ్ x న్యూజిలాండ్
వేదిక: విశాఖపట్నం (ఉ.11 నుంచి)

భారత్ x బంగ్లాదేశ్
వేదిక: నవీ ముంబై (మ.3 నుంచి)

ఆసీస్ మహిళా క్రికెటర్లకు లైంగిక వేధింపులు

ఇండోర్‌లో ఘటన
నిందితుడి అరెస్ట్

ఇండోర్: సాఫీగా సాగుతున్న మహిళల వన్డే వరల్డ్ కప్‌లో ఊహించని ఉదంతం చోటు చేసుకుంది. ఇద్దరు ఆస్ట్రేలియా క్రికెటర్లు లైంగిక వేధింపులకు గురి కావడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆ ఇద్దరు మహిళా క్రికెటర్లు తాము బస చేసిన రాడిసన్ బ్లూ హోటల్ నుంచి సమీపంలోని కేఫ్‌కు బయలు దేరారు. మోటార్ సైకిల్‌పై అనుసరిస్తూ వచ్చిన యువకుడొకరు ఖజ్రానా రోడ్డులోకి రాగానే క్రికెటర్లలో ఒకరిని అసభ్యకర రీతిలో తాకి పరారయ్యాడు. సంఘటనతో షాక్‌కు గురైన క్రికెటర్లు తమ భద్రతా అధికారి డానీ సిమోన్స్‌కు 'డిస్ట్రెస్ కాల్' చేశారు. అప్రమత్తమైన ఆ అధికారి స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. తక్షణమే అక్కడికి చేరుకున్న పోలీసులు తమ వాహనంలో క్రికెటర్లను హోటల్‌కు చేర్చారు. ఈ ఘటనపై స్థానిక ఎంఐజీ పోలీస్‌స్టేషన్‌లో సిమోన్స్ ఫిర్యాదు చేశారు. అనంతరం విచారణ జరిపిన పోలీసులు.. నిందితుడిని ఆజాద్ నగర్‌కు చెందిన 30 ఏళ్ల అఖీల్‌ఖాన్‌గా గుర్తించి అతడిని అరెస్ట్ చేసినట్టు ఇండోర్ నేర విభాగ అదనపు డీసీపీ రాజేశ్ దంతోదియన్ వెల్లడించారు. అతడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 74 (మహిళపై దాడి చేయడం), 78 (వెంబడించడం)పై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్టు తెలిపారు. ఘటనపై మధ్యప్రదేశ్ మంత్రి కైలాస్ విజయ్‌వర్గీయ స్పందించారు. ఇది భారత ప్రతిష్ఠను దెబ్బ తీస్తుందన్నారు.

బీసీసీఐ ఖండన: ఆస్ట్రేలియా క్రికెటర్లపై జరిగిన ఘటనను బీసీసీఐ తీవ్రంగా ఖండించింది. 'ఆతిథ్యానికి భారత్ పెట్టింది పేరు. ఇలాంటి ఘటనను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోం. మా భద్రతా చర్యలను సమీక్షించుకొని మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తాం' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నారు.

కంగారూలతోనే సెమీస్ ఎందుకంటే..

మహిళల ప్రపంచ కప్ సెమీఫైనల్లో భారత్ ప్రత్యర్థిగా ఆస్ట్రేలియా ఖరారైంది. శనివారం దక్షిణాఫ్రికాపై గెలిచి అగ్రస్థానంలో నిలిచిన ఆస్ట్రేలియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ప్రస్తుతం పట్టికలో ఆస్ట్రేలియా (13), దక్షిణాఫ్రికా (10), ఇంగ్లండ్ (9), భారత్ (6) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఈ జట్లన్నీ ఇప్పటికే సెమీస్ చేరాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లను శనివారం ఆడేశాయి. ఆదివారం (అక్టోబరు 26న) జరిగే లీగ్ చివరి మ్యాచుల్లో బంగ్లాదేశ్‌తో భారత్, న్యూజిలాండ్‌తో ఇంగ్లండ్ తలపడనున్నాయి. వీటిల్లో ఇంగ్లండ్ గెలిస్తే 11 పాయింట్లతో రెండో స్థానానికి చేరుతుంది. దక్షిణాఫ్రికా మూడో స్థానానికి పడిపోతుంది. ఒకవేళ బంగ్లాపై నెగ్గినా భారత్ ఖాతాలో 8 పాయింట్లే ఉంటాయి కాబట్టి హర్మన్‌సేన నాలుగో స్థానంలో ఎలాంటి మార్పుండదు. కాబట్టి, తొలి స్థానంలో ఉన్న ఆసీస్‌తో నాలుగో స్థానంలో ఉన్న భారత్ సెమీస్‌లో ఆడాల్సి ఉంటుంది.

కార్తీక్‌కు ఐటీఎఫ్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ 15కే టోర్నమెంట్ డబుల్స్ టైటిల్‌ను హైదరాబాద్ ఆటగాడు సాయికార్తీక్ రెడ్డి-థాంటబ్ సుఖ్ప్రమాన్ (థాయ్‌లాండ్) ద్వయం కైవసం చేసుకుంది. థాయ్‌లాండ్‌లో జరిగిన ఫైనల్లో కార్తీక్ జోడీ 6-3, 4-6, 10-7తో లియో-షింజి (జపాన్) జంటపై గెలిచింది.

అమెరికా సరిహద్దుల్లోకి వెళ్లినా.. దాటినా ఫేస్ రికగ్నిషన్‌తో ఫొటో.. బయోమెట్రిక్

» అమెరికాయేతర వ్యక్తులకు కొత్త నిబంధన

వాషింగ్టన్, అక్టోబరు 25: అక్రమ వలసదారులకు అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగా అమెరికా మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు అమెరికాను వీడినా, దేశంలోకి వచ్చినా.. వారు సరిహద్దులు దాటే సమయంలో ముఖ గుర్తింపు వ్యవస్థ(ఫేస్ రికగ్నిషన్) సాయంతో ఫొటోలు తీయడానికి, బయోమెట్రిక్ వివరాలను సేకరించడానికి సరిహద్దుల్లోని సంబంధిత అధికారులకు వెసులుబాటు కల్పించింది. 14ఏళ్ల లోపు పిల్లలు, 79ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులను కూడా ఈ నిబంధనల పరిధిలోకి తీసుకువచ్చింది. వీసా గడువు ముగిసినా అమెరికాలో ఉంటున్నవారిని, దొంగ పాస్‌పోర్టులతో అమెరికాలోకి ప్రవేశించేవారిని సులభంగా గుర్తించడానికి ఈ నిర్ణయం దోహదం చేస్తుందని భావిస్తున్నారు. డిసెంబరు 26నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం.. ఎయిర్‌పోర్టులు, సముద్ర పోర్టులు, భూమార్గం ఇలా ఏరకంగానైనా అమెరికాయేతర వ్యక్తులు సరిహద్దులు దాటినప్పుడు అధికారులు వారి వివరాలను సేకరించవచ్చు. నిజానికి 2021లోనే ఈ నిబంధనను ప్రతిపాదించారు. పైలట్ ప్రాజెక్టుగా కొన్ని చోట్ల అమలు చేశారు. ఇప్పుడు పూర్తి స్థాయి సాంకేతికతతో విస్తృతంగా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

పాక్ సరిహద్దులో 'ఎక్స్ త్రిశూల్'!

» సర్ క్రీక్ వద్ద 30వ తేదీ నుంచి త్రివిధ దళాల విన్యాసాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 25: భారత త్రివిధ దళాలు భారీఎత్తున సంయుక్త విన్యాసాలకు సిద్ధమవుతున్నాయి. పశ్చిమాన పాకిస్థాన్ సరిహద్దులో సర్ క్రీక్ సమీపాన ఈ నెల 30 నుంచి నవంబరు 10వ తేదీ వరకు 'ఎక్స్ త్రిశూల్' పేరిట వీటిని నిర్వహించనున్నాయి. వీటికోసం వైమానిక దళం 28 వేల అడుగుల ఎత్తువరకు గగనతల ఆంక్షలు విధించింది. పైగా యుద్ధం సహా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా సిద్ధంగా ఉండాలని ఎయిర్‌ఫోర్స్ తన అధికారులు, సిబ్బంది మొత్తానికీ 'నోటీస్ టు ఎయిర్‌మెన్ (నోటమ్)' జారీచేసింది. ఇటీవలి కాలంలో ఇంత పెద్దఎత్తున సంయుక్త విన్యాసాలు జరుపలేదు. పాకిస్థాన్‌తో ఇటీవలి కాలంలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టి విజయం సాధించాక 'ఎక్స్ త్రిశూల్'కు త్రివిధ బలగాలు సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సర్ క్రీక్ వద్ద భారత సైన్యం 'ఎక్స్ త్రిశూల్' విన్యాసాలు తలపెట్టడం, వైమానిక సిబ్బందికి 'నోటమ్' కూడా జారీచేయడంతో పాకిస్థాన్ భయాందోళనలకు గురవుతోంది. తన దేశ సెంట్రల్, దక్షిణ ప్రాంతాల్లో గగనతలంలో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించింది. తన సైన్యానికి కూడా తాను కూడా నోటమ్ జారీచేసింది. కాగా, భారత నౌకాదళం అమ్ములపొదిలోకి అత్యంత శక్తివంతమైన యుద్ధ నౌక 'మహే'వచ్చిచేరింది. 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారవడం 'మహే' ప్రత్యేకత. టార్పెడోలు, బహుళ వినియోగ జలాంతర్గామి విధ్వంసక క్షిపణులు, అధునాతన రాడార్లు, సోనార్లతో శత్రు లక్ష్యాలను ఇది ఛేదిస్తుంది.

మహిళా డాక్టర్ ఆత్మహత్య కేసులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అరెస్టు

పుణె, అక్టోబరు 25: మహిళా డాక్టర్ ఆత్మహత్య కేసులో పోలీసులు శనివారం ప్రశాంత్ బంకర్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీరును పుణెలో అరెస్టు చేశారు. అతడు ఆమె అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని కుమారుడు కావడం గమనార్హం. సతారా జిల్లాలోని ఫల్టాన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న ఆ 28 ఏళ్ల వైద్యురాలు గురువారం రాత్రి అక్కడి ఓ హోటల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తనపై పోలీసు ఎస్.ఐ. గోపాల్ బదానే అత్యాచారం చేశాడని, బంకర్ మానసికంగా వేధించాడంటూ చనిపోవడానికి ముందు అరచేతిపై నోట్ రాసింది. దీనిని ఆధారం చేసుకుని ఫల్టాన్ పోలీసులు బంకర్‌ను అరెస్టు చేసి, ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న ఆరోపణపై కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు ముందు ఆమె చివరి ఫోన్ చేసి మాట్లాడినట్టు పోలీసులు గుర్తించారు.

ఆరు నెలల్లో రూ.1,500 కోట్లు స్వాహా!

» పలు ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ల పేరిట సైబర్ మోసగాళ్ల వల

న్యూఢిల్లీ, అక్టోబరు 25 : ఆరు నెలల్లో రూ.1,500 కోట్లు హంఫట్.. సైబర్ నేరగాళ్లు దేశంలోని ప్రధాన నగరాల్లో జనంపై పలు ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ల పేరిట వల విసిరి కాజేసిన మొత్తం ఇది.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సైబర్ విభాగం ఈ వివరాలను వెల్లడించింది. దేశంలోని ప్రధాన నగరాలు హైదరాబాద్, బెంగళూరు, దేశ రాజధాని ప్రాంతాలలోనే ఈ సైబర్ మోసాల్లో అధికంగా దాదాపు 65 శాతం కేసులు నమోదవడం గమనార్హం. కేంద్ర సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం బెంగళూరు నగరంలో అత్యధికంగా(26.38 శాతం) ఈ మోసాలు చోటు చేసుకున్నాయి. ఈ నేరాలను విశ్లేషించిన తర్వాత పనిచేసే వయస్సులోని 30-60ఏళ్ల వారినే సైబర్ నేరగాళ్లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిసింది. బాధితుల్లో 76% మంది ఈ వయస్సు వారే. సంపాదించే వయస్సులో ఉన్న వీరి ఆర్థిక ఆకాంక్షలను ఆసరాగా చేసుకుంటున్నారని పేర్కొంది.

వచ్చేవారం నుంచి దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్!

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్)ను దేశవ్యాప్తంగా చేపట్టడానికి ఎన్నికల సంఘం సిద్ధమైంది. వచ్చేవారం మధ్యలో 10 నుంచి 15 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ తొలిదశను ప్రకటించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయని వివరించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న, జరగబోయే రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను ఈసీ ఇప్పుడే నిర్వహించబోదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి యంత్రాంగం మొత్తం ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నందున దీనిపై దృష్టి సారించే అవకాశం ఉండదని భావిస్తున్నారు. చాలా రాష్ట్రాల్లో ఇటువంటి సర్వేను దాదాపు 20ఏళ్ల క్రితం నిర్వహించారు.

తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం రద్దు

» సాంకేతిక లోపం వల్లే.. ఎయిర్ ఏషియాకు తప్పిన ముప్పు


శంషాబాద్ రూరల్/గన్నవరం/చెన్నై (ఆంధ్రజ్యోతి)/న్యూఢిల్లీ, అక్టోబరు 25: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తిరుపతి వెళ్లాల్సిన విమానం రద్దయింది. శనివారం సాయంత్రం 6.30 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి 78 మంది ప్రయాణికులతో తిరుపతి వెళ్లాల్సిన ఎస్‌జీ 2138 స్పైస్‌జెట్ విమానం టేకాఫ్ తీసుకునే సమయంలో విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలట్ ఏటీసీ అధికారులకు సమాచారమిచ్చారు. పలు సమస్యలున్నట్లు గుర్తించిన ఇంజనీర్లు సాంకేతిక లోపం సరిచేయడానికి చాలా సమయం పట్టడంతో విమానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్‌లో ల్యాండింగ్ కావాల్సిన రెండు ఇండిగో విమానాలు(బెంగళూరు, అస్సాం నుంచి వచ్చాయి) ప్రతికూల వాతావరణం కారణంగా గన్నవరంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. మరోవైపు, చెన్నై నుంచి మలేసియా రాజధాని కౌలాలంపూర్‌కు బయల్దేరిన ఎయిర్ ఏషియా విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం రాత్రి చెన్నై విమానాశ్రయంలో రన్‌వే నుంచి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే విమానాన్ని పక్షి ఢీకొంది. పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించి చెన్నై విమానాశ్రయంలో సురక్షితంగా అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఇదిలా ఉండగా, విమానాల్లో 'పవర్ బ్యాంక్' నుంచి మంటలు వచ్చిన నేపథ్యంలో.. వాటికి అనుమతిపై డీజీసీఏ పరిశీలిస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

ఝార్ఖండ్‌లో ఏసీ బస్సులో మంటలు

» 45 మంది ప్రయాణికులు సురక్షితం

రాంచీ, అక్టోబరు 25: ఝార్ఖండ్ రాజధాని రాంచీ సమీపంలో శనివారం సాయంత్రం ఆకస్మిక పెను ప్రమాదం తప్పింది. రాంచీ నుంచి ఛాత్రా వెళ్తున్న ఏసీ బస్సులో ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. బ్యాటరీ బాక్సు వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు ప్రారంభం కాగా, బస్సులో ఉన్న రసాయనాల కారణంగా అవి వెంటనే వ్యాపించాయి. దాంతో బస్సును నిలుపుదల చేసి అందులోని మొత్తం 45 మంది ప్రయాణికులను కిందికి దించడంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు.

జీవిత బీమా.. అదానీకి ధీమా!



(మొదటి పేజీ తరువాయి)

షేర్ల కొనుగోలు, పెట్టుబడుల సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి మార్కెట్ నుంచి 585 మిలియన్ డాలర్ల బాండ్ల రూపంలో సేకరిస్తున్నట్లు ఈ ఏడాది మే నెలలో అదానీ గ్రూప్ ప్రకటించింది. కొద్ది రోజుల తర్వాత మే 30న మొత్తం డబ్బులు ఒకే సంస్థ(ఎల్ఐసీ) సమకూర్చుస్తున్నట్లు అదానీ ఒక ప్రకటన చేశారు. వాషింగ్టన్ పోస్ట్ చెబుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన మొత్తం 3,900 మిలియన్ డాలర్లు లేదా 33 వేల కోట్ల రూపాయలు. అయితే, అదానీ కంపెనీల ఆస్తుల విలువ ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం 90 బిలియన్ డాలర్లు. ఎల్ఐసీ నుంచి కేంద్రం ఇప్పించదలచింది 3.9 బిలియన్ డాలర్లు. తమకు అవసరమైన మొత్తం సొమ్ము ఎల్ఐసీ నుంచి సేకరిస్తున్నట్లు గత మే నెలలో అదానీ ప్రకటించినప్పుడే విమర్శలు గగ్గోలు పెట్టాయి. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి.

ప్రభుత్వ బాండ్ల కన్నా ఇదే మెరుగు

అదానీ గ్రూపులోని రెండు సంస్థల్లో 3.4 బిలియన్ డాలర్ల బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టాలని కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించినట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. "అదానీ పోర్ట్స్ అండ్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్‌కు రేటింగ్ ఏజెన్సీలు ఏఏఏ రేటింగ్ ఇచ్చాయి. అందులో పెట్టుబడి పెడితే 7.5 శాతం నుంచి 7.8 శాతం వరకు ఆదాయం ఆఫర్ చేస్తున్నారు. ఏఏఏ క్రెడిట్ రేటింగ్ ఉంటే ప్రభుత్వ బాండ్లతో సమానం. పదేళ్ల లాకిన్ పీరియడ్‌తో ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెడితే 7.2 శాతం మాత్రమే ఆదాయం వస్తుంది. రెండో సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్. దీనికి ఏఏ రేటింగ్ లభించింది. దీంట్లో పెట్టుబడి పెడితే 8.2 శాతం ఆదాయం ఆఫర్ చేసింది. కాబట్టి ఈ రెండింట్లో పెట్టుబడి పెట్టండి" అని ఆర్థిక శాఖ స్వయంగా సూచించినట్లు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. దీనికి అదనంగా మరో 507 మిలియన్ డాలర్లు అదానీ కంపెనీల్లో షేర్ల కొనుగోలు రూపంలో పెట్టాలని సూచించినట్లు చెప్పింది. కొన్నేళ్ల క్రితం ఈ సంక్షోభంలోకి రాక ముందు కూడా ఎల్ఐసీ అదానీ గ్రూప్ సంస్థల్లో 30 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టింది. అదానీని ఆదుకునే కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన బృందంలో ఆర్థిక శాఖ ఆర్థిక సేవల విభాగం, ఎల్ఐసీ, నీతి ఆయోగ్ అధికారులు ఉన్నట్లు తెలిపింది. దీనికి ఆర్థిక శాఖ ఆమోదం ఉన్నట్లు చెప్పింది. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇద్దరు అధికారులు తమకు ఈ విషయం వెల్లడించారని తెలిపింది. మొత్తం వ్యవహారం ఎల్ఐసీతో డబ్బులు ఇప్పించడం మాత్రమే కాకుండా దేశ విదేశాల్లోని పెట్టుబడిదారుల్లో అదానీ సంస్థల సామర్థ్యం పట్ల విశ్వాసం పెంచడం లక్ష్యంగా జరిగిందని తెలిపింది. అదానీ గ్రూప్ అప్పులు సంస్థ విలువలో 20 శాతానికి చేరిన నేపథ్యంలో ఎల్ఐసీతో 3.9 బిలియన్ డాలర్ల కమిట్‌మెంట్ చేయించడం ద్వారా అదానీ వెనుక తాను ఉన్నానన్న సంకేతాన్ని జాతీయ అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలకు ప్రభుత్వం ఇవ్వదలచిందని పేర్కొంది. అయితే, వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రధానంగా అంతర్జాతీయంగా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టడం రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమని, ఎల్ఐసీ లాంటి సంస్థలోని ప్రజాధనాన్ని అందులో పెట్టించడం సరికాదని చెప్పేందుకు ప్రయత్నం చేసింది. భారత ప్రభుత్వం తనకు ఇంతకన్నా ముఖ్యమైన పనులేవీ లేవన్నట్లుగా అదానీ కొమ్ము కాస్తున్న తీరు క్రోనీ క్యాపిటలిజానికి అద్దం పడుతోందని టిమ్ బర్న్‌లో అనే ఆస్ట్రేలియా ఆర్థిక నిపుణుడిని ఉటంకిస్తూ వ్యాఖ్యానించింది. అదానీ గ్రూప్ స్పందన కోసం వాషింగ్టన్ పోస్ట్ అడిగినప్పుడు ఎల్ఐసీ అనేక సంస్థల్లో పెట్టుబడి పెడుతుంది, అదే విధంగా అదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టి మంచి లాభాలు పొందిందని సమాధానం ఇచ్చినట్లు పేర్కొంది. ప్రభుత్వం నుంచి ప్రత్యేక మద్దతు ఉందని అనడానికి ఆధారాలు లేవని, తాము మోదీ అధికారంలోకి రావడానికి ముందు నుంచే వేగంగా అభివృద్ధి చెందుతున్న సంస్థగా పేరు తెచ్చుకున్నామని అదానీ సంస్థ తెలిపిందని వెల్లడించింది.


పాత వివాదాల ప్రస్తావన

గతంలో అదానీ గ్రూప్ ఎదుర్కొన్న వివాదాలను కూడా వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రస్తావించింది. తప్పుడు సమాచారం ద్వారా అమెరికా సంస్థల నుంచి పెట్టుబడులు పొందేందుకు అదానీ గ్రూపు ప్రయత్నించిందని అమెరికా న్యాయశాఖ చేసిన ఆరోపణలను పత్రిక గుర్తు చేసింది. 250 మిలియన్ డాలర్ల భారత దేశంలో నాయకులకు, అధికారులకు లంచాలిచ్చి తప్పుడు పత్రాలు తెప్పించుకున్నారని పేర్కొంది. అమెరికా సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజి కమిషన్ తమ నిబంధనలను అదానీ ఉల్లంఘించినట్లు సివిల్ కేసు వేసిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. 2023 నాటి హిండెన్‌బర్గ్ నివేదికను కూడా పత్రిక ప్రస్తావించింది. అదానీ గ్రూప్ అనుమానాస్పద విదేశీ సంస్థల నుంచి పెట్టుబడులు పెట్టించడం ద్వారా తమ షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. దీనిపై సెబీ దర్యాప్తు చేసి రెండింటిని కొట్టివేసింది. మరికొన్ని ఆరోపణలపై సెబీ దర్యాప్తు కొనసాగుతోంది. వీటికితోడు 2014లో మోదీ ప్రచారానికి అదానీ ప్రైవేట్ జెట్‌ను వాడుకున్నారని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. దీనికితోడు అదానీ గ్రూప్ సంస్థల్లో పెట్టుబడి రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమని వివిధ సంస్థలు ఇచ్చిన నివేదికలను తన కథనంలో ప్రస్తావించింది.

తప్పుడు వార్త: ఎల్ఐసీ

వాషింగ్టన్ పోస్ట్ కథనాన్ని ఎల్ఐసీ ఖండించింది. తమ పెట్టుబడి నిర్ణయాలను ఎవరూ ప్రభావితం చేయలేరని, తాము స్వతంత్రంగానే, తమ విధివిధానాలకు లోబడి నిర్ణయం తీసుకున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. తమ నిర్ణయాల్లో ఆర్థిక శాఖ కానీ ఇతర ఏ సంస్థ జోక్యం లేదని స్పష్టం చేసింది. 3.9 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రతిపాదన పత్రం ఏమీ కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్, ఎల్ఐసీల మధ్య చర్చకు రాలేదని చెప్పింది. 41 లక్షల కోట్ల ఆస్తులున్న ఎల్ఐసీ 351 కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. దాని మొత్తం పెట్టుబడుల్లో అదానీలో పెట్టిన మొత్తం రెండు శాతం మాత్రమే. ఇండియాలో 500 అగ్రశ్రేణి కంపెనీల విలువ గత పదేళ్లలో పది రెట్లు పెరిగిందని గుర్తు చేసింది.

పీఏసీ దర్యాప్తు జరగాలి: కాంగ్రెస్



వాషింగ్టన్ పోస్ట్ కథనంపై కాంగ్రెస్ స్పందించింది. అదానీ సంస్థల లబ్ధి కోసం కోట్లాదిమంది ఎల్ఐసీ నిధులను దుర్వినియోగం చేయడంపై పార్లమెంటరీ కమిటీ అయిన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీతో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. ఆర్థిక శాఖ, నీతి ఆయోగ్ కలిసి అదానీ గ్రూప్ మీద ఆర్థిక సంస్థల్లో విశ్వాసం పెంచేందుకు ఈ స్కీమ్ వేశాయని వ్యాఖ్యానించింది. 30 కోట్ల మంది ఎల్ఐసీ పాలసీదారుల కష్టార్జితాన్ని మోదీ దుబారా చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తమ కష్టార్జితాన్ని మోదీ ఇలా అదానీని ఒడ్డున పడేయడానికి వాడుతున్నారని తెలుసా? అని ప్రశ్నించారు. ఇది తీవ్రమైన నేరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఎవరి ఒత్తిడితో అధికారులు ఒక ప్రైవేటు కంపెనీని రక్షించే కార్యక్రమానికి పూనుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు ఫోను చేస్తే అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. గత ఏడాది అమెరికాలో అదానీ మీద ఆరోపణలు వచ్చినప్పుడు కంపెనీ షేర్లు పతనమైనప్పుడు, ఒక్క ఎల్ఐసీకే రూ.7,850 కోట్ల నష్టం వచ్చిందని ప్రస్తావించారు. అదానీ రెండు వేల కోట్ల రూపాయల ముడుపులు ఇచ్చి అనుమతులు సంపాదించారని స్వయంగా అమెరికా ప్రభుత్వమే ఆరోపించిందని చెప్పారు. ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరగాల్సిందేనని అన్నారు. మొదట అదుగా పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. అదానీ సంస్థ అమెరికా సెక్యూరిటీస్ కమిషన్ సమన్లు పంపినా వాటిని సర్వ్ చేయడానికి మోదీ ఏడాది కాలంగా అంగీకరించడం లేదన్నారు. ఇది కేవలం ఎల్ఐసీ వ్యవహారం కాదని, ఇదొక 'మోదానీ మెగా స్కామ్' అని వ్యాఖ్యానించారు. సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖ ఇలా అన్ని ప్రభుత్వరంగ సంస్థలతో ఒత్తిడి తెచ్చి ప్రైవేటు సంస్థలను తమ ఆస్తులను అదానీకే అమ్మేసేట్టు చేస్తున్నారని ఆరోపించారు. విదేశాల్లో అదానీ ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం దౌత్యపరమైన మద్దతు ఇస్తోందని, బొగ్గు దిగుమతుల్లో ఎక్కువ ధరలను చూపిస్తూ విదేశాలకు పెద్దమొత్తం నిధులు తరలిస్తున్నారని, రాష్ట్రాల్లో లంచాలిచ్చి అత్యధిక ధరలకు విద్యుత్ సరఫరా కాంట్రాక్టులు సంపాదిస్తున్నారని జైరాం రమేశ్ చెప్పారు.

ఆ ఫొటోలను 24 గంటల్లోగా తొలగించాల్సిందే

» ఆన్‌లైన్‌లో 'సమ్మతి లేని సన్నిహిత ఫొటో'లపై కేంద్రం మార్గదర్శకాలు

బెంగళూరు, అక్టోబరు 25: ఆన్‌లైన్ లైంగిక వేధింపులకు చెక్ పెట్టడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఎవరికి సంబంధించినవైనా 'సమ్మతి లేని సన్నిహిత చిత్రాలను' ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా ఆన్‌లైన్ నుంచి తొలగించాలని సోషల్ మీడియా వేదికలు, పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఇటీవల కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. సంబంధిత ఫొటోల తొలగింపు ప్రక్రియ గురించి పోలీసులు తప్పనిసరిగా బాధితులకు సమాచారం అందించాలని, ఒకవేళ ఆ కంటెంట్ మళ్లీ కనిపిస్తే.. వారిని అలర్ట్ చేయాలని కేంద్రం ప్రవేశపెట్టిన ఎస్ఓపీలో పేర్కొంది. సమ్మతి లేని ఫొటోలపై బాధితులు ఎలా ఫిర్యాదు చేయవచ్చో మార్గదర్శకాలు పేర్కొన్నాయి. సోషల్ మీడియా వేదికలకు చెందిన 'రిపోర్ట్ బటన్' ద్వారా లేదా సంబంధిత గ్రీవెన్స్ అధికారులకు, జాతీయ సైబర్ నేరాల రిపోర్టింగ్ పోర్టల్‌లో లేదా నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చని తెలిపింది. తొలగించిన కంటెంట్‌ను తిరిగి అప్‌లోడ్ చేయకుండా నియంత్రించేందుకు సాంకేతికత ద్వారా తగిన చర్యలు చేపట్టాలని సోషల్ మీడియా వేదికలను ఆదేశించింది. మాజీ భర్త తన వ్యక్తిగత ఫొటోలను తన సమ్మతి లేకుండా ఆన్‌లైన్‌లో షేర్ చేస్తున్నారని పేర్కొంటూ ఓ మహిళా అడ్వకేట్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేసిన నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఈ మార్గదర్శకాలను జారీ చేసింది.

శబరిమల చోరీలో 400 గ్రాముల పసిడి స్వాధీనం

న్యూఢిల్లీ/బెంగళూరు/బళ్లారి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప ఆలయ ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడానికి వినియోగించిన పసిడి చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) భారీ పురోగతి సాధించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, అయ్యప్ప ఆలయ పూజారిగా ప్రచారం చేసుకున్న ఉన్నికృష్ణన్ పొట్టి ఇంటి నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. పొట్టి నుంచి పసిడిని కొనుగోలు చేసిన బళ్లారికి చెందిన వ్యాపారి గోవర్ధన్ నుంచి 400 గ్రాముల బంగారంతో పాటు కొన్ని పసిడి నాణేలను కూడా స్వాధీనం చేసుకున్నారు. బళ్లారిలో 'రొద్దమ్ జ్యువెలర్' పేరుతో వ్యాపారం చేస్తున్న గోవర్ధన్‌ను అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నట్లు సిట్ ఎస్పీ శశిధరన్ తెలిపారు. సిట్ కథనం ప్రకారం.. 2019లో 476 గ్రాముల బంగారాన్ని గోవర్ధన్‌కు పొట్టి విక్రయించారు. వీరిద్దరి మధ్య పలు ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఖాతాలు స్పష్టం చేశాయి. చెన్నైకి చెందిన 'స్మార్ట్ క్రియేషన్స్' మధ్యవర్తిగా వ్యవహరించింది. కల్పేష్ అనే వ్యక్తి పొట్టి సూచన మేరకు ఈ వ్యవహారాన్ని నడిపించారు. అయితే, పొట్టి అభ్యర్థన మేరకు అయ్యప్ప ఆలయం ద్వారానికి మరమ్మతులు చేశానని, ద్వారపాలకుల మరమ్మతుల గురించి తనకేమీ తెలియదని 'రొద్దమ్ జ్యువెలర్' యజమాని గోవర్ధన్ సిట్‌కు చెప్పారు.

లొంగు'బాట'లో హిడ్మా!

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోతారని కొన్నాళ్లుగా ప్రచారం



హిడ్మా(ఫైల్)

తెలంగాణలోనే లొంగిపోతారని నిఘా వర్గాల అంచనా

ఫిబ్రవరిలో వరంగల్‌లో లొంగిపోయిన హిడ్మా కుమార్తె కేషా

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనాయకుడు మడావి హిడుమాయ్ అలియాస్ హిడ్మా అలియాస్ సంతోష్ త్వరలోనే లొంగిపోతారని జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఈ ప్రచారాన్ని ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఖండిస్తున్నప్పటికీ.. హిడ్మా తెలంగాణలో లొంగిపోయే అవకాశాలను తోసిపుచ్చలేమని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) బెటాలియన్-1 కమాండర్‌గా ఉన్న హిడ్మాకు గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుంది. గతంలో హిడ్మా నాయకత్వంలోనే భద్రతా బలగాలపై అనేక దాడులు జరిగాయని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మా.. మల్లా, నిషాద్ వర్గాలకు చెందిన వందలాది మందిని మావోయిస్టు పార్టీలో చేర్పించారు. వారికి సాయుధ శిక్షణ ఇచ్చి పీఎల్‌జీఏలో చేర్చి.. అజేయమైన సైన్యంగా తీర్చిదిద్దారు. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న హిడ్మా.. చాలా సార్లు పోలీసులకు దొరికినట్టే దొరికి తప్పించుకున్నారు. అగ్రనేతలు సోను, ఆశన్నతోపాటు వందల మంది మావోయిస్టులు లొంగిపోయిన తర్వాత హిడ్మా లొంగుబాట విషయంలో పెద్ద చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే హిడ్మా కుమార్తె వంజెం కేషా అలియాస్ జెన్నీ వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. చిన్నప్పటి నుంచి పార్టీ సాంస్కృతిక విభాగంలో పనిచేసిన కేషా.. మావోయిస్టు నాయకుడు రమేశ్‌ను వివాహం చేసుకున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడైన కడారి సత్యనారాయణ రెడ్డి భద్రతా బృందంలో సభ్యురాలిగా కూడా పని చేశారు. ఆమె భర్త రమేశ్‌ను 2020లో మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. హిడ్మా కుమార్తె కేషా.. ఆపరేషన్ కగార్ తీవ్రతరమవుతున్న క్రమంలో పార్టీ నుంచి బయటకు వచ్చారు. తాజాగా ఇప్పుడు హిడ్మా సైతం తన అనుచరులతో కలిసి వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయే అవకాశాలున్నాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు గిరిజనుల హత్య

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు మారణకాండకు పాల్పడ్డారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో కాంకేర్ గ్రామానికి చెందిన సోడి తిరుపతి (35), కట్టం రవి (25) అనే ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. శుక్రవారం రాత్రి వీరి ఇళ్లకు వెళ్లిన మావోయిస్టులు.. మాట్లాడాలని బయటకు పిలిచి కత్తులతో పొడిచి చంపారు.

పత్రికలకు కేంద్ర ప్రభుత్వ ప్రకటనల రేటు 27% పెంపు!

కేంద్ర సమాచార, ప్రసారశాఖ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 25: దేశవ్యాప్తంగా పత్రికలకు ఇచ్చే ప్రభుత్వ ప్రకటనల రేట్లను 27% పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. బిహార్ ఎన్నికల కోడ్ ముగియగానే ప్రకటనల రేటు పెంపును నోటిఫై చేయనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. 'దేశంలో సంప్రదాయ మీడియాలో చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పత్రికలు, టీవీ, సినీ రంగాల అభివృద్ధికి ప్రోత్సాహం అందించడంతోపాటు వాటిపై ఆధారపడిన వారి జీవనోపాధికి తోడ్పడేలా సంస్కరణలు అమలు చేయబోతున్నాం. పత్రికలకు కేంద్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థలు ఇచ్చే ప్రకటనల రేటు (చెల్లించే చార్జీ)ను 27శాతం పెంచుతాం. బిహార్ ఎన్నికల కోడ్ ముగిశాక నోటిఫై చేయబోతున్నాం" అని తెలిపారు. పత్రికలకు ప్రభుత్వ యాడ్ రేటును 2013లో 19శాతం, 2019 జనవరిలో 25శాతం పెంచారు. ఆరేళ్ల తర్వాత మళ్లీ సవరిస్తున్నారు. టీవీ చానళ్లకు ఇచ్చే ప్రకటనల రేటు సవరణపైనా కేంద్ర సమాచార శాఖ కసరత్తు చేస్తోంది. చానళ్లకు ప్రకటనలు ఇచ్చేందుకు ఆధారంగా తీసుకునే టెలివిజన్ రేటింగ్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, మరిన్ని రేటింగ్ ఏజెన్సీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోంది.

జంక్‌తో ఏఐ బుర్రలోనూ మట్టే!

» ఇంటర్నెట్‌లోని చెత్త కంటెంట్‌తో ఏఐల్లో బ్రెయిన్ రాట్

» పడిపోతున్న విశ్లేషణ సామర్థ్యం



న్యూఢిల్లీ, అక్టోబరు 25 : జంక్ ఫుడ్ అతిగా తింటే అది క్రమంగా మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది. అదే విధంగా ఆన్‌లైన్‌లో జంక్ కంటెంట్.. పిచ్చిపిచ్చి రంగుల థంబ్‌నైల్స్‌తో యూట్యూబ్‌లో ఉండే నాణ్యమైన సమాచారం లేని వీడియోలు, మొబైల్ స్క్రీన్‌ను స్క్రోల్ చేస్తూ ఎవరో సరదా కోసం చేసిన రీల్స్, పోస్ట్‌లు చూడడం వల్ల మనిషి ఆలోచన సామర్థ్యం కూడా క్రమంగా తగ్గుతుంది. ఆన్‌లైన్‌లో సులువుగా దొరికే, ఆకట్టుకునేలా కనిపించే సమాచారంతో ఆ.. చాల్లే అని సరిపెట్టుకుంటే.. ఆలోచన పరిధి, కొత్తగా ఏదైనా తెలుసుకోవాలనే ఆసక్తి, లోతైన అవగాహన, విశ్లేషణ చేసే సామర్థ్యం, ఓపిక తగ్గి మెదడు మొద్దు బారిపోతుంది. ఉన్న మతి కూడా పోతుంది. ఇలాంటి స్థితినే బ్రెయిన్ రాట్ అంటారు. ఈ పరిస్థితి మనుషులకు మాత్రమే పరిమితం కాలేదు. ఏదో ఒక రోజు మనిషిని శాసిస్తుందని భావిస్తున్న ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు కూడా తప్పడం లేదు. ఇంటర్నెట్‌లోని జంక్ కంటెంట్(నాణ్యత లేని సమాచారం) ఏఐలను బ్రెయిన్ రాట్‌కు గురి చేసి వాటి సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. టెక్సస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్, పర్డ్యూ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఆన్‌లైన్‌లోని జంక్ కంటెంట్ చాట్ జీపీటీ4, జెమినీ1.5 వంటి ఎల్ఎల్ఎం(లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్) మోడల్ చాట్‌బాట్‌లను బ్రెయిన్ రాట్‌కు గురి చేస్తోందని ఈ అధ్యయనంలో తేలింది. ఏఐ చాట్‌బాట్‌లకు సోషల్ మీడియాలో వైరల్ అయిన సమాచారం, తక్కువ నాణ్యత కలిగిన ఎక్స్(ట్విటర్)లోని పోస్టులను నిత్యం ఫీడ్ చేస్తే.. ఏదైనా సమాచారం కోరినప్పుడు ఆ చాట్‌బాట్‌లు ఇచ్చే ఫలితాలు అంత తక్కువ స్థాయిలో ఉండడాన్ని పరిశోధకులు గుర్తించారు. ఏఐలు పూర్తి సామర్థ్యం మేరకు పని చేయకుండా మొద్దుబారిపోతున్నట్లు కనుగొన్నారు. ఏఐ మోడల్స్ విశ్లేషణ సామర్థ్యానికి కొలమానంగా భావించే ఏఆర్‌సీ(అబ్‌స్ట్రాక్షన్ అండ్ రీజనింగ్ కార్పస్) బెంచ్‌మార్క్ స్కోర్లు బ్రెయిన్ రాట్‌కు గురైన ఏఐ మోడల్స్‌లో 74.9 నుంచి 57.2కు పడిపోవడాన్ని పరిశోధకులు గుర్తించారు. అలాగే, ఎక్కువ సమాచారాన్ని ప్రాసెస్ చేసే సామర్థ్యానికి సంబంధించి రూలర్ బెంచ్‌మార్క్ కూడా 84.4 నుంచి 52.3కి పడిపోయినట్లు కనుగొన్నారు. అంతేకాదు, బ్రెయిన్ రాట్ ఏఐ చాట్‌బాట్‌ల సామర్థ్యాన్ని తగ్గించడమే కాకుండా వాటి స్వభావాన్ని కూడా మార్చేస్తుంది. అసాధారణమైన ప్రవర్తన, విచిత్రం, విపరీత ధోరణిలో, వెటకారంగా సమాధానాలు ఇవ్వడం, నార్సిజం వంటి లక్షణాలు బ్రెయిన్‌రాట్‌కు గురైన ఏఐ చాట్‌బాట్లలో కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. బ్రెయిన్‌రాట్‌కు గురైన చాట్‌బాట్‌కు మంచి, నాణ్యమైన సమాచారంతో శిక్షణ ఇచ్చినా దాని సామర్థ్యంలో పూర్తిస్థాయి పురోగతి కనిపించడం లేదని చెప్పారు. కాగా, ప్రస్తుతం చాట్‌జీపీటీ, జెమినీ వంటి ఎల్ఎల్ఎంలు సామాజిక మాధ్యమాల్లో లభిస్తున్న సరైన అధ్యయనం లేని నాసిరకమైన సమాచారాన్ని ఎక్కువగా తీసుకుంటున్నాయి. దాంతో ఆ చాట్‌బాట్‌లు ఇచ్చే ఫలితాల స్థాయి కూడా అందుకు తగ్గట్టుగానే ఉంటుంది. దీంతో ఆ చాట్‌బాట్‌లకు నాణ్యమైన సమాచారం చేరేలా చేయడంపై వాటిని అభివృద్ధి చేసే సంస్థలు దృష్టి పెట్టాలని పరిశోధకులు సూచిస్తున్నారు. చాట్‌బాట్‌లు బ్రెయిన్‌రాట్‌కు గురి కాకుండా చూసుకోవడమే ఉత్తమ మార్గమని చెబుతున్నారు.



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లు వార్నర్, గిల్‌క్రిస్ట్‌లతో మంత్రి శ్రీధర్‌బాబు

రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం అవ్వండి..

- పెట్టుబడులతో రాష్ట్ర పురోగతిలో పాలుపంచుకోండి..
- భారతీయ సీఈవోలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): 'రైజింగ్ తెలంగాణ' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని ఆస్ట్రేలియాలోని పలు కంపెనీల భారతీయ సీఈవోలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. పెట్టుబడులతో రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోవాలని కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన సిడ్నీలో ఆస్ట్రేలియా- ఇండియా రిలేషన్స్ సెంటర్ (సీఏఐఆర్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వ్యాపార సమావేశంలో పాల్గొన్నారు. వివిధ కంపెనీలకు చెందిన భారతీయ సీఈవోలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉందని, పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన పాలనతో అంతర్జాతీయ పెట్టుబడులకు రాష్ట్రం సురక్షితమైన గమ్యస్థానంగా మారిందని అన్నారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూలించే అంశాలు, పెట్టుబడి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఈవీ తదితర రంగాల్లో తెలంగాణలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశానికి హాజరైన ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లు, హైదరాబాద్‌కు ఐపీఎల్ ట్రోఫీని అందించిన డేవిడ్ వార్నర్, ఆడమ్ గిల్‌క్రిస్ట్‌లను శ్రీధర్‌బాబు కలిశారు.



జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన యువతికి నియామక పత్రం ఇస్తున్న ఉత్తమ్

కాంగ్రెస్ పాలనలో ఉద్యోగ అవకాశాలు: ఉత్తమ్

హుజూర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు రావాలంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని ఉద్యమాలు చేశామని, ఇప్పుడు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పాటుపడుతున్నామని చెప్పారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో తెలంగాణ పరిశ్రమలు, డీట్, సింగరేణి కాలరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 75వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంతోపాటు దేశంలో పేరొందిన 275 కంపెనీలను జాబ్ మేళాకు ఆహ్వానించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నాయని గుర్తించి మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం కూడా జాబ్ మేళా కొనసాగుతుందన్నారు. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

హరీశ్ కొత్త పార్టీ.. కవిత వేరు కుంపటి: కోమటిరెడ్డి



బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న హరీశ్‌రావు కొత్త పార్టీ కోసం చూస్తున్నారని, కవిత ఇప్పటికే వేరే కుంపటి పెట్టుకుందని, దాంతో బీఆర్ఎస్ నేతలు అయోమయంలో ఉన్నారని, నిరాశలో కూరుకుపోయి మాట్లాడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పచ్చ కామెర్లోడికి లోకమంతా పచ్చగా కనిపించిందిన్నట్లు.. వారి ప్రభుత్వంలో కాళేశ్వరం, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం, ధరణి, గొర్రెల పంపిణీ సహా అన్ని పథకాల్లో స్కాంలు చేయడంతో ఇప్పుడు ప్రజాప్రభుత్వం చేపట్టిన పనుల్లోనూ వారికి స్కాములే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఆర్ అండ్ బీ పరిధిలోని పలు రోడ్లను హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్)లో అభివృద్ధి చేసి, రహదారులను అద్దంలా మారుస్తామనేసరికి వారి గుండెలు అదురుతున్నాయన్నారు. హ్యామ్ రోడ్లలో రూ.8వేల కోట్ల మేర స్కామ్ జరగబోతోందని, అది హ్యామ్ కాదు పెద్ద స్కామ్ అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం ఆరోపించారు. దానిపై ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. హ్యామ్ రోడ్లపై ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తుంటే అజ్ఞానంగా ఉన్నాయని, అందుకు విచారిస్తున్నట్టు తెలిపారు.

త్వరలో 14 వేల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకం: మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా త్వరలో 14 వేల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకం చేపట్టబోతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. పౌష్టికాహారం పంపిణీకి మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలను పరిమితం చేయకుండా.. చిన్నారులకు ప్రాథమిక విద్యను సైతం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. వారి కోసం 57 రకాల ఆటవస్తువులు, ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. శనివారం రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 181 మంది గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లకు నియామక పత్రాలను మంత్రి సీతక్క అందజేశారు. దేశ భవిష్యత్తు ఈ కేంద్రాల్లోనే ఉందని, ప్రతి సూపర్‌వైజర్ వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో పాటించాలని సూచించారు. ఏడాదిన్నరలోనే 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, తమది ఉద్యోగనామ ప్రభుత్వమని మంత్రి సీతక్క తెలిపారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆడిటోరియంలో డీపీఓ, ఎంపీడీవో శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. గ్రూప్ వన్ పరీక్ష ద్వారా ఎంపికై రెండు వారాలపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మంత్రి సీతక్క ప్రశంసా పత్రాలను అందజేశారు.

కార్తీక మాసంలో నదీ హారతి: కొండా సురేఖ

కార్తీక మాసంలో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాల వద్ద సాయంత్రం వేళ నదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. నదీ హారతి సమయంలో భక్తులకు తగు సౌకర్యాలు కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై సచివాలయం నుంచి ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల ఈవోలు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి కీలక సూచనలు చేశారు. కార్తీకమాసం భక్తులకు ఎంతో విశేషమైందని, మరీ ముఖ్యంగా మహిళలు ఎంతో భక్తిభావంతో ఆలయాల్లో దీపాలు వెలుగిస్తుంటారన్నారు. ప్రతి రోజూ సాయంత్రం ఆలయాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు వీలుగా మట్టి ప్రమిదలు, ఒత్తులు, నూనె, ఇతర పూజా సామాగ్రి అందించాలని అధికారులకు సూచించారు. మహిళా భక్తులకు కార్తీక సోమవారం రోజు పసుపు, కుంకుమ అందించాలని చెప్పారు. నదీ హారతి వద్ద ప్రవచన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

మీరు మారరా?!

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. మునిసిపల్, వైద్య-ఆరోగ్య, ఆర్ అండ్ బీతోపాటు మరో రెండు, మూడు శాఖలపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వరుస సమీక్షలు నిర్వహించారు. ఆ సమయంలోనే అధికారులు వ్యవహరిస్తున్న తీరు, ఆయాశాఖల్లో అవలంబిస్తున్న విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలిసింది. "శాఖలకు అధిపతులుగా మీరే అన్ని అంశాలను గమనించుకుంటూ వెళ్లాలి కదా. మీరే ఇలా అలసత్వంగా, సమన్వయం లేకుండా వ్యవహరిస్తే ఎలా? చెత్త సేకరణ విషయం కూడా నేను చెప్పేదాకా వచ్చిందంటే మీరు ఎలా పని చేస్తున్నారో అర్థమవుతుందా" అంటూ చీవాట్లు పెట్టినట్లు సమాచారం. ఇక, సీఎం రేవంత్ పర్యవేక్షిస్తున్న మంత్రిత్వ శాఖల అధికారులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తినట్లు తెలిసింది. 'ఏంటి మారరా.. తీరు మార్చుకోండి' అంటూ ఘాటుగా హెచ్చరించినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో చెత్త కనబడకూడదు!

ఇటీవల నిర్వహించిన సమీక్షలో హైదరాబాద్‌లో ఎటు చూసినా చెత్త కనబడుతోందని, ఆ పరిస్థితి ఎందుకొచ్చిందని ఆ శాఖ ముఖ్య అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇక నుంచి హైదరాబాద్‌లో రోడ్లపై చెత్త కనబడకూడదని, ఇప్పుడు అవలంబిస్తున్న విధానం కన్నా మెరుగైన విధానం తీసుకురావాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో లోతుగా అధ్యయనం చేస్తున్నారా? లేదా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. రెండు, మూడు శాఖల సమన్వయంతో సంయుక్తంగా చేపట్టాల్సిన పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, కనీసం శాఖల మధ్య సమన్వయం చేసుకోలేరా? అని చురకలు అంటించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు, వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి సంబంధించి అధికారులు సమర్పించిన నివేదికపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమీక్షలో ఇచ్చిన నివేదికనే మళ్లీ ఇచ్చారని, మరీ ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా? ఇప్పటి దాకా ఒక్క సారైనా క్షేత్ర స్థాయిలో పరిశీలించలేదా? అని నిలదీశారు. ఉస్మానియా ఆస్పత్రి పనుల విషయంలో నిర్మాణ స్థలంలో ఉన్న ఓ పెట్రోల్ బంకును ఖాళీ చేయించి ఆ స్థలాన్ని అలాగే ఉంచడం పట్ల సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, ఫెన్సింగ్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఆ స్థలం ఖాళీగా ఉండడంతో లీజుకు ఇస్తారేమోనని కొందరు పైరవీలు చేయిస్తున్నారని ప్రస్తావించారు. తక్షణమే ఆ స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య శాఖల మధ్య సమన్వయం కొరవడిందని, నిర్మాణ పనులు, యంత్రాలు అమర్చే పనుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లు, ఇతరత్రా యంత్రాలు బిగించేందుకు ముందుగానే నిర్మాణాలు చేపట్టాలని, అంతా పూర్తయ్యాక మళ్లీ కూలగొట్టడం, మరమ్మతులు చేయడం మానుకోవాలని సూచించారు. ఆస్పత్రుల్లో యంత్రాల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

రాష్ట్రంలో కొందరు ఐఏఎస్ అధికారుల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. తీరు మార్చుకోవాలని, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్య క్రమాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ సూచిస్తున్నా.. అధికారులు ఏమాత్రం మారడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాల ప్రారంభోత్సవం సందర్భంగా హడావుడి చేయడం తప్పితే.. ఆ తర్వాత వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదనే

తీరు మార్చుకోవాలని సూచించినా..

విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు సీఎం, మరోవైపు సీఎస్, సీఎంవో అధికారులు ఎన్ని సూచనలు చేస్తున్నా.. అటు కలెక్టర్లు, ఇటు రాష్ట్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. కొన్ని శాఖల సమీక్షల సందర్భంగా అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం గురించి స్వయంగా సీఎం మాట్లాడుతుంటే మిగిలిన అధికారులంతా ఇదంతా ఎప్పుడు జరిగిందన్నట్టుగా ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండడం గమనార్హం. పనితీరు మార్చుకోని అధికారులపై బదిలీ వేటు వేస్తున్నా.. వారి తీరు మారకపోవడం గమనార్హం.

డీసీసీల భర్తీలో సామాజిక న్యాయం!

అన్నివర్గాలకు తగిన అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల భర్తీలో సామాజిక న్యాయం పాటించాలని, అన్నివర్గాలకు తగిన అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో డీసీసీ అధ్యక్షుల ఎంపికపై కీలక సమావేశం జరిగింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీ వేణుగోపాల్ రాష్ట్ర నేతల నుంచి డీసీసీ అధ్యక్షుల ఎంపికపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడం, సంఘటన్ సృజన్ అభియాన్ పురోగతి, జిల్లాస్థాయి నాయకత్వ మార్పులపై చర్చించారు.

నివేదికలను ముందుపెట్టుకుని..

ఈసారి డీసీసీ అధ్యక్షుల నియామకానికి సంబంధించి ఏఐసీసీ ప్రత్యేకంగా అబ్జర్వర్లను నియమించిన సంగతి తెలిసిందే. 22 మంది ఏఐసీసీ అబ్జర్వర్లు రాష్ట్రంలో పర్యటించి, ఒక్కో జిల్లా నుంచి ముగ్గురు, నలుగురు పేర్లతో కూడిన నివేదికలను అధిష్ఠానానికి అందజేశారు. శనివారం భేటీలో కేసీ వేణుగోపాల్ ఆ నివేదికలను ముందు పెట్టుకుని రేవంత్, భట్టి, మహేశ్‌గౌడ్‌లతో మాట్లాడారు. జిల్లాల్లో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళల కేటగిరీల్లో బలమైన నేతలు ఎవరెవరు ఉన్నారు? పార్టీలో ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు? గతంలో ఏయే పదవుల్లో ఉన్నారు? ప్రస్తుతం ఏం చేస్తున్నారు? అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో వారి పాత్ర ఏమిటనే అంశాలపై చర్చించారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ లక్ష్యమని రాహుల్ గాంధీ స్పష్టంగా ప్రకటించిన నేపథ్యంలో.. డీసీసీల్లోనూ సామాజిక న్యాయం ఉండాలని వేణుగోపాల్ సూచించారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల అంశం కీలకంగా మారినందున.. డీసీసీల భర్తీలోనూ ఆ దిశగా ఎంపిక ఉండాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వారిని సమన్వయం చేయడం, దక్కని వారికి భవిష్యత్తులో వేరే పదవులు ఇవ్వడంపైనా ఈ భేటీలో నేతలు చర్చించినట్టు తెలిసింది. పెద్దగా వివాదాలు లేని సుమారు పది జిల్లాల అధ్యక్షుల నియామకంపై ఏకాభిప్రాయం కుదిరినట్టు సమాచారం. రెండు మూడు వారాల్లో జాబితా ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ క్రమంలో రాష్ట్ర నేతలను మరోసారి ఢిల్లీకి పిలిచే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో రాజకీయ పరిణామాలు, మంత్రుల మధ్య విభేదాలు, పార్టీ అంతర్గత అంశాలు, మంత్రివర్గ విస్తరణ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలపైనా భేటీలో చర్చ జరిగినట్టు పేర్కొన్నాయి.



కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి

సమర్థులకే జిల్లా అధ్యక్ష పదవులు: మహేశ్‌గౌడ్

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా సమర్థులకే అవకాశం కల్పిస్తామని, ఎంపికలో సామాజిక న్యాయం ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ చెప్పారు. పార్టీలోనే కనీసం ఐదేళ్లు పనిచేసిన వారికి పదవులు వస్తాయన్నారు. కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇతర పదవుల్లో ఉన్నవారికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వకూడదనే నిబంధన పెట్టామని వెల్లడించారు. ఇక డీసీసీ అధ్యక్షుల ఎంపికపై తమ అభిప్రాయాలను పార్టీ అధిష్ఠానానికి తెలియజేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

కేంద్రం సహకరించకున్నా రూ.2400 కోట్లతో మొక్కజొన్నకు మద్దతు ధర

- పత్తిని రైతులు సీసీఐకే విక్రయించాలి
- తేమ శాతం పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉంచాలి: తుమ్మల



హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్దతుధర పథకంలో చేర్చని మొక్కజొన్న పంటను కేంద్ర సర్కారు సహకారం లేకపోయినా రూ.2400 కోట్ల నిధులతో మద్దతు ధరకు సేకరిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. పక్క రాష్ట్రాల్లో కనీస మద్దతు ధర అమలు చేయకపోవడంతో సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు తమ పంటను తెలంగాణ మార్కెట్‌లో విక్రయించడం వల్ల స్థానిక కర్షకులు నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా అలా మన రాష్ట్రంలో అమ్మాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం ఆయన సచివాలయంలో వ్యవసా యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పత్తిని రైతులు విధిగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కే అమ్మేలా అధికారులు చర్య లు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో పత్తి సేకరణలో సీసీఐ నిబంధనల్లో 8 నుంచి 12%వరకు తేమ శాతాన్ని సడలించాల్సిందిగా సంబంధిత అధికారులను కోరామన్నారు. ఈమేరకు తేమశాతాన్ని పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉంచాల ని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. ఈ-నామ్ సర్వర్‌లో సమస్య కారణంగా కొన్ని జిల్లాల్లో రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

ఉద్యమకారులకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)



కొట్లాడలేకపోయినందుకు అమరులు, ఉద్యమకారులకు చేతులెత్తి నమస్కరించి క్షమాపణలు చెబుతున్నా" అని జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు పోరు సాగిస్తామని స్పష్టం చేశారు. జాగృతి జనం బాట ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఆమె నివాళులర్పించారు. అనంతరం నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. మహిళలు, రైతులు, యువకులు, నిరుద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాలకు మేలు జరగాలని తెలంగాణ సాధించుకున్నాం. కానీ అన్ని వర్గాలకు న్యాయం జరిగిందా అంటే.. జరగలేదనే చాలా మంది చెబుతున్నారు. అందరూ బాగుండాలంటే సామాజిక తెలంగాణ రావాలి. ప్రతి ఒక్కరికీ సమానంగా రాజకీయ, ఆర్థిక పరమైన అవకాశాలు దక్కాలి" అని అభిప్రాయపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను మంత్రిగా లేకపోయినా.. అమరవీరుల కుటుంబాలాకు ఇంకో రూపంలోనైనా డబ్బులు ఇవ్వాలని అంతర్గత వేదికల్లో చెప్పానని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది అమరులైతే.. 580 మందికి మాత్రమే రూ.10లక్షల చొప్పున సాయం, ఉద్యోగాలను కల్పించారని గుర్తు చేశారు. మిగతా వారికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ సర్కారుపై జంగ్ సైరన్ పూరిస్తానన్నారు. ఒక్కో అమరవీరుడి కుటుంబానికి రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల జాబితాను ప్రజాదర్బార్‌లో తయారు చేద్దామని, అందరికీ పెన్షన్ వచ్చే దాకా విరామం లేకుండా పోరాడతానని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పేరుతో ఇప్పటికీ ఉద్యమకారులు ఉద్యమిస్తుండడం బాధాకరమన్నారు. 95శాతం ఉద్యోగాలు రాష్ట్ర ప్రజలకే దక్కాలని తెచ్చుకున్న రాష్ట్రపతి ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ.. హరియాణా, ఆంధ్ర రాష్ట్రాలకు వారికి ఉద్యోగాలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. అమరుల ఆశయ సాధన కోసమే జాగృతి పక్షాన జనం బాట పట్టానని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వానికి తెలంగాణ సోయి లేదని, తెలంగాణ తల్లి చేతుల్లోంచి బతుకమ్మను తీసేయడం మహిళల గుండెల్ని మెలి పెట్టినట్లైందని పేర్కొన్నారు. మళ్లీ తెలంగాణ తల్లి చేతుల్లోకి బతుకమ్మ వచ్చే వరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

నా ఓటమికి కుట్ర జరిగింది.. నిజం కాదా?

2019 పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్‌లో తన ఓటమికి కుట్ర జరిగిన మాట వాస్తవం కాదా? అని కవిత ప్రశ్నించారు. 20ఏళ్లు కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేశానని, ఇంటి గుట్టు బయట పెట్టి కుట్ర చేసి తనను బయటకు పంపించారని ఆరోపించారు. ఇప్పుడు తన దారి తాను వెతుక్కుంటున్నానని, నిజామాబాద్ జిల్లా బిడ్డగా, కోడలిగా ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చానని తెలిపారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2500 ఇవ్వడం లేదని, నిరుద్యోగులను చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. సామాజిక తెలంగాణ సాధించుకున్నప్పుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాగా, ఎస్సారెస్పీ ఎగువ భాగంలో వరదతో పంటలు నీట మునగడానికి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులే కారణమని కవిత విమర్శించారు. ఎస్సారెస్పీ నుంచి సకాలంలో దిగువకు నీటిని విడుదల చేయకపోవడం వల్లే పంటలు నీట మునిగాయన్నారు. నవీపేటలో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నా భూమిని స్వాధీనం చేసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు

- మా కుమారుడి ప్రలోభాలకు వారు లొంగిపోయారు..
- మానసిక స్థితి సరిగా ఉండే ప్రభుత్వానికి భూమి అప్పగించా..
- ఉన్నతాధికారులు చొరవ చూపి భూమిని స్వాధీనం చేసుకోవాలి
- మాజీ ఎంపీపీ గోలి శ్యాంసుందర్‌రెడ్డి



మాజీ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి

ఎల్కతుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బుక్కెడు బువ్వ పెట్టని కుమారుడిపై విసుగు చెందడంతో పాటు చనిపోయిన తన భార్య జ్ఞాపకార్థం ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించిన తన భూమిని స్వాధీనం చేసుకోవడంలో మండల రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారని మాజీ ఎంపీపీ గోలి శ్యాంసుందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తన నివాసం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన పేర ఎల్కతుర్తిలో ఉన్న కోట్ల రూపాయల విలువ చేసే ప్లాట్లను, భూమిని, హనుమకొండ పట్టణంలో ఉన్న తన ఇంటిని తప్పుడు పత్రాలతో తన కుమారుడు రంజిత్‌రెడ్డి బదలాయించుకున్నాడని ఆరోపించారు. ఆస్తి స్వాధీనం చేసుకుని తనను ఇంటి నుంచి విచక్షణ రహితంగా దాడి చేసి గెంటేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య వసంత కోరిక మేరకు తనకు ఉన్న ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో మూడు ఎకరాలను మానసిక స్థితిలో ఉండే ప్రభుత్వానికి అప్పగించానని తెలిపారు. తన కుమారుడు అధికారులను ప్రలోభాలకు గురి చేయడంతోనే వారు భూమిని స్వాధీనం చేసుకోవడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. తాను మానసిక స్థితిలో లేనట్టుగా తన కుమారుడు ఇచ్చిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తన పేరున ఉన్న భూమిని ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన కుమారుడు తన బాగోగులు చూసుకుంటే ప్రభుత్వానికి ఇవ్వగా మిగిలిన భూమిని తనకు అప్పగిస్తానని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి తాను ప్రభుత్వానికి అప్పగించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. జాప్యం చేయడం వల్ల తనపై అనేక ఒత్తిళ్లు వస్తున్నాయని, తనకు ప్రాణహాని కూడా ఉందని తెలిపారు.

మిగిలిన ఎంబీబీఎస్ సీట్లకు మాప్‌అప్ కౌన్సెలింగ్

- హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు పొంది.. చేరకపోవడంతో మిగిలిపోయిన వాటికి మాప్ అప్ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్ కోసం కాళోజీ హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. వర్సిటీ ప్రకటించిన తుది అర్హుల జాబితాలో పేరున్న అభ్యర్థులు ఈనెల 25 నుంచి 27 సాయంత్రం 6 గంటల వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని కోరింది. రాష్ట్రంలోని ఐదు ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఈ ఏడాది 300 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయని పేర్కొంది. వీటిలో 50% సీట్లు కన్వీనర్ కోటా పరిధిలోకి వస్తాయని, మిగిలిన సీట్లు బీ, సీ కేటగిరీకి వెళ్తాయని పేర్కొంది. ఈ సీట్లకు కూడా వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని కోరింది. ఇక మాప్‌అప్ రౌండ్‌లో వెబ్ ఆప్షన్ ఇచ్చి సీటు పొంది కాలేజీల్లో చేరకుండా సీట్ బ్లాక్ చేస్తే రూ.20 లక్షల జరిమానా విధిస్తామని వర్సిటీ హెచ్చరించింది.

ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు

- ఆస్పత్రిలో వరుస ఘటనలపై వైద్య మంత్రి సీరియస్

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వరుస ఘటనలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌పై వేటు వేశారు. నేడో, రేపో సమర్థులైన మరో వైద్యుడికి ఆ బాధ్యతను అప్పగించనున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిని గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినాకు సూచించారు. ప్రతి వారం ఎంజీఎంపై సమీక్ష చేసి తనకు నివేదికివ్వాలని వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు.

విద్యాశాఖ కార్యదర్శి బాధ్యతలు దేవసేనకు అప్పగింత

రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి అదనపు బాధ్యతలను కాలేజియేట్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.దేవసేనకు ప్రభుత్వం అప్పగించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా చైల్డ్ కేర్ సెలవుపై వెళ్తున్నందున దేవసేనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. యోగితా రాణాకు వచ్చే నవంబరు 1 నుంచి డిసెంబరు 12 వరకు చైల్డ్ కేర్ సెలవు మంజూరైంది.

పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయండి

- కలెక్టర్లు, డీఈవోలకు ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశం

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, తప్పులు లేని సమగ్ర ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై ఆయన శనివారం సన్నాహక సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేక విస్తృత సవరణలో భాగంగా చేపట్టాల్సిన అన్ని కార్యక్రమాలు నిర్ణీత గడువులో పూర్తిచేయాలన్నారు. ముఖ్యంగా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నవంబరు 1న తిరిగి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, అప్పటికి అన్ని పనులు పూర్తిచేయాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు.

తెలంగాణ లెజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా తులసిరాజ్ గోకుల్ బాధ్యతలు

తెలంగాణ లెజిస్లేచర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన హైకోర్టు అడ్వొకేట్ తులసి రాజ్‌గోకుల్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులును మర్యాద పూర్వకంగా కలిశారు. తులసి రాజ్‌గోకుల్‌కు వారు అభినందనలు తెలిపారు. హైకోర్టు న్యాయవాదిగా తులసిరాజ్ గోకుల్‌కు ఉన్న అనుభవం, సలహాలు శాసనసభ పాలనా వ్యవహారాల్లో ఎంతగానో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.

తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్

- జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయానికి కృషి చేస్తాం
- బీజేపీ ఏపీ శాఖ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- ఆయనతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి భేటీ

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు చేయడం ఖాయమని ఏపీ బీజేపీ శాఖ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ నడుస్తోందన్న మాధవ్.. ఇక్కడా (తెలంగాణలో) డబుల్ ఇంజిన్ సర్కారు వస్తే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రశాఖ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుతో మాధవ్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం రామచందర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో బీజేపీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. బీజేపీ తెలంగాణ శాఖ కార్యాలయానికి రావడం సొంతింటికి వచ్చినట్లుందన్నారు.. 'తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు కళ్లవంటివి. 2 ప్రాంతాల అభివృద్ధికి కలిసి పని చేస్తాం. ఏపీలోనూ రామచందర్‌రావుకు పలువురు మిత్రులున్నారు. మేం కూడా పార్టీ నిర్మాణంతోపాటు కార్యక్రమాల్లో పని చేశాం. పార్టీ సంస్థాగత అంశాల్లో మేం సమన్వయంతో పని చేస్తాం' అని మాధవ్ వివరించారు.

కొనుగోలు కేంద్రంలో కుప్పకూలిన రైతు

- తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తూ హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో భారీ వర్షానికి తడిసిపోయిన ధాన్యాన్ని ఆరబోస్తున్న ఓ రైతు గుండెపోటులో హఠాన్మరణం చెందాడు. ఈ ఘటన సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో జరిగింది. మండల పరిధిలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రైతు నిమ్మల సత్యం(50) తనకున్న రెండున్నర ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. వారం రోజుల కిందట పైరును కోసి గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తరలించాడు. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిపోయిన ధాన్యం తడిసిపోయింది. దీంతో శనివారం ఆట ధాన్యాన్ని ఆరబోస్తున్న తరుణంలో సత్యం ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు.

ప్రభుత్వాలు మొద్దు నిద్రపోతుంటే.. వలస కార్మికులను బీఆర్ఎస్ ఆదుకుంది

- ఎట్టకేలకు 12 మంది వలస కార్మికులు సొంతూళ్లకు చేరుకున్నారు: హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దునిద్ర పోతుంటే బీఆర్ఎస్ పార్టీ వలస కార్మికులను ఆదుకుంది. ఉపాధి కోసం జోర్డాన్ దేశానికి వెళ్లి.. అక్కడ చిక్కుకుపోయిన 12 మంది వలస కార్మికులను స్వదేశానికి తీసుకొచ్చి.. వాళ్ల సొంత ప్రాంతాలకు పంపించాం" అని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, వాళ్లకోసం ప్రత్యేక పాలసీ తెస్తామని ఎన్నో చెప్పారని, కానీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని శనివారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. 'తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ బిడ్డలను తీసుకురావడానికి ప్రత్యేకమైన ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ వలస కార్మికులకు బాసటగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. శనివారం తెల్లవారు జామున హైదరాబాద్ చేరుకున్న జోర్డాన్ వలస కార్మికులు హరీశ్ రావును ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జోర్డాన్‌లో అనేక కష్టాలు ఎదుర్కొన్న తమను ఆదుకొని, స్వదేశానికి తిరిగి వచ్చేలా ఎంతో కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీకి, హరీశ్‌కు రుణపడి ఉంటామన్నారు. తాము తిరిగి తెలంగాణకు వచ్చేందుకు సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లినప్పటికీ ఎవరూ స్పందించలేదన్నారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి గోవా వెళ్తున్న గ్రామస్థులు

విమానం ఎక్కిన 'పల్లె'

- ఒకేసారి 500 మంది గ్రామస్థుల విమాన ప్రయాణం
- గోవాలో గ్రామస్థుల మధ్య కుమారుడి నిశ్చితార్థానికి మాజీ మేయర్ తండ్రి వినూత్న నిర్ణయం

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎవరైనా విమానంలో ప్రయాణిస్తే దాని గురించి ఊరంతా చర్చించుకుంటారు. అలాంటిది ఒక గ్రామంలోని 500 మంది ఒకేసారి విమాన ప్రయాణం చేస్తే ఎలా ఉంటుంది? నాగర్‌కర్నూల్ జిల్లా బిజినెపల్లి మండలం, గుడ్లనర్వ గ్రామానికి చెందిన 500 మంది శనివారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని గోవాకు బయలుదేరారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య తండ్రి మేకల అయ్యప్ప తన గ్రామస్థులకు ఏదైనా గుర్తుండిపోయేలా చేయాలని అనుకున్నారు. తన చిన్న కుమారుడు మేకల జగపతి-సోసీల నిశ్చితార్థాన్ని గోవాలో తన గ్రామస్థుల మధ్య జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం దాదాపు రూ.2 కోట్లు ఖర్చుపెట్టి రెండు విమానాలను బుక్ చేశారు. తన స్వగ్రామం గుడ్లనర్వకు చెందిన 500 మందిని రెండు విమానాల్లో గోవాకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. తన తండ్రి ఒక సామాన్య రైతుగా జీవితం ప్రారంభించి గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగారని, తన గ్రామస్థుల కళ్లల్లో ఆనందం చూడాలని తన తమ్ముడి నిశ్చితార్థం గోవాలో ఏర్పాటు చేసి గ్రామస్థులందరినీ విమానం ఎక్కించారని తెలిపారు. గ్రామస్థుల సంతోషమే తమ సంతోషంగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

2029నాటికి భారత్.. అమెరికాను దాటేస్తుంది

- గ్రీక్-అమెరికన్ వైద్య శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఇయోనిడిస్

మునిపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సైన్స్ రంగంలో భారత్ ప్రపంచంలోనే మూడో అత్యధిక పరిశోధన పత్రాలు ప్రచురించే దేశంగా నిలిచిందని అమెరికాలోని స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, గ్రీక్-అమెరికన్ వైద్య శాస్త్రవేత్త జాన్ పీఏ ఇయోనిడిస్ తెలిపారు. ఈ విషయంలో 2029నాటికి భారత్... అమెరికాను దాటేసే అవకాశం ఉందన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్‌లోని వోక్సెన్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. మానవ పురోగతిని కేవలం సాంకేతిక ఆవిష్కరణలతో కొలవలేమని, ప్రతి మానవ జీవితానికి గౌరవం, బాధ్యత, విలువలను జోడించడమే నిజమైన పురోగతి అని చెప్పారు. అభివృద్ధిలో భారత్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఇయోనిడిస్ పిలుపునిచ్చారు. స్నాతకోత్సవంలో భాగంగా వివిధ విభాగాలకు చెందిన 800మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. వర్సిటీ వీసీ ప్రవీణ్ కేపులా, రిజిస్ట్రార్ అభిజిత్ షిరోద్కర్, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

బస్సుల్లోనూ విమానంలో మాదిరిగా..

ఆర్టీసీ బస్సుల్లోనూ విమాన ప్రయాణికుల తరహాలో సమాచార వివరాల్ని అందిస్తున్నారు. బస్సు ఏ డిపో నుంచి బయలుదేరుతుంది, ఎక్కడికి వెళ్తుంది, ఏఏ మార్గాల్లో ప్రయాణిస్తుంది. గమ్యస్థానానికి ఎంత సమయంలో చేరుకుంటుందనే వివరాలన్నింటిని డ్రైవర్ లేదా కండక్టర్ ప్రయాణికులకు వివరిస్తారు.

చరిత్ర పుటల్లోకి ఫిల్మ్ చాంబర్?

30 ఏళ్ల భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం.. భారీ వాణిజ్య భవనం నిర్మాణానికి కసరత్తు

- చెన్నై నుంచి వచ్చాక ఇండస్ట్రీకి అదే కూడలి
- ఒక ఫ్లోర్ మీకిచ్చేస్తాం పైకెళ్లమంటున్నారు
- స్కెచ్ గీసిన ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ
- చాంబర్‌లోని కొందరు నేతల వంతపాట

(సినిమా డెస్క్)



గత మూడు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్ చాంబర్ భవనం తెలుగు సినీ పరిశ్రమకు ఒక చిరునామాగా మారింది. అక్కడే నిర్మాతల మండలి, నిర్మాతల కోసం నిర్మించిన గదులు, రిక్రియేషన్ క్లబ్ మొదలైనవన్నీ ఉన్నాయి. ఈ ప్రాంతంలో కొందామంటే గజం భూమి దొరకదు. అలాంటిది ఎకరంపైనే విస్తీర్ణంలో ఉన్న ఫిల్మ్ చాంబర్ భవనాలపై కొందరి కన్ను పడింది. అక్కడున్న నిర్మాణాలన్నీ కూల్చేసి, బహుళ అంతస్తుల భవనం కట్టాలని వారు సంకల్పించారు. అయితే, తెలుగు సినీ పరిశ్రమకు వారసత్వంగా వస్తున్న చాంబర్ భవనాలను కూల్చొద్దని మెజారిటీ సభ్యులు కోరుకుంటున్నారు. వీరి విన్నపాలు వినకుండా ఫిల్మ్‌నగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ.. ఫిల్మ్ చాంబర్ పాలక మండలిలో తమకు అనుకూలంగా ఉన్న కొందరితో కలిసి ఏకపక్షంగా భవనాలను కూల్చేందుకు రంగం సిద్ధం చేసింది. చాంబర్ పాలక మండలి గడువు ముగిసినా ఎన్నికలు జరపకుండా ఎప్పటికప్పుడు వాయిదా వేయడానికి కారణం కూడా కొత్త పాలకమండలి వస్తే బహుళ అంతస్తుల భవనం ప్రతిపాదనకు ఎక్కడ అడ్డం పడుతుందోనన్న భయంతోనే అని సభ్యులు ఆరోపిస్తున్నారు.

తొలి అడుగులు

మూడు దశాబ్దాల క్రితం తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి వస్తున్న సమయంలో సినీ పరిశ్రమలో పనిచేసే వారికి ఇళ్ల స్థలాల అవసరాల కోసం ఫిల్మ్‌నగర్ సహకార హౌసింగ్ సొసైటీ ఏర్పడింది. అదే సమయంలో నిర్మాతలు, దర్శకులు, డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిబిటర్ల వాణిజ్య అవసరాల కోసం భవంతులు అవసరమయ్యాయి. జి.హనుమంతరావు, రమేష్ ప్రసాద్, రామానాయుడు, వి.బి.రాజేంద్రప్రసాద్, డి.వి.ఎస్ రాజు, ఎం.ఎస్.రెడ్డి, సత్యచిత్ర సూర్యనారాయణ మొదలైన సినీ ప్రముఖులు ఉమ్మడిగా చేసిన విజ్ఞప్తి మేరకు హౌసింగ్ సొసైటీ రిక్రియేషన్ కోసం ఉద్దేశించిన భూమిలో కొంత చాంబర్‌కు లీజుకు ఇచ్చింది. ఇందులోనే చాంబర్ కొన్ని భవనాలు నిర్మించింది. నిర్మాణానికి సినీ ప్రముఖులు కూడా కొంత విరాళం ఇచ్చారు. రామనాయుడు పది లక్షలు, అల్లు రామలింగయ్య ఐదు లక్షలు.. ఇలా అనేక మంది ప్రముఖులు తమ వంతు సాయాన్ని ఇచ్చారు. అప్పట్లోనే 1.16 కోట్ల రూపాయల ఖర్చు అయిందని అంచనా. తర్వాత నాలుగేళ్లకు నిర్మాతల మండలికి, మరో 8 మంది నిర్మాతలకుహౌసింగ్ సొసైటీ మరికొంత భూమి ఇచ్చి లీజు ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రముఖ నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ కొండ మీద ఉన్న స్థలంలో దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఇలా ఈ స్థలమంతా సినిమా ఇండస్ట్రీకి కేంద్ర బిందువుగా మారింది.

లీజు పూర్తయిందని

ఈ భూమిని 30 సంవత్సరాలకు లీజుకు ఇచ్చారు. లీజు పూర్తయిన తర్వాత ఇరు పక్షాలు సామరస్యంగా లీజును పొడిగించాలా లేదా అనే విషయాన్ని నిర్ణయించుకోవాలని కూడా ఈ ఒప్పందంలో ఉంది. లీజు వచ్చే ఏడాది ముగుస్తుంది. నిర్మాతల మండలికి, నిర్మాతలకు ఇచ్చిన లీజులు మాత్రం 2030 దాకా ఉన్నాయి. ఇక్కడ భూముల ధరలు ఆకాశానికి అంటిన నేపథ్యంలో హౌసింగ్ సొసైటీ మొత్తం భూమిని స్వాధీనం చేసుకొని బహుళ అంతస్తుల భవనాన్ని కట్టాలనే ప్రతిపాదన తెచ్చింది. స్థలంలో చాంబర్, నిర్మాతల మండలి కార్యాలయాలు ఉన్నందున వారి అంగీకారం కోసం ఏడాదిగా చాంబర్‌లో, నిర్మాతల మండలిలలో చర్చలు జరుగుతున్నాయి. అయితే, దీనిపై సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. తెలుగు సినీ పరిశ్రమకు ల్యాండ్‌మార్క్‌గా ఉన్న భవనాలను తీసేయడాన్ని మెజారిటీ సభ్యులు వ్యతిరేకించటం మొదలపెట్టారు. చర్చలు కొనసాగుతుండగానే చాంబర్ పాలక వర్గంలో కొందరు హౌజింగ్ సొసైటీతో చేతులు కలిపి కూల్చివేతకు అనుకూలంగా పావులు కదిపారని వార్తలు గుప్పుమన్నాయి. చాంబర్ అద్దెకు ఇచ్చిన షాపులను, బ్యాంకును ఖాళీ చేయించడం అనుమానాలను బలపరిచింది. ఏం జరుగుతుందో తెలుసుకొనే ప్రయత్నం సభ్యులు చేస్తుంటే చాంబర్ పాలక మండలి నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. "సినీ రంగానికి సంబంధించిన వ్యక్తులందరూ ఒకే చోట ఉండాలని ఇచ్చిన స్థలమిది. చాంబర్ అనగానే ఈ ప్రాంతం వెంటనే గుర్తుకొస్తుంది. 30 ఏళ్ల కిందట తరలివచ్చిన సినిమా పరిశ్రమకు ఈ భవనం సంకేతం. దీన్ని కూల్చటానికి మేము ఒప్పుకోం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం" అని చాంబర్ సభ్యుడొకరు చెప్పారు.

ఇచ్చేది కొంతే

ప్రస్తుతం ఈ స్థలంలో ఉన్న భవనాలలో నిర్మాణ స్థలం 20 వేల చదరపు అడుగులకు మించి ఉండదు. కొత్తగా ప్రతిపాదించిన బహుళ అంతస్తుల భవనంలో 1.70 లక్షల చదరపు అడుగులు ఉంటుందని అంచనా వేస్తున్నారు. చాంబర్‌కు, నిర్మాతల మండలికి, ఇతర ఆఫీసులకు రెట్టింపు స్పేస్ ఇస్తామని ప్రతిపాదిస్తున్నారు. రెట్టింపు స్థలం ఇచ్చినా 40 వేల చదరపు అడుగులకు మించదు. మిగిలిన స్థలాన్ని ఎలా వాడుతారనే విషయంపై సందిగ్ధత నెలకొంది.

లోపాయికారి ఒప్పందాలు

హౌసింగ్ సొసైటీ, చాంబర్, నిర్మాతల మండలి పాలక వర్గాల్లో ఉన్న కీలక సభ్యుల మధ్య లోపాయికారి ఒప్పందాలు జరిగాయని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. లీజ్ ఒప్పందాల ప్రకారం చూసినా, హౌసింగ్ సొసైటీ నియమావళి ప్రకారం చూసినా స్థలాన్ని సినీ రంగాభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని గుర్తు చేశారు. ఫిల్మ్‌నగర్ కో ఆపరేటివ్ సొసైటీకి సూపర్ స్టార్ కృష్ణ తమ్ముడు ఆదిశేషగిరిరావు అధ్యక్షుడిగా ఉన్నారు. జీవించి ఉన్న కొద్దిమంది పాతతరం ప్రముఖుల్లో ఆయన ఒకరు. సినీ పరిశ్రమ అభివృద్ధిలో ఆయన కూడా ఒక భాగం. ఆయన ఆధ్వర్యంలో ఉన్న సొసైటీ.. లీజు సమయం పూర్తి కాకుండానే చాంబర్‌ను ఖాళీ చేయమని ఒత్తిడి పెట్టడం, బహుళ అంతస్థుల ప్రతిపాదన తేవటం దురదృష్టకరమని మరో సభ్యుడు వ్యాఖ్యానించారు.

భవనం సినీ పరిశ్రమకే ఉండాలి

చాంబర్ భవనాలను కడుతున్న సమయంలో నేను అక్కడే ఉండేవాడిని. అక్కడ కుర్చీలు లేకపోతే మా ఆఫీసు నుంచి తీసుకువెళ్లి వేశాం. పరిశ్రమ ఎదగడంలో భాగంగా మారిన భవంతులను కూలగొడతామంటే బాధగా ఉంది. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. ఈ రోజు ఫిల్మ్ నగర్ అంటే హైదరాబాద్‌కే ఐకాన్. సినీ పరిశ్రమకు కేంద్ర బిందువు. అక్కడ జరిగే ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో సినీ పరిశ్రమను భాగస్వామ్యం చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్ హైదరాబాద్‌ను వినోద రంగానికి ప్రపంచంలోనే కేంద్ర స్థానంగా మారుస్తామంటున్నారు. అలాంటప్పుడు ఇక్కడ ఎలాంటి భవంతులు కట్టినా అది తెలుగు పరిశ్రమకు ప్రతిష్టను తెచ్చేదిగా ఉండాలి. దానిలో పరిశ్రమకు సంబంధించిన కార్యక్రమాలు మాత్రమే నిర్వహించుకొనేలా ఉండాలి

-డి.సురేశ్‌బాబు, ప్రముఖ నిర్మాత

ఆఫర్‌లు ఇస్తున్నారు

నాకు 800 చదరపు అడుగుల ఆఫీసు ఉంది. రెండేళ్ల క్రితం దీనిని 20 లక్షల రూపాయలు వెచ్చించి పునఃనిర్మించుకున్నాను. సొసైటీ కమిటీలో ఒక సభ్యుడు వచ్చి, మీరు ఎందుకు అభివృద్ధిని ఆపుతున్నారు? మీకేం కావాలో చెప్పండి సెటిల్ చేస్తాం అన్నారు. ఇండస్ట్రీ పెద్దలందరినీ కూర్చోబెట్టి ఏది మంచిదో తేల్చండి, దానికి సహకరిస్తాను, ప్రభుత్వానికి అయితే ఇప్పుడే వదిలేసి పోతానని చెప్పాను. నాలాగే ఇతరులకు కూడా ఇలాంటి ఆఫర్స్ ఇచ్చారు. కొందరు తీసుకున్నారని విన్నాను. సినీ రంగానికి చెందిన ప్రముఖులందరూ కలిపి విరాళాలు సేకరించి కట్టుకున్న భవంతులు ఇవి. నిర్మించి 30 ఏళ్లే అయ్యింది. ఎందుకు కూల్చేయాలి? అంగీకరించం

- చాంబర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్

ఎన్నికల లింకు ఇదే

చాంబర్ పాలక మండలి సమయం పూర్తయిపోయింది. ఎన్నికలు జరిగి కొత్త కమిటీ ఎన్నికయితే బహుళ అంతస్తుల భవనం వ్యవహారం ఆగిపోయే అవకాశముంది. అందుకే ప్రస్తుత కమిటీని కొనసాగించటానికి కొందరు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. "ఇదే ప్రాంగణంలో ఉన్న గుడి విషయంలో కూడా రచ్చ జరిగింది. నటుడు మోహన్‌బాబు తానే ఛైర్మన్‌గా ప్రకటించుకోవటంపై వివాదం నెలకొంది. కోర్టులో కేసులు కూడా వేశారు. ఇప్పుడు ఈ భూమిపై కూడా అలాంటి పరిస్థితే ఏర్పడే అవకాశముంది. 40 వేల చదరపు అడుగులు చాంబర్‌కు, ఇతరులకు ఇచ్చినా మిగిలిన స్థలాన్ని ఎవరికి విక్రయిస్తారు? ఈ భవంతిని నిర్మించే సంస్థకు ఎంత లబ్ధి చేకూరుతుంది? చర్చ జరగకుండా భవంతులను కూలగొట్టనివ్వం. చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవటానికైనా సిద్ధం" అని మరొక సభ్యుడు వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ప్రభుత్వం కూడా నిరాసక్తత వహించటం పట్ల కూడా కొందరు సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

సీఎస్ఐఆర్-ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ వెంకటమోహన్‌కు విజ్ఞాన్‌శ్రీ అవార్డు


ఎస్.వెంకటమోహన్

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త, నగరంలోని కేంద్ర పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్-ఐఐసీటీలో చీఫ్ సైంటిస్టుగా పనిచేస్తున్న ఎస్.వెంకటమోహన్ ప్రతిష్ఠాత్మక విజ్ఞాన్‌శ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరచిన శాస్త్రవేత్తలకు కేంద్రం ప్రతి ఏటా ఈ పురస్కారాలను ప్రకటిస్తుంది. ఈ రంగంలో విశేష సేవలందించిన ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్‌ను దేశంలోనే అత్యున్నత విజ్ఞాన్‌రత్న పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన ఈ ఏడాది మే 20న కన్నుమూశారు. రెండో అత్యున్నత పురస్కారం విజ్ఞాన్‌శ్రీ దేశవ్యాప్తంగా 8 మందికి ప్రకటించగా అందులో ఎస్.వెంకటమోహన్ ఉన్నారు. ఈ అవార్డులను కేంద్రం శనివారం ప్రకటించింది. వెంకటమోహన్ తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వర్సిటీ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ పూర్తిచేశారు. పర్యావరణం, బయోటెక్నాలజీ, బయో ఎనర్జీలో ఈయన అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. ఆయన రాసిన 450కి పైగా పరిశోధనా వ్యాసాలు అనేక అంతర్జాతీయ, జాతీయ సైన్స్ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి. వ్యర్థ జలాల్లో కొవిడ్ నిర్ధారణ పరిశోధనల్లో కీలకపాత్ర పోషించారు. వెంకటమోహన్ విజ్ఞాన్‌శ్రీ పురస్కారానికి ఎంపికవడంపై సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఐపీఎస్ అధికారిపై రౌడీషీటర్ దాడి

- హైదరాబాద్ చాదర్‌ఘాట్‌లో ఘటన
- సెల్‌ఫోన్ దొంగలను వెంబడించిన సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య
- డీసీపీ, ఆయన గన్‌మన్‌పై కత్తితో దొంగల దాడి..ఇద్దరికీ గాయాలు
- గన్‌మన్ తుపాకీతో డీసీపీ కాల్పులు
- పట్టుబడిన ఓ దొంగ, మరొకరి పరారీ


డీసీపీ చైతన్య కుమార్


దాడి చేసిన అన్సారీ(ఫైల్)

హైదరాబాద్ సిటీ/మంగళ్‌హాట్/అఫ్జల్‌గంజ్/చాదర్‌ఘాట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ హత్య ఘటన మరువకముందే రాష్ట్ర రాజధానిలో ఓ ఐపీఎస్ అధికారిపై దాడి జరిగింది. సెల్‌ఫోన్ దొంగతనం చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను పట్టుకునేందుకు యత్నించిన హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్, ఆయన గన్‌మన్‌పై దొంగలు కత్తితో దాడి చేశారు. దీంతో డీసీపీ తుపాకీతో కాల్పులు జరిపారు. డీసీపీ కాల్పుల్లో గాయపడిన మహ్మద్‌ఒమర్ అన్సారీ అనే రౌడీషీటర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా.. మరో దొంగ పరారయ్యాడు. డీసీపీ చైతన్య పోలీసు కమిషనరేట్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న తర్వాత తన కార్యాలయానికి బయలుదేరారు. 5 గంటల సమయంలో చాదర్‌ఘాట్ విక్టరీ ప్లేగ్రౌండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు సెల్‌ఫోన్ దొంగతనం చేసి పారిపోతుండగా ఆ సమయంలో అటుగా వాహనంలో వెళుతున్న డీసీపీ చైతన్య గమనించారు. దీంతో తన గన్‌మన్ మూర్తితో కలిసి ఆ దొంగలను వెంబడించారు. విక్టరీ ప్లేగ్రౌండ్ వెనుక ఉన్న ప్రాంతానికి వెళ్లేందుకు యత్నించిన దొంగలు ఓ భవనంపైకి ఎక్కి గ్రౌండ్‌లోకి దూకేందుకు ప్రయత్నించారు. కానీ, తప్పించుకునేందుకు మార్గం లేక పోలీసులపై కత్తితో దాడికి దిగారు. ఈ క్రమంలో జరిగిన పెనుగులాటలో గన్‌మన్ మూర్తి గాయపడి కిందపడిపోయారు. దీంతో అప్రమత్తమైన డీసీపీ చైతన్య తన గన్‌మన్ తుపాకీ తీసుకుని దొంగలపై రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఆ దొంగల్లో ఒకరి చెయ్యి, కడుపు భాగంలో గాయాలై కుప్పకూలిపోయాడు. మరో దొంగ తప్పించుకుని పారిపోయాడు. గాయపడి పోలీసులకు చిక్కిన దొంగను కాలాపత్తర్ పోలీసుస్టేషన్‌లో రౌడీ షీటర్‌గా ఉన్న మహ్మద్ ఒమర్ అన్సారీగా గుర్తించారు. అతడిని చాదర్‌ఘాట్‌లోని కేర్ ఆస్పత్రికి తరలించారు. దొంగలతో జరిగిన తోపులాటలో డీసీపీ చైతన్య నడుము, తలకు స్వల్ప గాయాలవ్వగా..గన్‌మన్ మూర్తి కాలు, చేతికి గాయాలయ్యాయి. వీరిద్దరికీ కేర్ ఆస్పత్రిలో చికిత్స అందించి ఆ తర్వాత సోమాజీగూడలోని మరో ఆస్పత్రికి తరలించారు. కాగా, డీసీపీపై దాడి ఘటన తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్, సౌత్, సెంట్రల్ జోన్ డీసీపీలు స్నేహ మెహ్రా, శిల్పావల్లిలు పరిస్థితిని సమీక్షించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన సజ్జనార్.. దొంగలను పట్టుకునే క్రమంలో డీసీపీ చైతన్య రెండు రౌండ్ల కాల్పులు జరిపారని తెలిపారు. పోలీసులకు పట్టుబడిన ఒమర్‌పై దొంగతనాలు, దోపిడీలు, మారణాయుధాలు సహా 20 కేసులు ఉన్నాయని, అతనిపై రెండు సార్లు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలులో కూడా పెట్టారని చెప్పారు. ఒమర్‌తో కలిసి పోలీసులపై దాడి చేసి పరారైన మరో దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారని వెల్లడించారు. ఇక, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. దొంగలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలో ఓ ఇంటి యజమాని తీసిన వీడియోను, పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు.

డీసీపీ చైతన్య.. హ్యాట్సాఫ్ : సంజయ్

రౌడీషీటర్ వ్యవహారంలో డీసీపీ చైతన్య, ఆయన గన్‌మెన్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు పోలీసులకు స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దని, ఎంతటివారైనా సరే కఠినంగా వ్యవహరించాల్సిందేనని పోలీసులకు సూచించారు.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు..

ముందుకొచ్చిన ఐదు సంస్థలు



హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతో పాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి ఐదు సంస్థలు టెక్నికల్ బిడ్లు దాఖలు చేశాయి. ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ)ను కోరుతూ నోటీసు ఇవ్వగా.. ఐదు సంస్థలు టెక్నికల్ బిడ్లు వేశాయి. శనివారం సాయంత్రం 5 గంటలకు బిడ్ల దాఖలుకు గడువు పూర్తయింది. దాంతో అధికారులు బిడ్లను తెరిచారు. ఇందులో ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ చెన్నయ్, స్పెయిన్‌కు చెందిన సంస్థ కలిపి జాయింట్ వెంచర్‌గా బిడ్ వేశాయి. ఆ తర్వాత నిప్పాన్ సంస్థ కూడా బిడ్ దాఖలు చేసింది. మొత్తం ఐదు సంస్థలు బిడ్లు వేయడంతో వాటిని పరిశీలించిన అనంతరం షార్ట్‌లిస్ట్ చేసి, ప్రభుత్వానికి అధికారులు నివేదిక అందించనున్నారు. ఆ తర్వాత టెక్నికల్ బిడ్లలో అర్హత సాధించిన సంస్థల నుంచి ఫైనాన్షియల్ బిడ్ల దాఖలు కోరుతూ టెండర్ నోటీసు ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ విషయంలో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తుది నివేదికలో చేసిన సిఫారసులకు అనుగుణంగా డిజైన్లు అందించాలని ప్రభుత్వం కోరిన విషయం విదితమే. బ్యారేజీ పటిష్ఠతపై మదింపు, హైడ్రాలజీ, హైడ్రాలిక్ రివ్యూ, వరదలు/భూకంపాల వంటి విపత్తులను ఎదుర్కోవడంలో బ్యారేజీల సామర్థ్యంపై మదింపు, గేట్లు/పియర్లు/స్టిలింగ్ బేసిన్/కటాఫ్ వాల్స్ వంటి బ్యారేజీలోని కీలక విభాగాలను పటిష్ఠం చేసేందుకు డిజైన్లు అందించడం వంటి సేవలను అందించాలని ఈవోఐలో గుర్తుచేసింది. బ్యారేజీల ప్రస్తుత డిజైన్లతో పాటు ఎన్డీఎస్ఏ నివేదికల్లోని సిఫారసులను పునఃసమీక్షించాలని, ఈ క్రమంలో అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి జియో టెక్నికల్, జియో ఫిజికల్ వంటి పరీక్షలను పరిశీలించాలని, ఈ పరీక్షల ద్వారా బ్యారేజీల్లో అన్ని రకాల లోపాలను గుర్తించాలని కోరింది. ఎన్డీఎస్ఏ సిఫారసుల మేరకు మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకును పటిష్ఠం చేయడం లేదా సురక్షితంగా తొలగించే అంశంపై అధ్యయనం జరిపి తగిన పరిష్కారాలను సూచించాలని తెలిపింది. దాంతో ఈ షరతులన్నిటికి స్పందిస్తూ ఐదు సంస్థలు టెక్నికల్ బిడ్లు దాఖలు చేయడంతో అధికారులు తదుపరి అడుగులు వేయనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.